

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 180

మంగళవారం 20-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సమరానికి సై

నేడు మొహాలీలో ఆస్ట్రేలియాతో తొలి టీ20 ఆడనున్న భారత్ - 12లో



అమ్మకానికి ఎయిరిండియా అనుబంధ సంస్థలు


విలీనానికి తెర తీసిన కేంద్రం - 13లో



కాంగ్రెస్ అధ్యక్ష బరిలోకి థరూర్!

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ నిర్ణయించుకున్నారు.

వివరాలు 6లో



తైవాన్‌ను కాపాడుతాం

తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా ప్రయత్నిస్తే తమ బలగాలు అడ్డుకుంటాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు.

వివరాలు 6లో



బ్రిటన్ రాణికి తుది వీడ్కోలు

బ్రిటన్ దివంగత రాణి ఎలిజబెత్–2 అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు.

వివరాలు 6లో



బీజేపీలోకి అమరీందర్ సింగ్

పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కెప్టెన్ అమరీందర్ సింగ్ సోమవారం బీజేపీలో చేరారు.

వివరాలు 6లో

పారిశ్రామిక పరుగులు

చంద్రబాబు హయాంలో కంటే ఇప్పుడే పెట్టుబడుల సగటు ఎక్కువ

శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ

- స్వయం ఉపాధితో సహా అన్ని రంగాలకు చేయూత
- తద్వారా దేశంలోనే అత్యధికంగా జీఎస్‌డీపీలో 11.43% వృద్ధి నమోదు
- గత ప్రభుత్వ ఐదేళ్లలో ఏటా సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు
- ఈ మూడేళ్ల కాలంలో సగటున రూ.12,702 కోట్లు
- మూడేళ్లలో 99 భారీ యూనిట్ల ప్రారంభం ద్వారా రూ.46,280 కోట్లు
- ఈ యూనిట్ల ఏర్పాటు ద్వారా 62,541 మందికి ఉపాధి
- 35,181 ఎంఎస్‌ఎంఈ యూనిట్ల ప్రారంభంతో 2,11,374 మందికి ఉపాధి
- నిర్మాణంలో రూ.39,655 కోట్ల విలువైన 55 భారీ యూనిట్లు
- చర్చల దశలో రూ.91,109 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులు
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా రూ.1,06,800 కోట్లు
- సకాలంలో రాయితీల వల్ల పారిశ్రామికవేత్తల్లో పెరిగిన విశ్వాసం
- తద్వారా వరుసగా మూడో ఏడాది ఈవోడీబీ ర్యాంకుల్లో ఏపీ ఫస్ట్
- బంగర్, భజాంకా, టాటా, బిర్లా, అదానీ వంటి పారిశ్రామికవేత్తల పెట్టుబడులు.. 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- ఈ అభివృద్ధిని ఓర్వలేక బల్క్ డ్రగ్ పార్క్ ఏపీకి వద్దంటూ టీడీపీ లేఖ


శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, కోవిడ్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా విదేశీ పెట్టుబడుల ప్రవాహం తగ్గినప్పటికీ.. మన రాష్ట్రంలోకి భారీ పెట్టుబడులు వస్తున్నాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక విధానాలు పారదర్శకంగా అమలుచేస్తుండటంతో పారిశ్రామికవేత్తల్లో ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడిందని చెప్పారు. తద్వారా 100 శాతం పారిశ్రామికవేత్తల సర్వే ద్వారా నిర్వహించిన సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 97.89 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం పెరగడంతో భజాంకా (సెంచూరీ ప్లైవుడ్స్), భంగర్ (శ్రీసిమెంట్), సింఘ్వీ (సన్ ఫార్మా), అదానీ, ఆదిత్య మిట్టల్, టాటా, బిర్లా వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు

మిగతా 3వ పేజీలో ▶

"చంద్రబాబు హయాంలో దావోస్ నుంచి వచ్చిన పెట్టుబడుల కంటే మనం దావోస్ నుంచి తెచ్చిన పెట్టుబడులు చాలా ఎక్కువ. కేబినెట్‌లో ఆమోదం తెలిపిన పెట్టుబడి వివరాలు చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఈ రాష్ట్రంలో ప్రజలంతా నా వాళ్లే.. మనకు ఓటు వేయని వారికి కూడా అన్ని పథకాలూ సంతృప్తికర స్థాయిలో అందాలి అన్నది మన ఆలోచన. పరిశ్రమల విషయంలోనూ అంతే. అయితే పారిశ్రామిక వేత్తల్ని కూడా నా వాళ్లు.. నా వాళ్లు కాని వాళ్లు.. అని చంద్రబాబు చూస్తారు. ఈ దుస్థితి ఒక్క మన రాష్ట్రంలోనే.

"బల్క్ డ్రగ్ పార్క్ మన రాష్ట్రానికి వచ్చినందుకు సంతోషించాల్సింది పోయి టీడీపీ దుష్ప్రచారం చేస్తోంది. మాకెందుకు ఆ బల్క్ డ్రగ్ పార్క్ ఇవ్వలేదని పక్కనే ఉన్న తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి ప్రాజెక్టును అడ్డుకోవడమంటే.. ఇంత కన్నా చరిత్రహీనులు ఎవరైనా ఉంటారా? వీళ్లను ఏమనాలి?

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

6,16,323 ఉద్యోగాలు

- మూడేళ్లలో రికార్డు స్థాయిలో భర్తీ: సీఎం జగన్ స్పష్టీకరణ
- ఇందులో శాశ్వత ఉద్యోగాలు 2,06,638.. ఔట్ సోర్సింగ్ ద్వారా 3.71 లక్షలు.. కాంట్రాక్ట్ విధానంలో 37,908
- ఆరోగ్య రంగంలో 16,880 మందికి శాశ్వత ఉద్యోగాలు
- 51,387 మంది ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు
- బాబు ఐదేళ్ల హయాంలో శాశ్వత ఉద్యోగాలు 34,108 మాత్రమే

2లో

నాశనం చేసింది నారానే

- పోలవరం నిర్మాణాన్ని చూస్తే బాబు తెలివితేటలు అర్థమవుతాయి: సీఎం జగన్
- అప్రోచ్ ఛానల్ పూర్తికాకుండా కాఫర్ డ్యామ్‌లు చేపట్టి రెండేసి గ్యాప్‌లు వదిలారు
- అందువల్లే గోదావరి వరద ఉధృతికి డయాఫ్రం వాల్ దెబ్బతింది
- తప్పు చేసి ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని మాపై నిందలా?

2లో

న్యూస్‌రీల్

విశాఖపట్నంలో 'చెగ్'



అమెరికాకు చెందిన ప్రముఖ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ 'చెగ్' విశాఖపట్నంలో కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ దేశంలో ఢిల్లీ తర్వాత విశాఖలోనే తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు అవసరమైన అన్ని సేవలను అందిస్తామని చెగ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

వివరాలు 5లో ▸

ఈ-బస్.. ట్రయల్ రన్ సక్సెస్



పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలను కేంద్రంగా చేసుకుని ఎలక్ట్రికల్ బస్సులు నడపాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం అలిపిరి డిపో నుంచి తిరుమలకు ఈ–బస్సును నడిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వీటిని అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు.

వివరాలు 5లో ▸

60 లక్షల మందితో ప్రకృతి సాగు



ప్రకృతి సాగుపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రానికి వచ్చిన 15 దేశాలకు చెందిన ప్రతినిధుల బృందం సోమవారం అనంతపురం జిల్లాలో పర్యటించింది. సాగు విధానాలను, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, వసతుల గురించి తెలుసుకుంది.

వివరాలు 14లో ▸

రెండు రోజుల్లో నీట్ అర్హుల జాబితా



రాష్ట్రానికి చెందిన నీట్ యూజీ అర్హుల జాబితా ఒకటి, రెండు రోజుల్లో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అందనుంది. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 65,305 మంది పరీక్ష రాయగా, 40,344 మంది అర్హత సాధించారు. ఒక్కో సీటుకు సుమారు ఎనిమిది మంది పోటీ పడే అవకాశం ఉంది.

వివరాలు 14లో ▸



రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై 'సుప్రీం' స్పందన

మార్గదర్శి, రామోజీకి నోటీసులు



డిపాజిటర్లకు తిరిగి పూర్తి డిపాజిట్లు చెల్లించారా?

- ఆ వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్ట నిబంధనలకు విరుద్ధంగా రూ.వేల కోట్లను డిపాజిట్ల రూపంలో వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్‌తో పాటు దాని అధినేత రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలంటూ నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే ఇదే వ్యవహారంలో హైకోర్టు నుంచి సానుకూల తీర్పు పొందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తన డిపాజిటర్లకు తిరిగి పూర్తి డిపాజిట్లు చెల్లించిందా? లేదా? అనే వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు తీర్పు...

ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.2,600 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించినందుకు చట్ట ప్రకారం మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలంటూ 2008లో సీఐడీ అధీకృత అధికారి టి.కృష్ణరాజు..

మిగతా 14వ పేజీలో ▶

ఇదీ.. మార్గదర్శి మోసాల కథ!

- చట్ట విరుద్ధంగా రూ.వేల కోట్ల డిపాజిట్ల సేకరణ
- అనుబంధ కంపెనీలకు నిధుల మళ్లింపు
- రికార్డులు ఇవ్వకుండా, తనిఖీలకు సహకరించని మార్గదర్శి
- డిపాజిట్‌దారులకు మార్గదర్శి తిరిగి చెల్లించే పరిస్థితిలో లేదని విచారణాధికారి నివేదిక

14లో

టీడీపీ తీరు షరా మామూలే

- 'వ్యవసాయం'పై బుధవారం చర్చిస్తామన్న ప్రభుత్వం
- అయినా సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు గలాభా
- దీంతో ఒకరోజుపాటు టీడీపీ సభ్యుల సస్పెన్షన్
- వారి తీరుపై స్పీకర్ అసంతృప్తి

10లో


స్పీకర్ పోడియం పైకి ఎక్కి రచ్చ చేస్తున్న టీడీపీ సభ్యులు

ఉప సభాపతిగా 'కోలగట్ల' ఏకగ్రీవం

పోటీలేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు స్పీకర్ ప్రకటన

- వీరభద్రస్వామిని సభాపతి స్థానం వరకు తోడ్కొని వెళ్లిన సీఎం వైఎస్ జగన్
- అందరికీ న్యాయం చేయాలని ఆకాంక్ష
- ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి అరుదైన గౌరవం కల్పించారన్న సభ్యులు

10లో


సభాపతి స్థానం వద్దకు డిప్యూటీ స్పీకర్ కోలగట్లను తీసుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్

'అసెంబ్లీ సీట్ల పెంపు'పై 29న సుప్రీం విచారణ

3లో


ఏలూరు నగరంలో జలమయమైన రహదారి

బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. మంగళవారానికి ఇది తీవ్ర అల్పపీడనంగా మారనుంది. ఈ ప్రభావంతో ఉత్తరాంధ్రలో మంగళ, బుధవారాల్లో ఓ మోస్తరు వర్షాలు, కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏలూరులో అత్యధికంగా 11.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

5లో

సభా సమయం



"మీ ఇష్టం వచ్చిన వాళ్లను అడగండి. పార్టీలతో సంబంధం లేకుండా ఏ తటస్థ వ్యక్తినైనా అడిగి చూడండి. ఈయన్ని (చంద్రబాబు) ముఖ్యమంత్రిగా ఎవరు చేశారయ్యా అని అడుగుతారు. ఇంత వెధవ పని చేసింది ఎవరయ్యా? అని అంటారు. మీరు చేయించిన తప్పును ఎదుట వారిపై రుద్ది వేలెత్తి చూపించేందుకు రకరకాల కుయుక్తులు పన్నుతున్నారు. మా ఖర్మ ఏమిటంటే... మీకే ఈనాడు ఉంది, ఆంధ్రజ్యోతి ఉంది, టీవీ 5 ఉంది. ఎల్లో మీడియా మొత్తం మీదే. అబద్ధాన్ని నిజం చేయడానికి గోబెల్స్ ప్రచారాలు చేస్తున్నారు."

- అసెంబ్లీలో టీడీపీ సభ్యులనుద్దేశించి సీఎం జగన్



నాశనం చేసింది నారానే

పోలవరం నిర్మాణాన్ని చూస్తే బాబు తెలివితేటలు అర్థమవుతాయి: సీఎం జగన్

- అప్రోచ్ చానల్ పూర్తికాకుండా కాఫర్ డ్యామ్‌లు చేపట్టి రెండేసి గ్యాప్‌లు వదిలారు
- అందువల్లే గోదావరి వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది
- సామాన్యుడిని అడిగినా ఈ వెధవ పని చేసింది ఎవరని నిలదీస్తారు
- దాన్ని రిపేర్ చేయడానికి ఎన్నెన్నో కుస్తీలు పడుతున్నాం
- తప్పు చేసి ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని మాపై నిందలా?
- చంద్రబాబు ఎమ్మెల్యేగా కూడా అనర్హుడు
- ప్యాకేజీ బ్రహ్మాండమని సిగ్గు లేకుండా అసెంబ్లీలో చెప్పారు
- నిర్వాసితులకు మిగిల్చింది రూ.193 కోట్లు.. మేం వచ్చాక రూ.1,773 కోట్లిచ్చాం
- రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లింపుపై జీవో కూడా ఇచ్చాం
- భూముల పరిహారాన్నీ ఎకరానికి రూ.5 లక్షలకు పెంచి ఇస్తాం
- పారదర్శకంగా పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నాం.. రూ.500 కోట్ల కోసం వెనుకాడం



ప్రస్తుతం పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరాన్ని చంద్రబాబు ఐదేళ్లలో దగ్గరుండి నాశనం చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా తేటతెల్లం చేశారు. చంద్రబాబు నాశనం చేసిన ప్రాజెక్టును రిపేరు చేయడానికి ఎన్నెన్నో కుస్తీలు పడుతున్నామని చెప్పారు. స్పిల్‌వే, అప్రోచ్ చానల్ పూర్తి చేయకుండా చంద్రబాబు అప్పర్ కాఫర్ డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్‌లు చేపట్టి వాటికి రెండేసి చొప్పున గ్యాప్‌లు వదిలారని తెలిపారు. దీంతో నీరు స్పిల్‌వే పైనుంచి వెళ్లలేక గ్యాప్‌ల గుండా వెళ్లడంతో ఉధృతి పెరిగి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తెలిపారు. ఈ వెధవ పని చేసింది ఎవరని ఏ సామాన్య వ్యక్తిని అడిగినా చంద్రబాబు పేరే చెబుతారని వ్యాఖ్యానించారు. అన్ని తప్పులు చేసి వాటిని తమపై మోపేందుకు చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లతో కూడిన దుష్ట చతుష్టయం కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు. తప్పుల్ని సరి చేసి పోలవరాన్ని యుద్ధప్రాతిపదిక పూర్తి చేసే దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, ఇది వాస్తవమని స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పోలవరంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సీఎం సమాధానం చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలవరం పనుల్లో చంద్రబాబు సర్కారు చేసిన తప్పులను ఎండగట్టారు.

రూ.పది లక్షల పరిహారం ఇస్తాం..

పోలవరంపై ఏం చెప్పామో ఆ మేరకు 2021 జూన్ 30న జీవో జారీ చేశాం. ఆర్ అండ్ ఆర్ కింద చంద్రబాబు హయాంలో రూ.6.86 లక్షలు ఇస్తే మేం అధికారంలోకి వచ్చాక దాన్ని రూ.10 లక్షలు చేస్తామని చెప్పాం. దానికి తగ్గట్లుగా జీవో కూడా ఇచ్చాం. దాని గురించి ఆక్షేపణ లేదు, చర్చ కూడా లేదు. కళ్లుండీ చూడలేకపోతే సమాధానం చెప్పలేం. కళ్లు ఉండి చూడగలిగితే చూడాలని చెబుతున్నా.

- డ్యామ్ పూర్తైన తర్వాత మొదట 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తాం. డ్యామ్ భద్రత, కేంద్ర జల సంఘం నిబంధనల మేరకు ఒకేసారి పూర్తిస్థాయిలో నీటి నిల్వ సరికాదు.
- పోలవరంలో 1,06,006 మంది నిర్వాసిత కుటుంబాలుంటే 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి 20,946 మంది వస్తారు. మిగిలిన 85,060 మంది 45.72 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వస్తారు. 41.15 కాంటూర్ పరిధిలోకి వచ్చే 14,110 మంది నిర్వాసితులకు పునరావాసం పూర్తైంది. దీనికైన ఖర్చు రూ.1,960.95 కోట్లు. వీరిలో 707 మందికి రూ.44.77 కోట్లతో 2014 కంటే ముందే పునరావాసం కల్పించారు. 2014–19 వరకు 3,073 మంది పునరావాసం కోసం రూ.193 కోట్లు ఖర్చు చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు 10,330 మంది నిర్వాసితుల కోసం రూ.1,773 కోట్లు ఖర్చు చేశాం. 41.15 కాంటూర్ వరకు పునరావాస పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అక్టోబర్‌లోగా మిగిలిన 6,836 నిర్వాసిత కుటుంబాలకు కూడా పునరావాసం కల్పించేందుకు ప్రణాళిక ఇచ్చాం.
- 41.15 కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పరిహారాన్ని రూ.6.86 లక్షలకు బదులు రూ.10 లక్షలకు పెంచుతామని చెప్పాం. ఇందుకయ్యే ఖర్చు కేవలం రూ.500 కోట్లు మాత్రమే. దీనికోసం విపక్షాలు బాధపడాల్సిన పని లేదు. బటన్ నొక్కి రూ.6,500 కోట్లు అమ్మఒడికి, రూ.6,700 కోట్లు ఆసరా కోసం, రూ.4,700 కోట్లు చేయూతకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. రూ.500 కోట్లు ఇవ్వలేని పరిస్థితులు వస్తాయని అనుకోవాల్సిన పనిలేదు. 41.15 కాంటూర్ పరిధిలోని వారికి పూర్తిగా పునరావాసం కల్పించేలోపే రూ.500 కోట్లు ఇస్తాం.
- భూములు కోల్పోయిన వారికి గతంలో అతి తక్కువగా ఎకరాకు రూ.1.50 లక్షలు చొప్పున ఇచ్చారు. వారికి కూడా పెంచి రూ.5 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పాం. ఆ మాటకు కట్టుబడి ఉన్నాం.

అర్ధరాత్రి.. సిగ్గు లేకుండా

పోలవరంపై ఖర్చు పెట్టిన రూ.2,900 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు రావాల్సి ఉంది. మనం ఎదురు డబ్బులిచ్చాం. కేంద్రం నుంచి ఆ డబ్బులు ఇంకా రాలేదు. ఈ పరిస్థితికి కారణం ఆ రోజు చంద్రబాబు అర్ధరాత్రి పూట స్పెషల్ ప్యాకేజీకి అంగీకరించడమే. 2011 ప్రకారం పాత రేట్లే ఇస్తాం, అంతకన్నా ఎక్కువ ధర ఇవ్వం అని వాళ్లు చెప్పినప్పుడు... ఏదైనా ప్రాజెక్టు ముందుకు పోయేకొద్దీ రేట్లు పెరుగుతాయి కదా? పెరిగిన రేట్లు మీరు ఇవ్వకపోతే ఎలా? పోలవరం ప్రాజెక్టు అథారిటీ కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీనే కదా? వాళ్లే కదా అమలు చేస్తున్నారు? రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఫెసిలిటేట్ మాత్రమే చేస్తుంది కదా? మరి అలాంటప్పుడు ఇలాంటి నిబంధన పెట్టడం ధర్మమేనా? అని అడగాల్సింది పోయి చంద్రబాబు ఆరోజు గుడ్డిగా అంగీకరించారు. అరుణ్ జైట్లీ అర్ధరాత్రి స్టేట్‌మెంట్ ఇస్తుంటే మీ సుజనా చౌదరి, కేంద్ర కేబినెట్‌లో ఉన్న మీ మంత్రులు అంతా పక్కనే నిలబడి దానికి అంగీకరించారు. మరుసటి రోజు చంద్రబాబు అసెంబ్లీలో బ్రహ్మాండమైన ప్యాకేజీ వచ్చిందని సిగ్గులేకుండా చెప్పారు. దానివల్ల ఇప్పుడు పాత రేట్లే ఇస్తాం అని వాళ్లు గట్టిగా భీష్మించడంతో ఒప్పించడానికి ఎన్నో అగచాట్లు పడుతున్నాం. అగచాట్లు పడుతూనే మరోవైపు రూ.2,900 కోట్లు ఎదురు మన డబ్బులే ఇచ్చాం. ప్రాజెక్టు నిర్మాణంలో మన డబ్బే ఇరుక్కుని ఉంది. ఆ డబ్బులు ఇంకా వెనక్కి తీసుకురాలేకపోతున్నాం. అందుకు కారణం మీ పుణ్యమే.

అసెంబ్లీలో సీఎం ప్రదర్శించిన పోలవరం నాడు-నేడు మరిన్ని చిత్రాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

బాబు దగ్గరుండి నాశనం చేశారిలా..


జూన్ 2019లో అసంపూర్తిగా ఉన్న అప్రోచ్ చానల్ ఆగస్టు 2022కి పూర్తి అయింది ఇలా..


మార్చి 2019లో అసంపూర్తిగా ఉన్న స్పిల్ చానల్ ఆగస్టు 2022కి పూర్తి అయింది ఇలా..


ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల్లో గ్యాప్‌ల ద్వారా ప్రవహిస్తున్న వరద



వరద కారణంగా ఈసీఆర్ఎఫ్‌లో కోతకు గురైన ప్రాంతం



ప్రాజెక్ట్ గ్యాలరీలో చంద్రబాబు కుటుంబం (ఫైల్)

- పోలవరం పనులను చంద్రబాబు ఎలా నాశనం చేశారో మీరే చూడండి. అప్రోచ్ చానల్ తవ్వాల్సిన ప్రాంతంలో పనులు చేయకుండా బీడుగా వదిలేశారు. గోదావరి నది 2.1 కి.మీ. వెడల్పున ప్రవహిస్తుంది. నదిలోకి నీళ్లు వస్తున్నప్పుడు అటువైపు స్పిల్‌వే కట్టాలి. స్పిల్‌వే పూర్తి చేసి నీళ్లు అటువైపు (స్పిల్‌వే వైపు) మళ్లించి అప్పుడు కాఫర్ డ్యామ్ పనులు చేయాలి. కాఫర్ డ్యామ్ తాత్కాలిక నిర్మాణం. అది మెయిన్ డ్యామ్ కట్టడానికి ఫెసిలిటేట్ చేస్తుంది. స్పిల్‌వే పనులు, అప్రోచ్ చానల్ పూర్తి చేసి నీళ్లు మళ్లించే వెసులుబాటు కల్పించాక కాఫర్ డ్యామ్ కట్టాలి. దాని తర్వాత మెయిన్ డ్యామ్ కట్టాలి. కాఫర్ డ్యామ్–1, మధ్యలో మెయిన్ డ్యామ్, ఇటువైపు నుంచి నీళ్లు తన్నకుండా కాఫర్ డ్యామ్–2 కట్టాలి. కాఫర్ డ్యామ్‌లు, మెయిన్ డ్యామ్ పనుల జోలికి వెళ్లకముందే స్పిల్‌వే పనులు పూర్తి కావాలి.
- 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు సీఎంగా ఉన్నానని చెప్పుకునే పెద్దమనిషి చంద్రబాబుకు ఏం తెలివితేటలున్నాయో కానీ ఆయన ఎమ్మెల్యే కావడానికి కూడా అర్హుడు కాదు. ఆ స్థాయిలో మాయ చేసిన మనిషి ప్రపంచ చరిత్రలో ఎవరూ ఉండరు. మీరు చేసిన అన్యాయమైన పని ఏమిటంటే.. స్పిల్‌వే, అప్రోచ్ చానల్ పూర్తికాకుండా, మరోవైపు అప్పర్ కాఫర్ డ్యామ్ పూర్తిచేయకుండా రెండు గ్యాప్‌లు విడిచిపెట్టారు. లోయర్ కాఫర్ డ్యామ్‌లోనూ రెండు గ్యాప్‌లు విడిచిపెట్టారు. దీనివల్ల నీరు అటు స్పిల్‌వే వైపు పోలేక మీరు వదిలిన ఆ గ్యాప్‌ల గుండా వెళ్లింది. 2.1 కి.మీ వెడల్పున వెళ్లాల్సిన నీళ్లు గ్యాప్ తక్కువ కావడంతో వేగం పెరిగి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. మీరు ప్రణాళిక లేకుండా కట్టడం వల్లే ఇలా జరిగింది.
- అప్రోచ్ చానల్ మేం వచ్చేటప్పటికి అసంపూర్తిగా ఉంది. మే నెలలో అప్రోచ్ చానల్ పనులు మొదలుపెట్టి చేశాం. జూన్ 2021 నాటికి అప్రోచ్ చానల్‌లోకి నీళ్లు మళ్లించాం. మార్చి 2022 నాటికి అప్రోచ్ చానల్ పూర్తి చేసి నీళ్లు మళ్లించాం. డ్యామ్ పూర్తి చేసి స్పిల్‌వే గేట్లు కూడా పెట్టాం. ఇప్పుడు నీళ్లు కిందకు వస్తున్నాయి. ఇది ముందుగానే జరగాల్సింది. అలా కాకుండా కాఫర్ డ్యామ్ పనులు మొదలుపెట్టి, అవి పూర్తి కాకుండా 2.1 కి.మీ. పొడవైన గోదావరిలో రెండు గ్యాపులు వదిలేశారు. నీళ్లు ఆ గ్యాపుల గుండా పోవడంతో కోతకు గురైంది. ఇదీ వాస్తవం.
- చంద్రబాబు 2018లో అసలు స్పిల్‌వే పనులు ఏమాత్రం పూర్తి కాకుండానే పునాదులు వేయగా ఆయన కుమారుడు, మనవడు, భార్య.. జయము జయము చంద్రన్నా అంటూ పనులు పూర్తైనట్లు ఇంప్రెషన్ ఇచ్చారు. 2019 మార్చిలో పిల్లర్లు పైకి లేచిన తర్వాత గేట్లు పెట్టాలి. గేట్లు పెట్టిన తర్వాత కానీ స్పిల్‌వే పూర్తి కాదు. కానీ పిల్లర్లు పూర్తవలేదు. మేం వచ్చిన తర్వాత ఈ పనుల్ని ముందుకు తీసుకెళ్లాం.
- జూన్ 2022 నాటికి (సీఎం ఫొటోలను చూపించారు) మీరు వదిలేసిన పనులను పూర్తి చేశాం. గణనీయమైన ప్రగతి అంటే ఇదీ. పిల్లర్లు పూర్తి చేయడమే కాకుండా గేట్లు పెట్టి అప్రోచ్ చానల్ నుంచి నీళ్లు మళ్లించి స్పిల్ చానల్ నుంచి బయటకు వెళ్లేటట్లు చేస్తున్నాం. ఇది చేయకుండా బుద్ధి ఉన్నవారెవరైనా కాఫర్ డ్యామ్ కడతారా? మీ (టీడీపీ సభ్యులు) మాటలు వింటుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

2019 నవంబర్-2022 ఆగస్టు (స్పిల్‌వే ఫొటోలను చూపిస్తూ) పనుల పురోగతిని సీఎం జగన్ వివరించారు

- 2019లో కాఫర్ డ్యామ్‌లో రెండు గ్యాపులను వదిలిపెట్టారు. ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఒక చోట 380 మీటర్ల గ్యాప్, మరోచోట 300 మీటర్ల గ్యాప్ వదిలిపెట్టారు. అంటే 2.1 కి.మీ. వెడల్పున పోవాల్సిన నీళ్లు ఈ రెండు గ్యాప్‌ల నుంచి వెళ్లే పరిస్థితి రావడంతో కోతకు గురైంది. దిగువ కాఫర్ డ్యామ్‌లో ఒకవైపు 680 మీటర్లు, మరోవైపు 120 మీటర్ల గ్యాప్ వదిలారు. నీళ్లన్నీ ఈ గ్యాప్‌ల నుంచే పోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమై కోత ఏర్పడింది. ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్ధరించాల్సి వచ్చింది. డయాఫ్రమ్ కింద నుంచి కోతకు గురైంది. గుంతలు పడ్డాయి. దాన్ని మళ్లీ కట్టుకుంటూ వస్తున్నాం. ఆలస్యం కావడానికి మీరు చేసిన ఈ తప్పుడు పనులే కారణం. మీరు చేసిన తప్పులు మీకు అర్థం కాకపోగా మళ్లీ అవతలి వారిపై వేలెత్తి చూపడానికి మీకు (టీడీపీ) మనసెలా వస్తోంది? మనుషుల్లా ఆలోచన చేస్తున్నారా? రాక్షసుల్లా ఆలోచన చేస్తున్నారా? వేలెత్తి ఎవరిమీదో చూపించాలనే మీ దుర్బుద్ధే కనిపిస్తోంది. మెయిన్ డ్యామ్‌లో కూడా గ్యాపులు ఉంచారు. దీనికి పూర్తిగా మీరే బాధ్యత వహించాలి.
- మొత్తంగా 2021 జూన్ నాటికే అప్పర్ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశాం. అయితే దిగువ కాఫర్ డ్యామ్ 30.5 మీటర్లు ఎత్తు పెంచాల్సిన చోట వరద అనుకున్న దానికన్నా ఎక్కువగా రావడంతో పాటు కేంద్రం నుంచి డిజైన్ల క్లియరెన్స్‌లో జాప్యం జరిగింది. దీనివల్ల దిగువ కాఫర్ డ్యామ్ పనులు అనుకున్న మేరకు వేగంగా జరగలేదు. ఇది 30.5 మీటర్ల ఎత్తుకు కట్టాల్సి ఉండగా 21 నుంచి 23 మీటర్ల ఎత్తువరకే కట్టగలిగారు. ఇక్కడ 680 మీటర్ల వెడల్పుతో ఒకటి, 120 మీటర్ల వెడల్పుతో మరొకటి ఇలా రెండు గ్యాప్‌లను కింద పునాదుల నుంచి వేసుకుని రావడం వల్ల ఆలస్యం అయింది. కొద్దిగా సమయం దొరికితే 30.5 మీటర్ల వరకు దిగువ కాఫర్ డ్యామ్ పూర్తయ్యేది. అయితే వర్షాకాలంలో పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. అక్టోబర్‌లో వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే నవంబరులో పనులు మొదలవుతాయి. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పూర్తి చేసేలా అడుగులు ముందుకు పడతాయి. ఇది వాస్తవం. దీన్ని వక్రీకరించే ప్రయత్నాలు చేస్తే మీరే చులకన అవుతారు. ప్రజలకు అన్నీ తెలుసు. తెలియదని మీరు మాత్రమే అనుకుంటున్నారు.

6,16,323 ఉద్యోగాలు

- స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఈ ప్రభుత్వం వచ్చేసరికి ఉన్న ఉద్యోగాలు 3,97,128
- ఈ మూడేళ్లలోనే అందులో సగం కంటే ఎక్కువ ఉద్యోగాల భర్తీ
- స్వయం ఉపాధి పొందే 55,57,939 మంది అక్కచెల్లెమ్మలకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక చేయూత
- మూడేళ్లలో స్వయం ఉపాధి పథకాల కోసం రూ.19,129.05 కోట్లు వ్యయం
- ఈ చర్యలన్నింటితో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరుగులు



సాక్షి, అమరావతి: స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ప్రభుత్వ రంగంలో రికార్డు స్థాయిలో శాశ్వత ఉద్యోగాలు కల్పించినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2019 మే నాటికి రాష్ట్రంలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య 3,97,128 ఉంటే, అధికారం చేపట్టిన వెంటనే 2,06,638 మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. సోమవారం శాసనసభలో 'పారిశ్రామికాభివృద్ధి–పెట్టుబడులు–రాష్ట్ర ఆర్థిక పరిస్థితి' అంశంపై జరిగిన స్వల్ప కాలిక చర్చకు సీఎం జగన్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల కాలంలో కేవలం 34,108 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తే, తమ ప్రభుత్వం 2,06,638 మందికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. మొత్తంగా సగం ఉద్యోగాలు మనందరి ప్రభుత్వంలోనే భర్తీ చేశామన్నారు. ఇవికాక కాంట్రాక్ట్ రంగంలో మరో 37,908 ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్‌లో 3.71 లక్షల ఉద్యోగాలు.. మొత్తంగా 6,16,323 ఉద్యోగాలు ఇవ్వగలిగామని వివరించారు. ఒక్క గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రమే 1,25,110 ఉద్యోగాలు కల్పించామని, ఇందులో 83- 84 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలే ఉన్నారని.. ఇదొక గొప్ప విప్లవాత్మక మార్పు అని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల దశాబ్దాల వారి కల నెరవేరుస్తూ 51,387 ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. వైద్య ఆరోగ్య రంగంలో రికార్డు స్థాయిలో 16,880 రెగ్యులర్ ఉద్యోగాలు, పాఠశాల విద్యా శాఖలో 6,360 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 'ఆప్కాస్ క్రియేట్ చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గొప్ప మేలు చేశాం. గతంలో ఉద్యోగం ఇచ్చేటప్పుడూ లంచాలే. మళ్లీ జీతాలిచ్చేటప్పుడు కూడా లంచాలు తీసుకునే అధ్వాన్నమైన పరిస్థితి. ఈ వ్యవస్థను మార్చేశాం. 95,212 మంది ఇవాళ ఆప్కాస్‌లో జీతాలు తీసుకుంటున్నారు. ఈ 6.16 లక్షల ఉద్యోగాల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో 2,60,867 మంది వలంటీర్లగా సేవలందిస్తున్నారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌గా పొద్దున్నే లేచి గుడ్ మార్నింగ్ చెబుతూ ప్రజలకు తోడుగా ఉంటున్నారు. నేను చెబుతున్న 6,16,323 మంది ఉద్యోగులు మన కళ్లముందే కనిపిస్తున్నారు. ఎవరైనా జగన్ ప్రభుత్వం ఉద్యోగాలివ్వలేదని చెబితే అవి పచ్చి అబద్ధాలు అని చెప్పడానికి ఈ ఉద్యోగాలే సాక్ష్యం' అని వివరించారు. సీఎం జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

స్వయం ఉపాధికి చేయూత

- స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్ల మీద తాము నిలబడితే తమ కుటుంబాలను పోషించుకునే స్థాయిలోకి వెళ్తారు. అందుకే.. ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా 2,74,015 మంది కుటుంబాలకు సొంతంగా ఆటోలు, టాక్సీలు కొని నడుపుకుంటున్న వారికి మేలు చేస్తోంది.
- రజకులు, టైలర్లు, నాయి బ్రాహ్మణులు వాళ్లంతట వాళ్లే ఇస్త్రీ బండి, సెలూన్ షాపు, కుట్టు మిషన్ పెట్టుకుని జీవిస్తున్న వారికి జగనన్న చేదోడు కింద ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏకంగా 2,98,428 కుటుంబాలకు ప్రతి సంవత్సరం తోడుగా ఉంటూ ఆర్థిక సాయం అందిస్తోంది.
- వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 82 వేల మంది మగ్గం మీద స్వయం ఉపాధిని పొందుతున్న వారికి మేలు చేస్తున్నాం. మత్స్యకార భరోసా కింద 1.20 లక్షల కుటుంబాలకు ఏటా తోడుగా నిలబడుతున్నాం. అన్ని రకాలుగా చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమం చేస్తున్నాం.
- ఎంఎస్ఎంఈ రీస్టార్ట్ పథకం కింద రూ.1,324 కోట్లు సపోర్టు చేసి వారి కాళ్ల మీద వారు నిలబడే కార్యక్రమం చేశాం. ప్రతి ఇంటికీ బియ్యం డోర్ డెలివరీ చేసే వాహనాల ద్వారా 18,520 మందికి మద్దతుగా నిలిచాం. జగనన్న తోడు కింద స్ట్రీట్ హాకర్స్, కూరగాయల అమ్మకం వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసే 15,03,558 మందికి.. వారి జీవనోపాధికి భంగం కలగకుండా, అధిక వడ్డీల బాధ తప్పించి సున్నా వడ్డీకే, ఓడీ మాదిరిగా రుణాలు ఇస్తున్నాం.
- ప్రతి ఆర్బీకే పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, గ్రూపులను ఏర్పాటు చేసి, మిగిలిన రైతులకు కూడా ఉపయోగపడేలా, ఆ యంత్రాల మీద వారి జీవనం గడిపేలా 34,580 మందికి కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా తోడుగా నిలిచాం.
- వైఎస్సార్ చేయూత ద్వారా 24,95,714 మంది అక్కలకు ప్రతి సంవత్సరం రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్ల క్రమం తప్పకుండా ఇస్తున్నాం. బ్యాంకర్లతో టై అప్ చేసి, ఐటీసీ, హిందుస్థాన్ లీవర్, ప్రాక్టర్ అండ్ గాంబిల్, అమూల్ లాంటి కంపెనీల ద్వారా వారి కాళ్లమీద వారు నిలబడేలా చేస్తున్నాం. వైఎస్సార్ కాపు నేస్తం మీద మరో 3,38,792 మంది అక్కలకు తోడుగా నిలబడుతున్నాం. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద 3,92,674 మంది అక్కలకు మంచి చేస్తున్నాం. ఇలా ఏకంగా 55,57,939 మందిని స్వయం ఉపాధి రంగంలో మనం చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. మూడేళ్లలో స్వయం ఉపాధి పథకాల కోసం రూ.19,129.05 కోట్లు వ్యయం చేశాం. అందుకని వారంతా నిలదొక్కుకున్నారు. అందుకే ఇవాళ రాష్ట్రం 11.43 శాతం గ్రోత్ రేట్‌తో దేశంలో నంబర్ వన్‌గా నిలిచింది.

ఉద్యోగాల కల్పన వివరాలు

2014 నుంచి 2019 వరకు బాబు హయాంలో కల్పించిన ఉద్యోగాలు	34,108
2019 మే వరకు ఉన్న ఉద్యోగాలు	3,97,128
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు కల్పించిన ఉద్యోగాలు..	
ఎ. పర్మినెంట్ ఉద్యోగాలు	2,06,638
బి. కాంట్రాక్టు ఉద్యోగాలు	37,908
సి. ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు	3,71,777
ఎ+బి+సి-మొత్తం	6,16,323

శాఖ పేరు	రెగ్యులర్	కాంట్రాక్టు	ఔట్ సోర్సింగ్, ఇతర	మొత్తం
1. వ్యవసాయ, సహకార	133	2	40	175
2. పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య	56	290	26	372
3. బీసీ సంక్షేమం	328	--	41	369
4. పౌర సరఫరాలు	2	116	119	237
5. ఇంధన	639	7694	--	8333
6. ఆర్థిక	92	2	7	101
7. జీఏడీ (ఏపీపీఎస్సీ)	3,784	--	22	3,806
8. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు	1,25,110	---	2,60,867	3,85,977
9. ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమం	16,880	20,502	3,294	40,676
10. ఉన్నత విద్య	136	385	533	1,054
11. గృహ నిర్మాణం	1	--	--	1
12. పరిశ్రమలు, వాణిజ్యం	17	--	46	63
13. ఐటీ, కమ్యునికేషన్స్	--	--	2	2
14. కార్మిక	59	--	22	81
15. మున్సిపల్, పట్టణాభివృద్ధి	25	11	21	57
16. పాఠశాల విద్య	6,361	--	--	6,361
17. స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ	88	814	374	1,276
18. సాంఘిక సంక్షేమం	605	1	152	758
19. ఏపీఎస్ఆర్టీసీ	51,387	--	7,001	58,388
20. గిరిజన సంక్షేమం	650	--	525	1,175
21. జల వనరులు	176	1	--	177
22. మహిళా శిశు సంక్షేమం	90	7	3,403	3,500
23. యువజన సర్వీసు, పర్యాటక	19	3	70	92
ఉప మొత్తం	**2,06,638**	**29,828**	**2,76,565**	**5,13,031**
24. డీఎస్సీ-2008	--	2,193	--	2,193
25. డీఎస్సీ-1998	--	5,887	--	5,887
26. ఆప్కోస్	--	--	95,212	95,212
మొత్తం	**2,06,638**	**37,908**	**3,71,777**	**6,16,323**

సభా సమయం





'అసెంబ్లీ సీట్ల పెంపు'పై 29న సుప్రీం విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు అంశంపై సుప్రీంకోర్టు ఈ నెల 29న విచారించనుంది. అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించి పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ హృషికేష్‌రాయ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పటికే జమ్ము కశ్మీర్‌లో అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించి దాఖలైన మరో పిటిషన్‌కు పురుషోత్తంరెడ్డి పిటిషన్‌ను జతచేసింది. తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులిచ్చింది. తెలంగాణ అసెంబ్లీ సీట్లను 119 నుంచి 153కు, ఏపీలో అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కు పెంచాలన్న ప్రతిపాదన ఉన్న సంగతి తెలిసిందే.

పారిశ్రామిక పరుగులు

▶ మొదటి పేజీ తరువాయి

పెడుతున్నాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు ఐదేళ్ల పరిపాలనతో పోలిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు అధికంగా వస్తున్నాయని, గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఏటా సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాలిస్తే.. ఇప్పుడది రూ.12,702 కోట్లుగా ఉందన్నారు. సోమవారం ఆయన శాసనసభలో 'పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి' అంశంపై స్వల్పకాలిక చర్చకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఇప్పుడే ఎక్కువ పెట్టుబడులు

- 2021–22కు సంబంధించి దాదాపు 19 రాష్ట్రాలకు చెందిన జీఎస్‌డీపీ వివరాలు ఇప్పటికే విడుదల చేశారు. అందులో 11.43 గ్రోత్ రేట్‌తో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మనం నిలబడ్డాం. ఇది ప్రస్తుత ధరలుగా కాకుండా 2011–12 స్థిర ధరల ప్రకారం. అంటే ధరలు స్థిరంగా ఉన్నా, ఉత్పత్తి పెరగడం ద్వారా ఈ వృద్ధి నమోదు చేయడం గొప్ప విషయం.
- గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంతో పోలిస్తే, మన మూడేళ్ల మూడు నెలల పాలనలో ఏటా సగటున మెరుగైన పెట్టుబడులు సమకూరాయి. భారీ పరిశ్రమలనే తీసుకుంటే, పెట్టుబడుల విలువ రూ.41,280.53 కోట్లు. అంటే ఈ మూడేళ్లలో రాష్ట్రంలో ఏటా సగటున రూ.12,702 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇదే చంద్రబాబు హయాంలో 2014 నుంచి 2019 వరకు చూస్తే ఐదేళ్లకు కలిపి.. రూ.59,968.37 కోట్ల పెట్టుబడితో 215 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అంటే అప్పట్లో ఏటా సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ఈ లెక్కన చంద్రబాబు పాలన కన్నా మనం ముందున్నాం.
- 2019 జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.46,280.53 కోట్ల పెట్టుబడుల ద్వారా 99 భారీ పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించడం వల్ల 62,541 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఇదే సమయంలో 35,181 ఎంఎస్‌ఎంఈలు రూ.9,742.51 కోట్ల పెట్టుబడితో 2,11,374 ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఇవి కాకుండా రూ.39,655 కోట్ల పెట్టుబడులతో మరో 55 భారీ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి ద్వారా 78,792 ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మరో రూ.91,129.24 కోట్ల పెట్టుబడితో మరో 10 ప్రాజెక్టులకు సంబధించి, ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే మరో 40,500 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి.
- ఇవి కాకుండా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయానికి వస్తే విశాఖ, కాకినాడ, కృష్ణా, శ్రీసత్యసాయి జిల్లాలలో నాలుగు భారీ ప్రభుత్వ రంగ సంస్థలు.. హెచ్‌పీసీఎల్, ఓఎన్జీసీ, బీఈఎల్ కంపెనీల పనులు జరుగుతున్నాయి. మొత్తంగా రూ.1,06,800 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీల కార్యకలాపాలు ప్రారంభం కాబోతున్నాయి. తద్వారా 72,900 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వంపై విశ్వాసం

- ప్రపంచాన్నే కుదిపేసిన కోవిడ్ సంక్షోభంతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోయిన పరిస్థితిలో కూడా రాష్ట్రంలో మాత్రం పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు బాగున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడో ఏడాది కూడా నంబర్ 1గా ఉన్నాం.
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గతంలో పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలకు కేవలం 10 శాతం మార్కులే ఉండేవి. ఈ రోజు 100కు 100 మార్కులు వారి అభిప్రాయాల మేరకే వేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలు సంతోషంగా ఉన్నారనడానికి ఇదే నిదర్శనం.
- 2020 ర్యాంకింగ్స్‌లో 97.89 పర్సెంటేజీతో మనం తొలి స్థానం సంపాదించాం. కరోనా మహమ్మారితో పారిశ్రామిక రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ఆ సర్వే నిర్వహించారు. 15 రంగాల్లో 301 సంస్కరణలు, మొట్టమొదటిసారిగా 100 శాతం పారిశ్రామిక వేత్తల మార్కుల ఆధారంగా ర్యాంకులను ప్రకటించారు.
- సర్వేలో 92 శాతం మార్కులు దాటిన ఏడు రాష్ట్రాలను టాప్ అచీవర్స్‌గా ప్రకటించారు. ఇందులో ఏపీ 97.89 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా గుజరాత్ (97.77%), తమిళనాడు(96.67%), తెలంగాణ (94.86%), హరియాణా (93.42%), పంజాబ్ (93.23%), కర్ణాటక (92.16%) ఉన్నాయి. ఇది మన రాష్ట్రానికి గర్వ కారణం.

రూ.2,200 కోట్ల బాబు బకాయిలు చెల్లించాం

- రాష్ట్రంలో అత్యధికంగా ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రోత్సహిస్తున్నాం. ఈ రంగం ద్వారా మూడేళ్లలో దాదాపు 12 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. పారిశ్రామిక రంగానికి రూ.2,858 కోట్లకు పైగా ఇన్‌సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) ఇస్తే.. ఇందులో ఒక్క ఎంఎస్‌ఎంఈ రంగానికి మాత్రమే రూ.2,500 కోట్లు ఇచ్చాం. ఇందులో రూ.2,200 కోట్లు చంద్రబాబు నాయుడు హయాంలో బకాయిలున్నాయి.
- చిన్న చిన్న వాళ్లు పరిశ్రమలు పెడుతున్నారు. వీళ్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇన్సెంటివ్‌లు రాకపోతే వీళ్లు ఎలా పరిశ్రమలు నడపగలుగుతారు? అప్పుడు వాటిలో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? అనే ధ్యాస కూడా గత ప్రభుత్వానికి లేదు. ఏకంగా రూ.2,200 కోట్లు బకాయిలంటే ఎంఎస్‌ఎంఈ రంగాన్ని చంద్రబాబు ఖూనీ చేశారని అర్థం చేసుకోవచ్చు.
- ఇవాళ అటువంటి ఈ సెక్టార్ నిలదొక్కుకుంది. ఎరియర్స్ క్లియర్ చేశాం. ఏటా క్రమం తప్పకుండా ఇన్సెంటివ్‌లు ఇచ్చే కార్యక్రమం జరుగుతోంది. ఒక గొప్ప విప్లవాత్మక మార్పు వల్ల పారిశ్రామిక రంగం నిలబడగలుగుతోంది.



వీళ్లు చరిత్రహీనులు..

- రాష్ట్రానికి రూ.1,000 కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఇస్తాం అని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. 17 రాష్ట్రాలతో పోటీ పడీ 30,000 మందికి ఉపాధి కల్పించే ఈ పార్క్‌ను మనం సాధించుకుంటే, దీన్ని రద్దు చేయాలంటూ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ లేఖలు రాయడం దారుణం. వీళ్లు చరిత్రహీనులు. దేశ వ్యాప్తంగా మూడు పార్కులు మాత్రమే ఇచ్చారు. ఒకటి గుజరాత్, ఇంకొకటి ఆంధ్రప్రదేశ్, మరొకటి హిమాచల్ ప్రదేశ్‌కు వచ్చింది.
- ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ఆ పార్టీ నాయకుడు యనమల రామకృష్ణుడు ఈ పార్క్ వద్దంటూ అధికారికంగా లేఖ రాశారు. దుష్టచతుష్టయం, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోంది. దీన్ని బట్టి వారు ఏ స్థాయికి దిగజారిపోయారో తెలుస్తోంది. వీళ్లు మనుషులేనా.. అని అడగాలనిపిస్తుంది.
- చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దివీస్ అనే ఫార్మాస్యూటికల్ కంపెనీ ఏర్పాటుకు దగ్గరుండి సహకరించారు. ఆ రోజు ఫార్మా రంగం ఇక్కడకి వస్తే పొల్యూషన్ అనిపించ లేదా?
- పూర్తిగా ట్రీట్‌మెంట్ ప్లాంట్ పెట్టడమే కాకుండా.. అన్ని రకాలుగా దీన్ని శుద్ధి చేసి, జీరో డిశ్చార్జ్ కింద కన్వర్ట్ చేసి.. దీన్నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా 40 – 50 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్ వేస్తున్నాం. ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా ఏర్పాటవుతుంది. రూ.1,000 కోట్లతో పార్కు పనులు జరుగుతుంటే అడ్డుకునే కార్యక్రమం చేస్తున్నారు.

- కొద్దిరోజుల క్రితమే గ్రానైట్ పరిశ్రమకూ ప్రోత్సాహకాలు ప్రకటించాం. పరిశ్రమలకు కావాల్సిన స్కిల్డ్ మ్యాన్ పవర్ విషయంలో ఏ రాష్ట్రం పెట్టని విధంగా దృష్టిసారించాం. 75% ఉద్యోగాలు స్థానికులకు రిజర్వ్ చేయాలని చట్టం చేశాం. పారిశ్రామిక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నాం.మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఏది చేయగలుగుతామో అదే చెబుతున్నాం. చెప్పింది చేస్తున్నాం. వీటన్నింటి వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పారిశ్రామిక వేత్తలకు నమ్మకం పెరిగింది.

పారిశ్రామిక దిగ్గజాల చూపు

- రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పారిశ్రామిక దిగ్గజాలు, వారి సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. సెంచురీ ప్లైవుడ్, భజాంకాలు, శ్రీసిమెంట్స్ బంగర్లు, సెన్ ఫార్మా సింఘ్వీలు, బిర్లాలు లాంటి వారంతా రాష్ట్రానికి వస్తున్నారు. కుమార మంగళం బిర్లా తన ప్లాంట్ కోసం ఇక్కడికి వచ్చారు.
- ఇలాంటి పారిశ్రామిక వేత్తలందరికీ పూర్తి స్థాయిలో మద్దతుగా నిలుస్తున్నాం. చంద్రబాబు హయాంలో ఏం కావాలన్నా నా కెంత? అన్నదే ముఖ్యం. అందువల్లే పారిశ్రామికవేత్తలు అప్పట్లో ముందుకు రాలేదు. ఇప్పుడు వస్తున్న వారంతా దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన సంస్థలు, యాజమాన్యాలు.
- ఏ ప్రభుత్వంలోనైనా పరిశ్రమలు వస్తే.. స్థానికంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. రాష్ట్ర జీఎస్‌డీపీ ఆదాయాల్లో కూడా పెరుగుదల రిజిష్టర్ అవుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఈ అంశాలను గమనించే.. సూక్ష్మ, చిన్న–మధ్య తరహా పరిశ్రమల రంగం మీద.. అంటే ఎంఎస్‌ఎంఈలపై మన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

భారీ పరిశ్రమలు, పార్కుల ఏర్పాటులో కీలక మైలు రాళ్లు

- కాకినాడ జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ పార్క్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ఏకంగా రూ.1000 కోట్లు గ్రాంట్ ఇస్తున్నారు. ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిపి రకరకాల ఇన్సెంటివ్‌లు ఇస్తున్నాయి. వీటివల్ల దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు రానున్నాయి.
- వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో 800 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీ ఏర్పాటవుతోంది. అక్కడే మెగా ఇండస్ట్రియల్ హబ్ కూడా వస్తోంది. ఈ రెండింటిని 6,800 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నాం. వైఎస్సార్ ఈఎంసీని కేంద్ర ప్రభుత్వం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్స్(పీఎల్‌ఐ)లో చేర్చింది. తద్వారా ఆ బెనిఫిట్స్ కూడా మనకు వస్తున్నాయి. ఈఎంసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.730.50 కోట్ల గ్రాంట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నాం. వైఎస్సార్ ఈఎంసీ ద్వారా 28,500 ఉద్యోగాలు, మెగా ఇండస్ట్రియల్ హబ్ వల్ల మరో 75 వేల ఉద్యోగాలు రానున్నాయి. ఇదే జిల్లాలోని జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పెట్టే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి.
- దేశ వ్యాప్తంగా 35 మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధి చేస్తున్నాయి. ఇందులో మన రాష్ట్రానికి మూడు వచ్చాయి. విశాఖపట్నం, విజయవాడ, అనంతపురంలో ఈ పార్క్‌లు ఏర్పాటు చేసేలా అడుగులు వేగంగా పడుతున్నాయి.
- రాష్ట్రంలో విశాఖపట్నం–చెన్నై పారిశ్రామిక కారిడార్, చెన్నై–బెంగళూరు పారిశ్రామిక కారిడార్, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి జరుగుతోంది.
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ దిశలో 2 స్కిల్ యూనివర్సిటీలతో పాటు, 30 స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి జిల్లాకు ఒకటి ఉంటుంది. ఇవి కాక ఐటీఐ, పాలిటెక్నిక్ చదువు మానేసిన వారి కోసం ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విధంగా 175 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్‌ను తీసుకువస్తాం.
- ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో రెండో అతి పెద్ద సువిశాల 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. విశాఖపట్నం, కాకినాడలో ఇప్పటికే ప్రధాన పోర్టులు పని చేస్తుండగా, మరో రెండు చోట్ల.. గంగవరం, కృష్ణపట్నం వద్ద కూడా పోర్టులను అభివృద్ధి చేశాం. వాటితో పాటు నెల్లూరు జిల్లా రామాయపట్నం, శ్రీకాకుళం జిల్లా భావనపాడు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, కాకినాడ జిల్లాలో కాకినాడ సెజ్ పోర్టు (ప్రైవేట్ రంగంలో)ను గ్రీన్ ఫీల్డ్ పోర్టులుగా అభివృద్ధి చేస్తున్నాం. వీటి వల్ల పోర్ట్స్ బేస్డ్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు ఊపందుకుంటాయి. వీటితో పాటు 9 ఫిషింగ్ హార్బర్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు తీర ప్రాంతాల్లో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక ఫిషింగ్ హార్బర్ లేదా ఒక పోర్టు ఉండేలా అడుగులు వేస్తున్నాం. ఆ మేరకు రూ.3500 కోట్ల వ్యయంతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వాటిలో తొలి దశలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె, గుంటూరు జిల్లా నిజాంపట్నం, కృష్ణా జిల్లా మచిలీపట్నం, కాకినాడ జిల్లాలోని ఉప్పాడలో నాలుగు ఫిషింగ్ హార్బర్లను వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1,550 కోట్లతో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. మిగతా ఫిషింగ్ హార్బర్లను కూడా దశల వారీగా పూర్తి చేస్తాం. రెండో దశ కింద బియ్యపుతిప్ప, కొత్తపట్నం, పూడిమడక, బుడగట్లపాలెం, ఓడరేవులో పనులు ప్రారంభిస్తాం.
- విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉండగా.. కడప, రాజమండ్రి, కర్నూలులో మూడు దేశీయ విమానాశ్రయాలు పని చేస్తున్నాయి. ప్రైవేట్ భాగస్వామ్యంతో విజయనగరం జిల్లా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అంశం 34 ఎకరాలకు సంబంధించిన వివాదం కోర్టులో ఫైనల్ స్టేజ్‌లో ఉంది. అది త్వరగా పరిష్కారమై.. వచ్చే నెలలో దీనికి శంకుస్థాపన జరుపుకుంటామని ఆశిస్తున్నాను. నెల్లూరు జిల్లాలో దగదర్తి బదులుగా మరొక ప్రాంతంలో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తాం. ఆయా విమానాశ్రయాలకు రోడ్, రైల్ కనెక్టివిటీ అభివృద్ధి చేయడానికి కావాల్సిన అన్ని రకాల చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. విశాఖలో భోగాపురం విమానాశ్రయం పూర్తయ్యే నాటికి రోడ్డు పూర్తి చేయాలన్న లక్ష్యంతో డీపీఆర్ దాదాపు పూర్తయ్యింది.

ప్రజలు బాగుంటే వాళ్లకు బాధ

> 'వారిది బాధ – మాది బాధ్యత' కాబట్టి, ఈ సభ ద్వారా ప్రజల ముందు వాస్తవాలు ఉంచుతున్నా. మూడు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలను చూస్తున్న వారంతా మిగతా వారికి, యంగ్ జనరేషన్‌కూ బాబు అండ్ కో గురించి చెప్పాలి. ప్రజలు బాగుంటే చంద్రబాబు బాధగా, కోపంగా ఉంటాడని.. ప్రజలు బాధగా ఉంటే ఆనందంగా ఉంటాడని చెప్పాలి. అధికారంలో ఉండగా ప్రజలకు మంచి చేసిన చరిత్ర చంద్రబాబుకు లేనే లేదు. అందుకే రాష్ట్రానికి ఏం మంచి జరిగినా తట్టుకోలేక ఒకటే ఏడుపు. ఇలా ఏడ్వటంలో చంద్రబాబును మించిన వారు లేరు.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చంద్రబాబు అండ్ కో తీరుపై సీఎం వైఎస్ జగన్ మండిపాటు

- 14 ఏళ్లు బాబు సీఎం.. చెప్పుకోవడానికి ఒక్క పథకమూ లేదు
- రాష్ట్రానికి మంచి జరగకుండా అడ్డుకునే విషయంలో ఎన్నో ఉదాహరణలు
- రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చినా, వర్షాలు పడి రిజర్వాయర్లు నిండినా, పంటలు బాగా పండినా ఏడుపే ఏడుపు
- ప్రత్యేక ప్యాకేజీ కోసం రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదాను పోగొట్టాడు
- రాష్ట్రానికి అన్ని విధాలా తీరని అన్యాయం చేశారు
- ఇలాంటి బాబును తిరిగి అధికారంలోకి తేవాలన్నది దుష్టచతుష్టయం లక్ష్యం
- అధికారం లేదన్నది వారి బాధ.. రాష్ట్రాభివృద్ధి మా బాధ్యత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిని చూసి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, దాని అనుకూల మీడియా తట్టుకోలేక రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే విధంగా దుష్ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వాళ్ల వ్యక్తి ముఖ్యమంత్రి కుర్చీలో లేడన్న దుర్బుద్ధితో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబులతో కూడిన దుష్టచతుష్టయం రాష్ట్రాన్ని అప్రతిష్టపాలు చేసేలా నీచమైన రాతలు రాస్తున్నారని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసినా, ఇది తన పథకమని చెప్పుకోవడానికి ఒక్కటీ లేదని, అదే రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే విధంగా ఏమి చేశారని అడిగితే చెప్పడానికి అనేక అంశాలున్నాయన్నారు. సోమవారం ఆయన శాసనసభలో 'పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి' అనే అంశంపై స్వల్ప కాలిక చర్చ ముగింపు సందర్భంగా మాట్లాడారు. 'మన ఆర్థిక వ్యవస్థ గురించి, పారిశ్రామిక రంగం గురించి రోజుకో రీతిన దుష్ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో మీడియా పూర్తిగా పోలరైజ్ కావడం బాధాకరమైన వాస్తవం. చంద్రబాబు పాలనలో కంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మన పాలనలో బాగుందని ఏకంగా కాగ్ గణాంకాలతో వివరిస్తే.. చంద్రబాబు కంటే ఈనాడు రామోజీ రావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణలకు ఎక్కువ కోపం వచ్చింది. వీళ్ల పేపర్లలో రాతలు, టీవీలలో చర్చలు చూస్తుంటే వీళ్లు ఎంతలా జీర్ణించుకోలేకపోతున్నారో ఆశ్చర్యం కలిగిస్తోంద'న్నారు. ఇంకా సీఎం జగన్ ఏం చెప్పారంటే..

వారిది ఫెవికాల్ బంధం

- బాబు మీద ఈగ వాలినా కూడా వీళ్లకు కోపం వచ్చేస్తుంది. వీరి బంధం ఫెవికాల్ కంటే పటిష్టమైనది. దోచుకో, పంచుకో, తినుకో అని పూర్తిగా చంద్రబాబునాయుడు దోచేయడం, తర్వాత ఈనాడుకి ఇంత అని, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఇంత, దత్తపుత్రుడుకి ఇంత అని పంచుకునేవారు. ఒక పద్ధతి ప్రకారం జరిగేది కాబట్టి.. ఎవరూ రాయరు, ఎవరూ చూపించరు, ఎవరూ మాట్లాడరు.
- అయితే దేవుడు, ప్రజలు వారికి మొట్టికాయలు వేశారు. వారి ప్రభుత్వం పోయి, మన ప్రభుత్వం వచ్చింది. వచ్చే ఆదాయం పోయింది కాబట్టి.. సహజంగానే జీర్ణించుకోలేక బీపీలు, టెన్షన్‌లు బయట పడుతున్నాయి. ఒక్కోసారి వాళ్ల రాతలు, టీవీల్లో వారి డిబేట్లు చూసి భయమేస్తుంది. అది ఎలాంటి భయమంటే.. ఎక్కడ వాళ్లకు గుండెపోటు వస్తుందేమోనని. ఎందుకంటే ఒక మనిషి మీద ఆ స్థాయిలో ఈర్ష్య పెట్టుకోవడం ఎక్కడా కనీ వినీ ఎరుగం.

వీటన్నింటికీ ఒకే సమాధానం.. చంద్రబాబు

- వ్యవసాయాన్ని దండగ అన్నది ఎవరంటే.. బాబే అంటారు. రైతును దారుణంగా దెబ్బ తీసింది.. పల్లెల్ని ఘోరంగా దెబ్బ తీసింది, కరువుకు కేరాఫ్ అడ్రస్, మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను మోసాలుగా మార్చింది, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి ప్రథమ శత్రువు, మన అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ తప్పింది ఎవరు అంటే.. సమాధానం పెత్తందారీ చంద్రబాబే అని ఎవరైనా చెబుతారు.
- ఇవి కాకుండా సొంత పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచింది, సీఎం పదవి, ట్రస్టు, పార్టీ... అన్నింటినీ లాక్కున్న పుణ్య పురుషుడు, ఆంధ్రప్రదేశ్ విభజనకు తొలి ఓటు వేసింది ఎవరంటే, ఆ తర్వాత రాష్ట్రానికి 10 సంవత్సరాలు రావాల్సిన ప్రత్యేక హోదాను పోగొట్టింది, ప్రత్యేక హోదాను వదులుకుని... పరిశ్రమల్ని, ఉద్యోగాల్ని కూడా తాకట్టు పెట్టి ఈ రాష్ట్రానికి, ఇంటింటికీ ద్రోహం చేసింది, పోలవరం ప్రాజెక్టు కమీషన్ల కోసం ప్రత్యేక హోదాను వదులుకుని ప్రత్యేక ప్యాకేజీ అంతకంటే గొప్పది అని పాంప్లెట్లు వేసి ప్రెస్‌మీట్లు పెట్టి, అసెంబ్లీని సైతం వాడుకుని, రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బ కొట్టిందెవరంటే కూడా బాబే అని చెబుతారు.
- ఎయిర్‌బస్, హైపర్ లూప్, ఒలింపిక్స్, మైక్రోసాఫ్ట్, అమరావతి మొత్తానికి ఏసీ ఇలా రాని పెట్టుబడులను వచ్చాయని చూపించి దొంగ లెక్కలు వేయటంలో అంతర్జాతీయ నిపుణుడు.. 10 ఏళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అయితే... ఓటుకు కోట్లిస్తూ దొరికిపోయి పారిపోయి వచ్చింది.. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో వేల కోట్లు నొక్కేసే డిజైన్‌గా రాజధాని అనే పేరుతో డిసైడ్ చేసి డ్రామా ఆడింది.. ఆ వేల కోట్లు రావన్న భయంతో ఇప్పుడు యాత్రలు పెట్టింది.. ఇలా ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం ఒక్కటే.. చంద్రబాబు అని.
- ఇదీ చంద్రబాబు నాయుడు గుణశీల సంపద. ఇదీ ఆయన క్యారెక్టర్. ఇటువంటి వ్యక్తి గురించి ఎంత ఎక్కువ మాట్లాడినా కూడా తక్కువే. ఇటువంటి చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లో తిరిగి అధికారంలోకి తీసుకుని రావాలి, లేకపోతే దోచుకో, పంచుకో, తినుకో అన్నది ఉండదు.. అని ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడి తాపత్రయం. ఇంత మందితో యుద్ధం చేయగలుగుతున్నామంటే దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలే.

మంచి జరుగుతుంటే ఒకటే ఏడుపు!

బాబు అండ్ కో దుష్టచతుష్టయం మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుంటే ఏడుస్తారు. మన గ్రోత్‌రేట్‌ను చూసి ఏడుస్తారు. మన ఆర్థిక పరిస్థితి వారి హయాంలో కన్నా మెరుగ్గా ఉందని అర్థమవుతుంటే ఏడుస్తారు. మనం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాలకు రూ.1.65 లక్షల కోట్లు డీబీటీ ద్వారా అందించాం అంటే ఏడుస్తారు. పేద పిల్లలకు గవర్నమెంట్ బడిలో ఇంగ్లిష్ మీడియం సీబీఎస్ఈ చదువులు చదివిస్తాం అంటే ఏడుస్తారు. మూడు ప్రాంతాల ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ డీ సెంట్రలైజేషన్ చేస్తాం అంటే ఏడుస్తారు. మన పాలనలో వర్షాలు బాగా పడితే, పంటలు బాగా పండుతుంటే కూడా ఏడుస్తారు. మన రిజర్వాయర్లు వరుసగా నాలుగో ఏడాది నిండితే ఏడుస్తారు. ఇలాంటి ప్రతిపక్షంతో, ఇలాంటి దుష్టచతుష్టయంతో మనం వేగుతున్నాం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు పోషించిన పాత్ర ఏమిటంటే నాలుగు ఉదాహరణలు కూడా దొరకవు. ఈ రాష్ట్రాన్ని నాశనం చేయడంలో ఆయన పాత్ర ఏమిటంటే ఉదాహరణలు కోకొల్లలు.



సూఫీ కవిత్వం చదివితే, దేవుడిలో నమ్మకం లేకపోయినా
ఆ కవిత్వంలోని ఈశ్వరుణ్ణి ప్రేమించకుండా నిలవలేడు
ఏ సహృదయుడూ. అట్లాంటి ఈశ్వరుడే వుంటే ఇంకేంకావాలి?
– చలం

సాక్షి
మంగళవారం, సెప్టెంబర్, 20

అతిథులతో అంతా ఓకేనా?

దక్షిణాఫ్రికాలోని నమీబియా నుంచి మన దేశానికి వచ్చిన 8 ఆఫ్రికన్ చీతాలు ఇక్కడ అంతరించిన వన్యప్రాణి జాతిని పునరుద్ధరించడానికి పనికొస్తాయా? భారత ప్రధాని మోదీ తన జన్మదినం సందర్భంగా శనివారం మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయోద్యానంలోకి వదిలిపెట్టిన ఈ 'అతిథుల' గురించి అంతటా ఆసక్తిగా సాగుతున్న చర్చ ఇది. భారత భూభాగంపై ఆసియా ప్రాంత చీతాలు అంతరించిన 70 ఏళ్ళ పైచిలుకు తర్వాత జరుగుతున్న ఈ సాహసోపేత ప్రయోగంపై సహజంగానే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ఖండాంతర చీతాల దిగుమతిని పలువురు సానుకూల ప్రయత్నంగా భావిస్తుంటే, కొందరు దీనిలోని ప్రతికూల అంశాలు, ప్రభావాలను ప్రస్తావిస్తున్నారు.

గత శతాబ్దపు మొదట్లో ప్రపంచవ్యాప్తంగా లక్ష చీతాలుంటే, 2016లో చివరిసారిగా లెక్కలు వేసినప్పుడు 7100 వన్యప్రాణులే మిగిలాయి. వాటిలోనూ అధిక భాగం ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలో, అతి కొద్దిగా వందలోపు చీతాలు ఇరాన్‌లో ఉన్నాయి. ఒకప్పుడు మన దేశంలో తమిళనాడులోని తిరునల్వేలి నుంచి సువిశాల ఉత్తరాది పచ్చిక మైదానాల దాకా చీతాలు వేలల్లో ఉండేవట. మహారాజుల మృగయా వినోదం, జనాభా విస్ఫోటనంతో తగ్గిన పచ్చిక బయళ్ళ లాంటి కారణాలతో అవి కనుమరుగయ్యాయి. అంతరించిన వన్యప్రాణి జాతిగా 1952లో భారత అధికారిక ప్రకటన నుంచి మన దేశంలో వీటి కథ ఓ గత చరిత్ర. ఒకానొక కాలంలో 6 నుంచి 18 రూపాయలకు వేటాడిన చీతాలను మళ్ళీ పెంచి పోషించి, శతాబ్దాల విధ్వంసాన్ని చక్కదిద్దే యత్నమే 'ప్రాజెక్ట్ చీతా'.

ఈ ప్రయోగానికి తగ్గ అటవీ ప్రాంతం కోసం ఏళ్ళ తరబడి అన్వేషించి, చివరకు కూనోను ఎంపిక చేశారు. వాయవ్య మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయోద్యానం ఒకప్పుడు సమీప గ్వాలియర్ సింధియా మహారాజులకు ఇష్టమైన వేటస్థలం. ప్రపంచంలో ప్రస్తుతం అత్యధికంగా చీతాలున్న నమీబియా నుంచి తెచ్చినవాటిని సెప్టెంబర్ 17న ప్రాథమికంగా ప్రధాని కూనోలోనే విడుదల చేశారు. నెల రోజుల ఏకాంతం తర్వాత 750 చదరపు కి.మీ.ల కూనో సవన్నా అటవీ భూముల్లోకి స్వేచ్ఛగా వదిలేస్తారు. అయితే, ఒకప్పుడు మన దేశంలో సంచరించిన ఏషియాటిక్ రకం చీతాలకు భిన్నమైనవి ఈ ఆఫ్రికన్ చీతాలు. వీటిని ఇలా తమ సహజ ఆవాసాల నుంచి భారత్‌కు తరలించడం సరైనది కాదని కొందరు నిపుణుల భావన. అయిదేళ్ళకు రూ. 39 కోట్ల ఖర్చుతో కూడిన ఈ చీతాల తరలింపు, నూతన ఆవాస ప్రక్రియ ఆకర్షణీయమే తప్ప, ఆశించిన ఫలితాలివ్వదన్నది వారి వాదన.

గంటకు 120 కి.మీ.ల వేగంతో, భూతలంపై అత్యంత వేగవంతమైన ప్రాణి అయిన చీతా స్వేచ్ఛగా సంచరించాలంటే సువిశాల ప్రాంతం కావాలి. అలా ఆఫ్రికన్ చీతాలకు తగిన ఆవాసం కానీ, అవి ఆహారంగా తినే రకం ప్రాణులు కానీ భారత్‌లో లేవు. గడ్డిభూములు పెంచాలనే లక్ష్యమూ దీనితో సాధ్యం కాదనేది విమర్శకుల అభిప్రాయం. మరికొందరు మాత్రం ఎక్కడ ఉంటే అక్కడ అలవాటు పడే స్వభావం చీతాలది గనక అతి నిరాశ అవసరం లేదంటున్నారు. నిజానికి, ఇండియన్ టైగర్లు, సింహాల పరిరక్షణ కోసం స్వాతంత్ర్యానంతరం భారత్‌లో చేసిన రెండు ప్రధాన వన్యప్రాణి సంరక్షణ పథకాలూ విజయవంతమయ్యాయి. అయితే, అప్పటికే మన దగ్గరున్న పులులు, సింహాల సంతతిని పెంచడంతో అది సాధ్యమైంది. కానీ, ఈసారి ప్రపంచంలో మునుపెన్నడూ లేని విధంగా ఖండాంతర వన్యప్రాణి దిగుమతి చేపట్టాం. అందుకే, ప్రపంచవ్యాప్త జీవ్యావరణవేత్తలు, జంతు ప్రేమికులు ఈ ప్రయోగాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు.

వన్యప్రాణి పరిరక్షణ సాగాలంటే, వాటి సంఖ్య కన్నా ముందు పెరగాల్సింది అటవీ ప్రాంతం. దేశంలో ప్రస్తుత జాతీయోద్యానాలు, వన్యప్రాణి కేంద్రాలు ఏ మేరకు జీవకోటి పరిరక్షణకు సరిపోతున్నాయో తెలుసుకొనే అధ్యయనాలు ఈమధ్యే మొదలయ్యాయి. హైవేల నిర్మాణం సహా అనేకం వన్యప్రాణి ఆవాసాల పరిధిని కుదించేస్తున్నాయి. తగినంత ఆహారం దొరకక దగ్గరలో ఉన్న జనావాసాలపై అటవీ మృగాల దాడులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. వన్యప్రాణుల కోసమంటూ ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ చేయిస్తున్న ప్రభువులు, వారి పరివారం తీరా తమ హెలిప్యాడ్, గుడారాల కోసం కూనో ఉద్యానంలో పెద్ద సంఖ్యలో చెట్లు కొట్టేశారు. ప్రకృతిపై ప్రేమతోనే చీతాలు తెచ్చామన్న పాలకుల మాటలకూ, ఈ చేతలకూ పొంతన లేదు. మనుషులకూ, వన్యప్రాణులకూ మధ్య ఘర్షణకు దారి తీస్తున్న ఈ జీవ్యావరణ అసమతౌల్యంపై తక్షణం దృష్టి పెట్టాలి.

దేశంలోని గడ్డిభూముల్లో 2005 –15 మధ్య దశాబ్దిలోనే 31 శాతాన్నీ, ఇప్పటికి మొత్తం 95 శాతాన్నీ నాశనం చేసుకున్న భారత్‌లో చీతాలు ఎక్కడ స్వేచ్ఛగా తిరుగుతాయి? విదేశీ చీతాలను తెచ్చుకొని సాకే కన్నా ఇక్కడ అంతరిస్తున్న అడవి పిల్లి జాతులనూ, బట్టమేక పక్షులనూ పరిరక్షించడం మేలు. అసలైతే గుజరాత్ గిర్ అడవి సింహాల తరలింపునకు కూనో జాతీయోద్యానం సరైనది. లెక్కకు మించి సింహాలున్నా వాటిని తరలించడానికీ, సదరు ఆసియా సింహాలున్న ఏకైక ప్రాంతమనే కీర్తి కిరీటాన్ని పోగొట్టుకోవడానికీ గుజరాత్ నిరాకరిస్తోంది. ఆ సింహాల తరలింపునకు అడ్డుకట్టగానే ఇక్కడ చీతాలు పెట్టారనే ఆరోపణలూ లేకపోలేదు. ఇలాంటి అశాస్త్రీయ ధోరణులే వన్యప్రాణి సంరక్షణకు కీడు. ప్రాణులన్నిటినీ ఒకే ప్రాంతానికి పరిమితం చేస్తే, ఏదైనా మహమ్మారి తలెత్తితే మొదటికే మోసం వస్తుందని నిపుణుల హెచ్చరిక. నిపుణుల సూచనలు ప్రభుత్వం పట్టించుకోకుంటే ఏ 'ప్రాజెక్ట్ చీతా' వల్ల ఏం ప్రయోజనం?

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.దశమి రా.8.20 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పునర్వసు రా.9.20 వరకు, తదుపరి పుష్యమి **వర్జ్యం:** ఉ.8.02 నుండి 9.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.44 నుండి 11.31 వరకు **అమృతఘడియలు:** సా.6.40 నుండి 8.24 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

యుద్ధకాలంలో ఆహారమే ముఖ్యం

విశ్లేషణ



అభిజిత్ భట్టాచార్య

యుద్ధాలు ఆహార సంక్షోభాన్ని సృష్టిస్తాయని చరిత్ర పదే పదే రుజువు చేస్తోంది. కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ సైనిక ఘర్షణ కంటే మిన్నగా రైతు, ఎరువు, ఆహారం, దుర్భిక్షం అనేవి అందరినీ కలవరపరుస్తున్నాయి. మందుగుండు సామర్థ్యం, బాంబులు, క్షిపణులు ఇవేవీ ప్రపంచానికి ఇప్పుడు ముఖ్యం కాదు. మెరిసే మెట్రో భవంతులు, స్టాక్ మార్కెట్ బూమ్, పెరుగుతున్న మల్టీ బిలియనీర్ల సంఖ్య ఏ విధంగానూ దేశాలకు రక్షక పాత్ర పోషించలేవు. ఎక్కువ ఉత్పత్తి చేయండి, ఆహార ధాన్యాల నిల్వ పెంచుకోండి అన్నది ఇప్పుడు అత్యవసర సూత్రం. అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద వరి, గోధుమ ఉత్పత్తి దేశాలు కూడా మరింత ఉత్పత్తి కోసం పాట్లు పడుతున్నాయి.

''తిండి లేకుండా ఇది రెండో రోజు. మేమంతా శరీరంలో నీటి చుక్క అనేది లేకుండా అల్లాడిపోయాం. ఇప్పటికే 60 గంటలపాటు మాకు తిండి లేదు. మా సైనికులూ, నేనూ ఎంతకాలం పోషణ లేకుండా ఉంటామో తెలీదు. నా వాచ్ కేసి చూశాను. సరిగ్గా ఉదయం 9.22 నిమిషాలు. 1962 అక్టోబర్ 22 సోమవారం. నేను చైనా ప్రజా విముక్తి సైన్యం ఖైదీగా ఉన్నాను. ఆ సమయానికి 66 గంటలుగా నేను తిండి లేకుండా ఉన్నాను. అలిసిపోయాను. ఆకలితో అలమటించిపోతున్నాను. గడ్డం గీసుకోలేదు. నిరుత్సాహం ఆవరించింది.'' (హిమాలయన్ బ్లండర్; పేజీ: 390; బ్రిగేడియర్ జాన్ పి. దల్వీ)

సార్వభౌమాధికార దేశ యోధులకు తిండి లేకపోతే జరిగేది అదే. సురక్షితమైన స్థావరం నుంచి మండుతున్న హిమాలయ సరిహద్దుకు ఆహార పదార్థాలు సరఫరా చేయడంలో రాజ్య యంత్రాంగం ప్రదర్శించిన నేరపూరితమైన నిర్లక్ష్యానికి ప్రతిఫలం ఇది. యుద్ధరంగంలోని ముందు వరుస యోధుల ఆహార సంక్షోభాన్ని ఎత్తిచూపేలా, సుమారు నెలరోజులపాటు సైనికంగా చైనా అవమానకరమైన దెబ్బ కొట్టింది. ఆకలితో అలమటించిన యోధులు తప్పనిసరై లొంగిపోయి శత్రువు కారాగార అనుభవాన్ని చవిచూడాల్సి వచ్చింది. స్పష్టంగా యుద్ధాలు సరిహద్దుల్లోనూ, వ్యవసాయ క్షేత్రాల్లోనూ కూడా ఆహార సంక్షోభాన్ని పుట్టిస్తాయి.

అదృష్టవశాత్తూ, ప్రపంచ యుద్ధాలు మనకు దూరంగానే ఉంటూ వచ్చాయి. కానీ 1962 నాటి యుద్ధం భారత్ భూభాగంలోనే జరిగింది. కాకపోతే, రెండో ప్రపంచ యుద్ధం తూర్పు భారతదేశంలో విధ్వంసకరమైన దుర్భిక్షాన్ని కొనితెచ్చింది. 1962 చైనా ముట్టడి సమయంలో భారతీయ సైనికులు ఆకలితో అలమటించడానికి ముందు 150 సంవత్సరాల క్రితం 1812లో నెపోలియన్ రెజిమెంట్‌కు చెందిన సైన్యాలు భయంకరమైన ఆహార సరఫరా వైఫల్యం కారణంగా ఆకలి దప్పులతో అలమటించి రష్యా చేతిలో ఊచకోతకు గురయ్యాయి. దాంతో శక్తిమంతమైన ఫ్రాన్స్ సైన్యాలు తక్కువ అంచనా ఉన్న జార్ రోమనోవ్ సైన్యం చేతిలో ఘోర పరాజయం పొందాయి. జార్ గుర్రాలు ఆహార సరఫరాలను సజీవంగా ఉంచడమే రష్యా సైనికుల విజయానికి కారణం.

నేటి రష్యా–ఉక్రెయిన్ సైనిక ఘర్షణ కూడా ఆహార ఉత్పత్తి, వినియోగం, పంపిణీకి సంబంధించి కనీవినీ ఎరుగని అంతర్జాతీయ భయాందోళనలను సృష్టించింది. టోక్యో నుంచి చికాగో వరకు, ఢిల్లీ నుంచి ఢాకా వరకు, కెనడా నుంచి అర్జెంటీనా వరకు ఆహార ధాన్యాలను అధికంగా ఉత్పత్తి చేసే ప్రతి దేశం కూడా యుద్ధ ప్రాంతానికి ఎంతో దూరంలో ఉన్నప్పటికీ ఆందోళన చెందుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ సైనిక ఘర్షణ ఇంత సుదీర్ఘకాలం కొనసాగుతుందనీ, దాని భారం ప్రపంచంపై ఈ స్థాయిలో పడుతుందనీ ఎవరూ ఊహించలేదు. అయితే, పోరాడుతున్న ప్రపంచం కంటే ఆహారం పండిస్తున్న



ప్రపంచమే అగ్రగామి అనే ఎరుక ఇప్పుడు అందరి అనుభవంలోకీ వస్తోంది. కాబట్టే పొరుగున ఉన్న బంగ్లాదేశ్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ (ఏటా 3.60 కోట్ల టన్నులు) తన నిల్వలను పెంచుకోవడానికి భారత్, వియత్నాంలతో 3 లక్షల 30 వేల టన్నుల వరిధాన్యం దిగుమతికి ఒప్పందాలు కుదుర్చుకుంది. యుద్ధ దుష్ఫలితాలతో పెరుగుతున్న దేశీయ ఆహార ధరల వేడిని చల్లార్చుకోవడమే బంగ్లాదేశ్ లక్ష్యం.

భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా (ఏటా 12 కోట్ల టన్నులు), మూడో అతిపెద్ద గోధుమ ఉత్పత్తిదారుగా (ఏటా 10.04 కోట్ల టన్నులు) ఉండి, ఎగుమతులు చేస్తోంది. కానీ జాతీయ ఉత్పత్తిలో పావుశాతం వాటా ఉన్న బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో బలహీనమైన రుతుపవనాల కారణంగా ప్రస్తుత సీజన్‌లో వరి ఉత్పత్తి ప్రమాదంలో పడింది. దీంతో భారత్ కూడా దేశీయ ధరల పెరుగుదలకూ, లాభాలు తెచ్చిపెట్టే ఎగుమతులకూ, బిగుసుకుపోయిన సరఫరా మార్గాలకూ మధ్య సమతుల్యతను తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సీజన్‌లో వరి నాటు 8 శాతం తగ్గింది.

అమెరికా ప్రభుత్వం కూడా, ఒక పంటకు బదులుగా రెండు పంటలు వేయాలని రైతుల మీద ఒత్తిడి తెస్తోంది. ప్రపంచంలో అయిదో అతిపెద్ద గోధుమ ఉత్పత్తిదారుగా (5.5 కోట్ల టన్నులు), ఎగుమతిదారుగా ఉన్న అమెరికాను సైతం యూరప్ యుద్ధం భయపెడుతోంది. ఎందుకంటే స్తంభించిపోయిన ఓడరేవుల్లో గోధుమ పంట ఇరుక్కుపోవడంతో ప్రపంచవ్యాప్తంగా పంపిణీకి, వినియోగదారుకూ మధ్య ఉన్న గొలుసు తెగిపోయింది. అయితే, ఉత్పత్తి పెంచడం వల్ల ఆసియా, యూరప్ వినియోగదారులను చేజిక్కించుకునే మార్గం కూడా అమెరికాకు సుగమం కానుంది. కాబట్టి, ఉక్రెయిన్ యుద్ధం అదనంగా గోధుమ పండించే ఉత్పత్తిదారులకు లాభాలను పండించే మార్గాలను తెరిచింది. ఉక్రెయిన్ పతనం అమెరికాకు లాభంగా మారుతోందన్నమాట.

జపాన్ విషయానికి వస్తే, ఆ ద్వీప భౌగోళిక పరిమితుల కారణంగా ఆహారం నిత్య సమస్యగానే ఉంటోంది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే ఈ సమస్య ఇంకా పెరుగుతుంది. కాబట్టే ప్రపంచంలోనే తొమ్మిదో అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా ఉంటున్నప్పటికీ (77 లక్షల టన్నులు) జపాన్ ఆహార ధాన్యాల దిగుమతిదారుగానే ఉంటోంది. అటు చైనా తైవాన్ ఘర్షణల ప్రమాదం, ఇటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఆహార స్వావలంబన ప్రాముఖ్యతను జపాన్ గుర్తిస్తోంది. స్వదేశంలో పంటల ఉత్పత్తి, ఎరువులు, గింజల విషయంలో వీలైనంత అధికోత్పత్తిని దేశం సాధించాల్సి ఉంటుందని విధాన నిర్ణేతలు గుర్తిస్తున్నారు. పైగా ఆసియాలో తిరుగులేని నావికా శక్తిగా జపానీయులు గుర్తింపు పొందిన రోజులకు ఇప్పుడు కాలం చెల్లిపోయింది. ఈరోజు ప్రత్యక్ష యుద్ధంలో జపాన్ పాల్గొనాల్సి వస్తే దాని ఆహార పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ఒక్క జపాన్ మాత్రమే కాదు, ఆహారోత్పత్తిలో స్వావలంబన సాధించని చాలా దేశాలకూ ఇదే వర్తిస్తుంది.

రష్యా–ఉక్రెయిన్ ఘర్షణ కంటే మిన్నగా రైతు, ఎరువు, ఆహారం, దుర్భిక్షం అనే అంశాలు సామూహికంగా అందరి దృష్టినీ తమ వైపు తిప్పుకొంటున్నాయి. మందుగుండు పేలుళ్ల సామర్థ్యం, బాంబులు, క్షిపణులు, తుపాకులు ఇవేవీ ఇప్పుడు ముఖ్యం కాదు. ప్రపంచ ఆర్థిక పతనం ఎంతగా ఆందోళన కలిగిస్తున్నదంటే, ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద గోధుమ ఉత్పత్తిదారైన కెనడా మరింతగా గోధుమ ఉత్పత్తి చేయడానికి పూనుకుంటోంది. ఆహార సరఫరా, పంపిణీ వ్యవస్థ దీర్ఘకాలం సంక్షోభాన్ని ఎదుర్కొనవలసి వస్తున్న తరుణంలో... ఎక్కువ ఉత్పత్తి చేయండి, ఆహార ధాన్యాల నిల్వ పెంచుకోండి అనేదే ఇప్పుడు అన్ని దేశాలకూ తారక మంత్రం అయిపోయింది.

ఇక భారత్‌లో పాలకుల విధానాల కారణంగా రైతులకు రుణ భారం గుదిబండగా మారుతున్నప్పటికీ, ఆహార స్వావలంబన విషయంలో దేశం అద్భుతమైన విజయాలు సాధించిందనడంలో సందేహం లేదు. 1960 నుంచి ఆయా ప్రభుత్వాలు రైతులకు కల్పించిన ప్రోత్సాహకాలే ఈ విజయానికి కారణం. వ్యవసాయేతర ఆర్థిక సామర్థ్యం కోసం వ్యవసాయాన్నీ, ఆహారోత్పత్తినీ తమ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ రావడంపై ఇప్పుడు జపానీయులు ఆగ్రహిస్తున్నారు. భారత్ సైతం 130 కోట్లకు పైగా జనాభాకు తిండి పెట్టడం తన అత్యంత ముఖ్యమైన బాధ్యత అని గుర్తించి తీరాలి. సుదూర ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో ఆహారోత్పత్తి, వ్యవసాయం దుస్థితికి గురై దుర్భిక్షం కారణంగా సామూహిక ఆకలి పెరిగిన పక్షంలో... మెరిసే మెట్రో భవంతులు, పెరుగుతున్న స్టాక్ మార్కెట్ బూమ్, పెరుగుతున్న బిలియనీర్ల సంఖ్య ఏ విధంగానూ రక్షక పాత్ర పోషించలేవు. ఖాళీ కడుపుతో ఉన్న మనిషికి ఆహారమే దేవుడు అని గాంధీజీ సరిగ్గానే చెప్పారు. కాబట్టి సంక్షుభిత సమయాల్లో జాగరూకతతో, చురుగ్గా ఉండటం చాలా అవసరం.

వ్యాసకర్త రచయిత, కాలమిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సొంపైన సంగీతం



కేవలం వాళ్ళ అంత్యక్రియలు (రెండో ఎలిజబెత్ రాణివి) మాత్రం చూపి, ఏమీ మాట్లాడకుండా ఉంటే బాగుండేది కదా. మంచి దృశ్యాలు చూస్తూ, చక్కగా సంగీతం వినేవాళ్లం.

– ఆన్ ఆపిల్‌బామ్, సీనియర్ ఫెలో

అటువైపూ చూడాలి



'లెస్టర్'లోని స్థానిక హిందువులతో మాట్లాడిన తర్వాత స్పష్టమైనది ఏమంటే, వాళ్లలో అందరూ ముస్లింలను ద్వేషించడం లేదు. అయినప్పటికీ హిందుత్వ అతివాదాన్ని గుర్తించడానికీ, ఖండించడానికీ ఆ వర్గపు నాయకులు సిద్ధంగా లేకపోవడం మహాచెడ్డది.

– రాబర్ట్ కార్టర్, జర్నలిస్ట్

ఇది వివక్ష



ఒక కేసుకు సంబంధించిన కథనంలో ఒక టీవీ ఛానల్ నిందితురాలైన బాలిక ముఖాన్ని 'బ్లర్' చేసి చూపింది. అదే నిందితుడైన అబ్బాయి ముఖాన్ని మాత్రం అలాగే చూపింది. అలా ఎందుకు? చూపితే నిందితులిద్దరి ముఖాన్నీ చూపాలి, లేకపోతే ఇద్దరిదీ బ్లర్ చేయాలి.

– అన్సుల్ సక్సేనా, వ్యాఖ్యాత

ఒప్పుకొంటే తప్పవుతుంది



ఈ లాక్‌డౌన్ నష్టాలను నిరాకరించేవాళ్లను పిలవడానికి నోటికి పట్టుబడే మాట కావాలి: "పిల్లలు త్వరగా బయటపడగలిగారు", "డిప్రెషన్ అనేది ఆత్మహత్యకు దారితీయదు", "లాక్‌డౌన్‌తో ద్రవ్యోల్బణానికి ఏ సంబంధమూ లేదు", ఇలాంటివి. నిరాకరణ అనేది మానసికంగా అవసరం. ఎందుకంటే తెలివైనవాళ్లు అలాంటి విధ్వంసక నిర్ణయానికి మద్దతిచ్చామని ఒప్పుకోరు. కానీ వాళ్లు మద్దతిచ్చారు.

– జయ్ భట్టాచార్య, మెడిసిన్ ప్రొఫెసర్

ప్రేమతోనే శాంతి



ప్రేమ, కరుణను పెంపొందించుకున్నవాళ్లు గొప్ప మనశ్శాంతితో ఉంటారనీ, స్థిరమైన కోపం, భయం మనల్ని అసౌకర్యంగా ఉంచి అనారోగ్యానికి కారణం అవుతాయనీ శాస్త్రవేత్తలకు రుజువులు దొరికాయి. ప్రేమ, కరుణతో వ్యవహరించేవాళ్లు శాంతి సంతోషాలతో ఉంటారని మన కామన్ సెన్స్ కూడా చెబుతుంది.

– దలై లామా, బౌద్ధగురువు

ఎందుకు తోసేస్తారు?



అవును, లెస్టర్ (ఇంగ్లండ్ నగరం)లో ఇస్లామిస్ట్ హింస పెరగడానికి ఆర్ఎస్ఎస్ బాధ్యురాలు. అలాగే పాకిస్తాన్‌లో సున్నీ–షియాల మధ్య, చైనాలో ముస్లింలు–కమ్యూనిస్టుల మధ్య, మయన్మార్‌లో ముస్లింలు–బౌద్ధుల మధ్య, ఇజ్రాయిల్లో ముస్లింలు–యూదుల మధ్య, ఇంకా గ్రీసు, ఆర్మేనియా, టర్కీ, ఫ్రాన్స్, స్వీడన్‌లలో క్రైస్తవులు–ముస్లింల మధ్య గొడవలకు కూడా అదే కారణం.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

వెళ్లిపోవడమే నయం



నేను పాకిస్తాన్‌కు 2011లో వచ్చాక, విదేశాలకు వెళ్లిన విద్యార్థులను తిరిగి వచ్చి, దేశం కోసం ఏదైనా చేయాలని ప్రోత్సహించేదాన్ని. విషాదం ఏమిటంటే, పదకొండేళ్ల తర్వాత, ప్రతి ఒక్కరినీ, ముఖ్యంగా విశేషమైన కుటుంబ నేపథ్యాలు లేనివాళ్లను వీలైతే దేశాన్ని వదిలేయమని ప్రోత్సహిస్తున్నా.

– నిదా కిర్‌మానీ, ఫెమినిస్ట్ సోషియాలజిస్ట్

అన్నదాతను అనుసంధానించాలి

అభిప్రాయం



డాక్టర్ జి.వి. సుధాకర్‌రెడ్డి

ఇది సమాచార విప్లవ యుగం. సరైన సమాచారం ఉత్పత్తిదారుకూ, వినియోగదారునికీ ఉంటే ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా రైతన్నకు కావలసిన సమాచారం అందుబాటులో ఉంటే ఎంతో మేలు జరుగుతుంది.

చాలా సందర్భాలలో ఉత్పత్తిదారులూ, వినియోగదారులూ ఒకే ప్రాంతంలో ఉన్నా ఆ విషయం వారికి తెలియక దూర ప్రాంతాల వారితో క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఉదాహరణకు నా దృష్టికి వచ్చిన ఉదంతం చెబుతాను. సత్యసాయి జిల్లా కదిరిలో పండిన వేరుశనగ వంగడాన్ని నల్లగొండ జిల్లా వాసి కొనుగోలు చేశాడు. కదిరి ప్రక్కనే ఉన్న అన్నమయ్య జిల్లా గాలివీడు మండల వాసికి కదిరిలో ఆ వంగడం ఎవరిదగ్గర ఉందో తెలియక దళారీ ద్వారా నల్లగొండ జిల్లా వాసి నుండి ఎక్కువ ధరకు కొనుగోలు చేశాడు. సమాచారం అందుబాటులో ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది.

సహజంగా ఏ వస్తువైనా ఎక్కువ మొత్తంలో కొనడం వల్ల అమ్మకపుదారునుండి ధరలో రాయితీ లభిస్తుందన్నది వాస్తవం. మన చుట్టు పక్కల వినియోగదారులను కలిపే ఒక అప్లికేషన్ లాంటిది ఉంటే ఒక వీధిలోనో లేదా ఊరులోనో ఉన్నవారందరూ ఉమ్మడిగా తక్కువ ధరకు కొని సరుకును పంచుకోవచ్చు. అలాగే అమ్ముకునేవారికీ ఒకే సారి పెద్ద మొత్తంలో సరుకు అమ్ముడుపోయి లాభం కలుగుతుంది.

చాల సందర్భాల్లో తమ వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రత్యేకత ఉన్నా దానిని లాభదాయకంగా అమ్ముకోవడంలో రైతు విఫలమవుతున్నాడు. రైతుల ఉత్పత్తుల ప్రత్యేకతలను తెలియజేసే ఒక సమాచార వ్యవస్థ ఉంటే వారికి లాభదాయకంగా ఉంటుంది. మన రాష్ట్రంలో ఒక ప్రాంతంలోని ప్రసిద్ధిగాంచిన ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నా ఇంకొక ప్రాంతం వారికి అంతగా తెలియడం లేదు. ఉదాహరణకు రుచికరమైన కోనసీమ చక్కరకేళి అరటిపండ్లు నేపాల్ దేశానికి ఎగుమతి చేస్తారు. 2015 సంవత్సరంలో నేపాల్‌లో సంభవించిన భూకంపం వల్ల వాటిని ఎగుమతి చేయలేక, రోడ్ల మీద పడవేయవలసి వచ్చింది. నిజానికి రాయలసీమ ప్రాంతంలో వాటి గురించి చాలా తక్కువగా తెలుసు. ఒక వేళ తెలిసి ఉంటే



కనీస ధరకన్నా కోనసీమ రైతుల దగ్గర రాయలసీమ వినియోగదారులు కొనుక్కొని ఉండేవారు.

పైన పేర్కొన్నట్లు రైతులకూ, వినియోగదారులకూ సరైన సమాచారం అందించడానికి సచివాలయ వ్యవస్థను బాగా వాడుకోవచ్చు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు రైతు భరోసాకేంద్రాలను అనుసంధానించాలి. ఆయా గ్రామాల్లో పండించే పంటల వివరాలను, రైతు ఫోన్ నంబరుతో సహా సచివాలయ వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇలా రాష్ట్రంలోని సచివాలయాలన్నింటినీ అనుసంధానించి సమాచారం అందరికీ అందుబాటులో ఉంచే సమాచార వ్యవస్థను రూపొందించగలిగితే దేశంలోని ఏ ప్రాంతం వారైనా ఆయా సచివాలయ సిబ్బందితోగానీ లేదా రైతుతోగానీ సంప్రదించి కొనుగోలు చేసే సౌకర్యం కలుగుతుంది. ఇందులో దళారీల ప్రమేయం లేదు కాబట్టి అటు రైతుకూ, ఇటు కొనుగోలుదారునికీ కూడ ప్రయోజనకరంగా ఉంటుంది.

అదేవిధంగా ఒక ప్రత్యేక అప్లికేషన్‌ను ఉపయోగించి ఒక్కో సచివాలయం పరిధిలోని ప్రజలను ఒక కొనుగోలు దారుల గ్రూపుగా తయారుచేయవచ్చు. ఉదాహరణకు సచివాలయ పరిధిలోని ప్రజలు కలసి టమోటా అవసరమనుకుంటే వాటిని ప్రక్క గ్రామంలో ఉన్న రైతే నేరుగా సరసమైన ధరకు అందించవచ్చు. గూగుల్ యాప్‌లో తమకు కావలసిన వస్తువులు దగ్గరలో ఎక్కడ దొరకుతాయో వెబ్‌సైట్‌లో వెతికి తెలుసుకునే సౌకర్యం ఉంది. అటువంటి సౌకర్యమే ఈ అప్లికేషన్‌లో పొందుపరచవచ్చు.

కేవలం రైతు పండించే పంటలకే కాక చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల వివరాలనూ ఈ సమాచార వ్యవస్థలో భాగం చేయాలి. ఇందువల్ల రాష్ట్రంలో ఏఏ ఉత్పత్తులు ఎక్కడెక్కడ ఎంత మొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయో తెలియడమే గాక వాటికి ఉన్న డిమాండ్ కుడా తెలుసుకోవచ్చు. ఇలా సప్లయ్, డిమాండ్‌ల సమాచారం తెలియడం వల్ల వాటి మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నం చేయవచ్చు. ఇలా అయితే ఉత్పత్తిదారుకూ, వినియోగదారునికీ మేలు చేకూరుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు

మూడు రాజధానులు సహేతుకమే!

అభిప్రాయం



కాడె సమ్మయ్య

ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు సహేతుకం, సశాస్త్రీయం. రాజకీయ కారణాల వల్ల రాజధానుల నిర్మాణం 'మూరెడు ముందుకు, బారెడు వెనుక'కు చందంగా సాగుతోంది. అయినా ఎప్పటికైనా విభిన్న భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక కారణాల రీత్యా మూడు పరిపాలనా కేంద్రాల ఏర్పాటు కావలసిందే. ఏపీలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, మధ్యాంధ్ర ప్రాంతాల మధ్య అభివృద్ధి, యాస, భాషల్లో ఎప్పటి నుంచో తేడాలు ఉన్నాయి. ఇందుకు భౌగోళికపరమైన వాతావరణం, నేలల స్వభావం, సముద్ర తీరం వంటివి కూడా కారణాలే. కారణాలు ఏవైనా మధ్యాంధ్ర జిల్లాలైన ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు ఆర్థికంగా మిగతా ప్రాంతాల కంటే బాగా అభివృద్ధి చెందాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమలు ఇప్పటికీ వెనకబడే ఉన్నాయి. వాటిని కూడా అభివృద్ధి చేయడానికే పరిపాలనను వికేంద్రీకరిస్తూ మూడు రాజధానులను ఏర్పాటు చేయాలని ఏపీలో జగన్ ప్రభుత్వం నిర్ణయించింది.



శాసన రాజధానిగా ఇప్పటికే మధ్యాంధ్రలో ఉన్న అమరావతిని కొనసాగించాలనీ, న్యాయరాజధానిగా కర్నూలును చేసి, అందులో హైకోర్టును ఏర్పాటు చేయాలనీ; రాష్ట్రంలోనే పెద్ద నగరమైన విశాఖపట్టణాన్ని పరిపాలనా రాజధానిగా చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు రాజధానిని దగ్గర చేయాలనీ జగన్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం రాజ్యాంగ విరుద్ధమేమీ కాదు. ఇప్పటికే దేశంలో పాలనా వికేంద్రీకరణను పాటిస్తున్న రాష్ట్రాలు పది దాకా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ రాయ్‌పూర్‌లో ఉంటే... హైకోర్టు బిలాస్‌పూర్‌లో పనిచేస్తోంది. గుజరాత్ అసెంబ్లీ, పరిపాలన విభాగం గాంధీనగర్‌లో ఉంటే, హైకోర్టు అహ్మదాబాద్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. కేరళకు సంబంధించి తిరువనంతపురంలో సెక్రటేరియేట్, అసెంబ్లీ ఉంటే... కొచ్చిలో హైకోర్టు పని చేస్తోంది. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో, అసెంబ్లీ, సచివాలయం ఉన్నాయి. జబల్‌పూర్‌లో హైకోర్టు నడుస్తోంది. మహారాష్ట్రలో సమ్మర్ క్యాపిటల్ ముంబై, వింటర్ క్యాపిటల్ నాగ్‌పూర్‌లో ఉంటాయి. ఇక ఒడిశాలోని భువనేశ్వర్‌లో పరిపాలన విభాగం ఉంటే కటక్‌లో హైకోర్టు ఫంక్షన్‌లో ఉంది. రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో ఉంటే... పరిపాలన విభాగం జోధ్‌పూర్‌లో హైకోర్టు నడుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో పరిపాలన, అసెంబ్లీ విభాగాలు ఉంటే... అలహాబాద్‌లో హైకోర్టు పనిచేస్తోంది. ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో అసెంబ్లీ, సెక్రటేరియేట్ ఉన్నాయి. నైనిటాల్‌లో హైకోర్టు ఉంది.

ఏపీలో నెలకొన్న భిన్న భూభౌతిక పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, సాంస్కృతిక వైరుధ్యం, ఆహారం, ఆహార్యం, ఆర్థిక అసమానతల రీత్యా రాజధాని విస్తరణ సహేతుకమే. ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఏళ్లుగా పేరుకుపోయిన భిన్న వైరుధ్యాలను రూపుమాపే కార్యక్రమాలు రూపొందించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అందుకే నేటికీ ప్రత్యేక రాయలసీమ, ప్రత్యేక కళింగసీమ ఉద్యమ నినాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని ప్రజల మధ్య ఏకరీతి మానసిక స్థితి, ఏకాత్మతాభావం, సోదర భావం పెంపొందించే కార్యాచరణ అమలు చేయాలి. అనేక మతాలు, భాషలు, జాతులు, సంస్కృతులు, భూభౌతిక వైవిధ్యాలతో కూడిన భారత దేశాన్ని ఒకే జాతిగా పెనవేయడానికి ప్రజల మధ్య సోదరభావం సృష్టించే వరకు వికేంద్రీకరణ మాత్రమే తారక మంత్రం!

వ్యాసకర్త జర్నలిస్టు । మొబైల్: 90007 01515

ఈ–బస్.. ట్రయల్ రన్ సక్సెస్!



తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లి వచ్చిన ఎలక్ట్రికల్ బస్సు

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను కేంద్రంగా చేసుకుని ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి సంబంధించి ఈ–బస్ ట్రయల్ రన్‌ను సోమవారం అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ–బస్సును తిరుపతి అలిపిరి డిపో నుంచి తిరుమలకు రెండు సార్లు నడిపారు. ఈ ట్రయల్ రన్ విజయవంతం అయినట్లు ఆర్టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) గోపినాథ్ రెడ్డి తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఈ– బస్సులను వినియోగంలోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. కాగా, బస్సు పనితీరును పరిశీలించడానికి విజయవాడ నుంచి ఆర్టీసీకి చెందిన ప్రత్యేక కమిటీ సభ్యులు రవివర్మ, చంద్రశేఖర్, సుధాకర్, వెంకటరత్నం తిరుపతికి వచ్చారు. అనంతరం ఈ–బస్సు సర్వీస్‌ను తిరుపతి ఐఐటీకి చెందిన ప్రొఫెసర్లు శ్రీరామసుందర్, విఘ్నేష్ పరిశీలించారు. బస్సు కండీషన్ పై వారు నివేదిక ఇచ్చిన తర్వాత రెండు మూడు రోజుల్లో మరో 10 ఎలక్ట్రికల్ బస్సులు అలిపిరి డిపోకు చేరుకోనున్నాయి. అలిపిరి నుంచి తిరుమలకే కాకుండా ఇతర ప్రాంతాలకూ ఈ– బస్సులు అందుబాటులోకి రానున్నాయని గోపినాథ్‌రెడ్డి చెప్పారు. ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయని, బ్రహ్మోత్సవాల్లో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు.

విశాఖలో చెగ్ బ్రాంచ్

దేశంలో ఢిల్లీ తర్వాత విశాఖలోనే ఏర్పాటు

అమెరికాకు చెందిన ఈ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా పేరు



చెగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: అమెరికాకు చెందిన ప్రముఖ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ 'చెగ్' విశాఖపట్నంలో కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ దేశంలో ఢిల్లీ తర్వాత విశాఖలోనే తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. కాలిఫోర్నియా కేంద్రంగా 2005లో ప్రారంభమైన చెగ్ సంస్థ.. 2013లో న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ప్రవేశించింది. విద్యార్థులకు ఆన్‌లైన్ ట్యూటరింగ్, మెంటార్, స్కాలర్‌షిప్స్, ఇంటర్న్‌షిప్, అడ్వాన్స్‌డ్ రైటింగ్ తదితర సేవలను చెగ్ సంస్థ అందిస్తుంటుంది. అలాగే డిజిటల్, ఫిజికల్ విధానంలో పాఠ్యపుస్తకాలను అద్దెకు ఇస్తుంటుంది. ఈ సంస్థ 2021లో అమెరికాలో యూనివర్సిటీని కూడా ప్రారంభించింది. ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. విద్యార్థులకు అవసరమైన సేవలతో పాటు ఆన్‌లైన్ సంపాదనకు అత్యంత విలువైన ట్రెండింగ్ మార్గాలు, కెరీర్ గైడెన్స్, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు, దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు అవసరమైన మెటీరియల్‌ను అందించే బ్రాంచ్‌ను విశాఖలో ప్రారంభించినట్లు 'చెగ్' ప్రతినిధులు తెలిపారు.

పరువునష్టం కేసులో సాక్ష్యం దాఖలు చేసిన టీటీడీ

- టీటీడీ తరఫున కోర్టుకు హాజరైన సుబ్రమణ్యస్వామి
- చీఫ్ అఫిడవిట్‌తో పాటు మరికొన్ని పత్రాలు దాఖలు

తిరుపతి లీగల్: ఆంధ్రజ్యోతి పత్రికపై తాము దాఖలు చేసిన రూ. వంద కోట్ల పరువునష్టం దావా కేసులో టీటీడీ సోమవారం తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో సాక్ష్యం(చీఫ్ అఫిడవిట్) దాఖలు చేసింది. టీటీడీ తరఫున ఎంపీ సుబ్రమణ్యస్వామి హాజరై ఆ చీఫ్ అఫిడవిట్‌తో పాటు కోర్టుకు మరికొన్ని డాక్యుమెంట్లను అందజేశారు. కాగా, టీటీడీ తరఫున సుబ్రమణ్యస్వామి వాదించడానికి అర్హత లేదంటూ గతంలో ఆంధ్రజ్యోతి దాఖలు చేసిన పిటిషన్‌ను నెల క్రితం కోర్టు కొట్టివేసింది. అయితే సుబ్రమణ్యస్వామికి కోర్టు ఇచ్చిన అనుమతిపై హైకోర్టులో అప్పీలుకు వెళ్లడానికి ఆ ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీలు ఇంకా తమకు అందలేదని, అందువల్ల తమను క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి వాయిదా కావాలని ఆంధ్రజ్యోతి తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి కేసును అక్టోబర్ 17కి వాయిదా వేశారు.

కోర్టు ఉత్తర్వులు ఆనందం: టీటీడీ తరఫున వాదించడానికి తనకు అనుమతి నిరాకరించాలంటూ ఆంధ్రజ్యోతి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడం తనకు ఆనందంగా ఉందని ఎంపీ సుబ్రమణ్యస్వామి చెప్పారు. ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ పరువుకు విఘాతం కలిగేలా ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాలపై కేసుకు సంబంధించిన పలు పత్రాలను కోర్టుకు ఇచ్చినట్లు తెలిపారు.

'ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో సంబంధం లేదు'



ఒంగోలు: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తమ కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని, అక్కడి వ్యాపారంలో తనకుగానీ, తన కుమారుడికిగానీ కనీసం ఒక్కశాతం వాటా లేదా పెట్టుబడి పర్సంటేజీ లేదని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి ఇటీవల ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తమ కుటుంబం పేరు రావడం పట్ల వివరణ ఇచ్చారు. ఇది రాజకీయంగా జరిగిన దాడి కాదన్నారు. తమ కుటుంబం 70 ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉందని, దక్షిణాదిన 8 రాష్ట్రాలలో తమ కుటుంబం వ్యాపారం నిర్వహిస్తోందని చెప్పారు. ఢిల్లీలో 32 జోన్లకు బిడ్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం పిలిచిందని, అందులో తమ బంధువులు రెండు జోన్లలో వ్యాపారాన్ని దక్కించుకున్నారన్నారు. తనకు ఢిల్లీలో ఎక్కువగా పరిచయాలు ఉండటంతో మాగుంట కుటుంబంలో ఎవరు వ్యాపారం చేసినా అది మాగుంట శ్రీనివాసులురెడ్డి అనుకోవడం పరిపాటి అన్నారు. మా బంధువులు తొలిసారిగా ఉత్తరాది రాష్ట్రాల్లో మద్యం వ్యాపారంలోకి అడుగుపెట్టడాన్ని జీర్ణించుకోలేని అక్కడి వ్యాపారులు కుట్రతో తమపై ఆరోపణలు చేశారన్నారు. అయితే అది తనకు సంబంధం ఉందా లేదా అనేది కూడా వారు తెలుసుకోకుండానే తన పేరును ఉపయోగించారన్నారు. ఈ ఆరోపణల్లో భాగంగానే ఢిల్లీ, చెన్నైల్లోని తమ ఇళ్లల్లో ఈడీ తనిఖీలు చేసిందన్నారు. తనిఖీల్లో ఎటువంటి ముఖ్యమైన పత్రాలు సీజ్ చేయలేదన్నారు. తనిఖీ అనంతరం తమకు అందించిన పంచనామా రిపోర్టు కూడా ఈ విషయం స్పష్టం చేస్తుందన్నారు.

గుంటూరు, విజయవాడలో ఏపీహెచ్‌ఆర్‌సీ క్యాంపు కోర్టులు

కర్నూలు(సెంట్రల్): మానవ హక్కుల ఉల్లంఘన, పరిరక్షణకు సంబంధించిన కేసుల విచారణ కోసం ఏపీహెచ్‌ఆర్‌సీ గుంటూరు, విజయవాడలో క్యాంపు కోర్టులను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ జస్టిస్ ఎం. సీతారామమూర్తి సోమవారం తెలిపారు. 26, 27 తేదీల్లో గుంటూరులోని జెడ్పీ మీటింగ్ హాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన కేసులు, 28, 29, 30 తేదీల్లో విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కేసుల విచారణ కోసం పూర్తిస్థాయి బెంచ్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. పాత కేసుల విచారణ, కొత్త కేసుల నమోదు తదితరాల కోసం సమస్యలను ఎదుర్కొంటున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు చిత్తూరుకు చంద్రబాబు

చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం చిత్తూరు నగరానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి రేణిగుంటకు, అటు నుంచి చిత్తూరులోని జిల్లా జైలుకు చేరుకోనున్నారు. గత నెల కుప్పంలో చంద్రబాబు పర్యటన నేపథ్యంలో రెచ్చిపోయిన ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం, రౌడీయిజం చేయడంతో పోలీసులు కేసులు నమోదుచేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరంతా చిత్తూరులోని జిల్లా జైల్లో ఉన్నారు. వీళ్లను పరామర్శించేందుకు చంద్రబాబు చిత్తూరుకు వస్తున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చిత్తూరు జైలుకు వచ్చి కుప్పం అల్లర్లలో అరెస్టయిన వారితో ములాఖత్ అవుతారు. అనంతరం గంగనపల్లెలోని మాజీ మేయర్ హేమలత ఇంటికి వెళ్లి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోతారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

నేడు, రేపు కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలు

- ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు
- ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షపాతం
- ఏలూరు నగర ప్రజలకు సర్కార్ రక్షణ గోడ.. తప్పిన ముంపు సమస్య

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/సాక్షి, రాజమహేంద్రవరం: వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనానికి అనుబంధంగా ఇది కొనసాగుతోంది. ఇది మంగళవారం నాటికి మరింతగా బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. ఆ తర్వాత ఒడిశా మీదుగా మధ్యప్రదేశ్ వైపు ప్రయాణించి క్రమేపీ బలహీనపడుతుందని వాతావరణ శాఖ, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపాయి. అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. తీరం వెంట గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. మిగిలిన కోస్తా జిల్లాల్లో, రాయలసీమలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు

అల్పపీడన ప్రభావంతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏలూరు నగరంతోపాటు దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం ఉదయం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా వర్షం కురవడంతో రహదారులు ఏరులను తలపించాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి, పాలకొల్లు, భీమవరం ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిశాయి. ఏలూరు జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి రాత్రి వరకు ఆయా మండలాల్లో కురిసిన వర్షపాతం ఇలా ఉంది.. ఏలూరు 113.6, వేలేరుపాడు 46.2, దెందులూరు 26.4, టి.నర్సాపురం 26, కుక్కునూరు 24.6, భీమడోలు 24, లింగపాలెం 22.8, చాట్రాయి 21.2, కొయ్యలగూడెం 20, పెదవేగి 18.6, ముసునూరు 18.4, కైకలూరు 18.4, కలిదిండి 17.2, నూజివీడు 16.8, ముదినేపల్లి 16.4, ద్వారకా తిరుమల 15.4, నిడమర్రు 15.2, మండవల్లి 14.6, గణపవరం 13.4, చింతలపూడి 13.2, పోలవరం 13.2, బుట్టాయగూడెం 12.6, కామవరపుకోట 12.4, పెదపాడు 10.6, ఉంగుటూరు 10.4, జంగారెడ్డిగూడెం 10.2, జీలుగుమిల్లి 7.8, అగిరిపల్లి 5.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో 15.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ విస్తారంగా వానలు పడ్డాయి. తూర్పుగోదావరిలో సగటు వర్షపాతం 9.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. కాకినాడ జిల్లా తీర మండలాల్లోనూ భారీ వర్షం పడింది.

ఏలూరు ముంపు ప్రాంతాల సమస్యకు ప్రభుత్వం చెక్



ఏలూరులో నిర్మాణం పూర్తిచేసుకున్న రిటైనింగ్ వాల్

గతంలో వర్షాకాలం వస్తోందంటే ఏలూరు నగర ప్రజలు గుండెలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి ఉండేది. అలాంటి పరిస్థితి నుంచి వారిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బయటపడేసింది. ఏలూరు నగరాన్ని దాదాపు చుట్టి ఉన్న తమ్మిలేరుకు ఏటా వర్షాకాలంలో వరదలు వచ్చేవి. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నగర ప్రజల సమస్యను నాటి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని వైఎస్సార్ దృష్టికి తెచ్చారు. దీనిపై వైఎస్సార్ తక్షణమే స్పందించి తమ్మిలేరు ఏటిగట్టును పటిష్టపరచడానికి రిటైనింగ్ వాల్ నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వెంటనే నిధులను కూడా విడుదల చేశారు. రూ.78 కోట్ల అంచనా వ్యయంతో తమ్మిలేరు ఏటిగట్టుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంతమేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరిగాయి. అనంతరం వైఎస్సార్ ఆకస్మిక మరణం, అనంతరం వచ్చిన ప్రభుత్వాలతోపాటు గత టీడీపీ ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని నిలిపివేశాయి. దీంతో నగర ప్రజల కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆళ్ల నానిని ఉప ముఖ్యమంత్రి పదవిలో నియమించారు. దీంతో తమ్మిలేరు రిటైనింగ్ వాల్ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వడివడిగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏలూరు అశోక్‌నగర్ నుంచి వైఎస్సార్ కాలనీ వరకు 4.3 కిలోమీటర్ల మేర తమ్మిలేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయింది. మరో 700 మీటర్ల మేర పనులు కూడా వేగవంతంగా కొనసాగుతున్నాయి. దీంతో నగర ప్రజలకు తమ్మిలేరు వరద ప్రమాదం తొలగిపోయింది. అదేవిధంగా కృష్ణా వరదలతో విజయవాడ నగరంలోని కృష్ణలంక, రామలింగేశ్వర నగర ప్రాంతాలకు కూడా గతంలో వరద ముప్పు పొంచే ఉండేది. ఈ సమస్యకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపింది. కృష్ణాలో ఆ ప్రాంతాలకు వరదల నుంచి రక్షణకు గోడ నిర్మించింది.

ఎల్లో మీడియావి తప్పుడు రాతలు

బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: తాత్కాలికం పేరుతో బాబు చేసిన దోపిడీని ఎండగడుతుంటే ఎల్లో మీడియా వత్తాసుగా తప్పుడు రాతలు రాస్తుండటం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 722వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ..అమరావతికి భూములిచ్చిన రైతుల్లో ఓ సామాజిక వర్గం వారి బినామీల ఆధిపత్యమే ఎక్కువగా ఉందని, కానీ దీనిని కప్పిపుచ్చేందుకు వాస్తవాలు బయటకు రాకుండా ఎల్లో మీడియాలో తప్పుడు రాతలు రాస్తుండటం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీ రూ.900 కోట్లతో పార్లమెంటు భవనాన్ని ఏడాదిలో నిర్మాణం పూర్తి చేశారని, సింగపూర్, జపాన్ చేస్తానని చెప్పిన చంద్రబాబుకు అధికారమిచ్చి ఐదేళ్ల వ్యవధి ఇస్తే తాత్కాలిక భవనాలను అరకొరగా కట్టి రూ.10 వేల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అమరావతిలో భూములిచ్చిన రైతుల్లో ఓ సామాజిక వర్గానిదే ఆధిపత్యం ఉంటే ఈనాడులో మాత్రం బహుజనులే ఎక్కువగా భూములు ఇచ్చారని తప్పుడు రాతలు రాయడంపై పలువురు మండిపడ్డారు. గుంతకల్లు ఎమ్మెల్యే ఎల్లారెడ్డి వెంకటరామిరెడ్డి, అనంతపురం జిల్లాకు చెందిన రాష్ట్ర రైతు సంఘం నాయకులు సీసీ నారాయణరెడ్డి తదితరులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

కళా ప్రపూర్ణ.. బోయి భీమన్న!

తెలుగు ప్రజలు గర్వించే దళిత కవి

- బోయి భీమన్న 111వ జయంతి వేడుకలో వక్తలు



భీమన్న చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి ఆర్కే రోజా, తదితరులు

ఏయూ క్యాంపస్/సాక్షి, అమరావతి: తెలుగు ప్రజలు గర్వించే కవిగా బోయి భీమన్న నిలుస్తారని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖలోని ఏయూ హిందీ విభాగంలో ఏపీ అధికార భాష సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బోయి భీమన్న 111వ జయంతి కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు. బోయి భీమన్న సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి తుల్లిమెల్లి విల్సన్ సుధాకర్‌కు ప్రదానం చేసి లోక్‌నాయక్ ఫౌండేషన్ తరఫున రూ 25,000 నగదు పురస్కారాన్ని అందజేశారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ మార్పుకు కారణమైన వారిని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, ఆ కోవకు చెందిన వారే బోయి భీమన్న అని అన్నారు. పాలేరు నుంచి పద్మభూషణ్ వరకు ఉన్న భీమన్న ప్రస్థానం యువతకు ఆదర్శమన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ బోయి భీమన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు.

సామాజిక చైతన్య కవి భీమన్న: మంత్రి రోజా

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కళా ప్రపూర్ణుడు బోయి భీమన్న అని పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. సోమవారం సచివాలయంలో భీమన్న చిత్ర పటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక చైతన్యానికి భీమన్న ఎన్నో రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన ప్రాంతాల్లో ఇళ్లు త్వరగా పూర్తి చేయండి'



సమీక్షలో మంత్రులు రాజన్నదొర, జోగి రమేష్

సాక్షి, అమరావతి : గిరిజన ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల పురోగతిపై డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి జోగి రమేష్‌లు గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి సచివాలయంలో సోమవారం గృహ నిర్మాణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైఎస్సార్–జగనన్న కాలనీల్లో విద్యుత్, నీటి సరఫరా, ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు.

'చీకటి' కథనాలు ఉత్తదే

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



సాక్షి, అమరావతి: 'అప్పుల చీకట్లో డిస్కంలు' శీర్షికతో 'ఈనాడు' అసంబద్ధ కథనాన్ని ప్రచురించటాన్ని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఖండించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు ఆగస్టు నాటికి నెలవారీ వాయిదా కింద చెల్లించాల్సిన అప్పులు రూ.24,838 కోట్లేనని చెప్పారు. డిస్కంల అప్పులు రూ.56 వేల కోట్లు దాటాయని అసత్యాలతో నిరాధార కథనాన్ని ప్రచురించటాన్ని తప్పుబడుతూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీ, వివిధ శాఖలు, స్థానిక సంస్థలు వినియోగించిన విద్యుత్ చార్జీలను వసూలు చేయడం ద్వారా నెలవారీ అప్పులు, జీతభత్యాలు, ఇతర ఖర్చులను సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం కొత్తగా తెచ్చిన ఎలక్ట్రిసిటీ లేట్ పేమెంట్ సర్‌చార్జీ (ఎల్‌పీఎస్) పథకంలో చేరి మొదటి వాయిదాగా గత నెలలో రూ.1,422 కోట్లు చెల్లించినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది జూన్ 3 వరకు బకాయిలను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌ఈసీ) లిమిటెడ్ ద్వారా చెల్లిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల ఆలస్య రుసుము భారం నుంచి మినహాయింపు లభించి డిస్కంలకు ఆర్థికంగా కొంత మేర వెసులుబాటుగా ఉన్నట్లు తెలిపారు.

21న ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లు

తిరుమల: నవంబర్‌కు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 21న ఉదయం 9 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. నవంబర్ నెలలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవ సహా ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 21 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. టికెట్ల లభ్యతను బట్టి మొదట వచ్చిన వారికి మొదట కేటాయింపు ప్రాతిపదికన వీటిని జారీ చేయనున్నారు. నవంబర్‌కు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్లు 21 నుంచి అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ కు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్లు 22న ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. బ్రహ్మోత్సవాల తేదీల్లో అంగప్రదక్షిణం టోకెన్లు కేటాయించబడవు.

బాలికపై అత్యాచారం కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: బాలికను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేసిన యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో న్యాయస్థానం (స్పీడ్ ట్రయల్ కోర్టు) జడ్జి డాక్టర్ ఎస్.రజిని సోమవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సుందరయ్యనగర్ కరకట్ట ప్రాంతానికి చెందిన బాలికపై అదే ప్రాంతానికి చెందిన తన్నీరు నాగార్జున (20) పలుమార్లు అత్యాచారం చేసిన వైనం 2017 ఏప్రిల్ 29న వెలుగులోకి వచ్చింది. అప్పట్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. కేసు విచారణాధికారి విజయవాడ పశ్చిమ పోలీస్ డివిజన్ ఏసీపీ గుణ్ణం రామకృష్ణ నిందితుడిని అరెస్టుచేసి 2021 మే లో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.నారాయణరెడ్డి బాధితురాలి తరఫున వాదనలు వినిపించారు. బాధితురాలికి రూ.4 లక్షల నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థను ఆదేశించారు.

నగదు విరాళాలు రూ.2,000 మించొద్దు

కేంద్రానికి ఈసీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ఎన్నికల సంస్కరణలకు సంబంధించి కీలక ప్రతిపాదనలను కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి తెరపైకి తెచ్చింది. ''పార్టీలకు అందే విరాళాల విషయంలో మరింత పారదర్శకత అవసరం. ప్రస్తుతం రూ.20 వేలున్న అనామక నగదు విరాళాల పరిమితిని రూ.2 వేలకు తగ్గించాలి. మొత్తం విరాళాల్లో అవి 20 శాతానికి/రూ.20 కోట్లకు (ఏది తక్కువైతే దానికి) మించరాదు'' అని పేర్కొంది. ఇలాంటి పలు సంస్కరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయ మంత్రి కిరెణ్ రిజిజుకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ లేఖ రాసినట్టు సమాచారం. వీటికి కేంద్రం ఆమోదం లభిస్తే రూ.2,000కు మించి ప్రతి నగదు విరాళానికీ పార్టీలు లెక్కలు చూపించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా...

ఈడీ ముందుకు కేపీసీసీ చీఫ్ శివకుమార్

సాక్షి బెంగళూరు: కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్(60) సోమవారం ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో విచారణకు రావాలంటూ గురువారం డీకే శివకుమార్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న శివకుమార్ వైద్యులతో పాటు ఈడీ విచారణకు హాజరయ్యారు. కర్ణాటకలో 30 నుంచి ప్రారంభం కానున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ఏర్పాట్లు, అసెంబ్లీ సమావేశాల్లో బిజీగా ఉన్న శివకుమార్‌ను ఈడీ విచారణకు పిలవడం గమనార్హం. రూ.75 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై 2020లో సీబీఐ నమోదు చేసిన కేసుకు సంబంధించిన రెండో మనీ లాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేసింది. ఆయన కుమార్తె ఐశ్వర్యను కూడా ప్రశ్నించింది.

యూకేలో ఆలయాలపై దాడులు... కేంద్రం ఖండన

లండన్: యూకేలోని లీసెస్టర్ నగరంలోని భారతీయులపై దాడులు, అక్కడి ఆలయం ఆవరణలో విధ్వంసం ఘటనలను భారత దౌత్య కార్యాలయం తీవ్రంగా ఖండించింది. దాడులకు కారకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని యూకే యంత్రాంగాన్ని డిమాండ్ చేసింది. బాధితులకు రక్షణ కల్పించాలని కోరింది. గత నెలలో దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్ అనంతరం నగరంలోని హిందూ ముస్లిం గ్రూపుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. లీసెస్టర్‌లోని ఆలయం వద్ద ఎగురవేసిన కాషాయ జెండాను కొందరు చించి వేస్తున్నట్లున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

పార్థా చటర్జీకి చెందిన రూ.46 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి పార్థా చటర్జీ, ఆయన సన్నిహితురాలైన అర్పితా ముఖర్జీకి చెందిన రూ.46.22 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. రాష్ట్రంలో 2016లో చోటుచేసుకున్న టీచర్ల నియామకం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో పార్థా చటర్జీ, అర్పితా ముఖర్జీల ఆస్తులను జప్తు చేసినట్లు సోమవారం తెలిపింది. ఈడీ సోమవారం వీరిపై ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ వేసింది. వీరిద్దరినీ ఈడీ జూలైలో అరెస్ట్ చేసింది. వీరికి చెందిన పలు ప్రాంతాల్లో దాడులు జరిపిన ఈడీ రూ.55 కోట్ల నగలు, నగదును స్వాధీనం చేసుకుంది. ఇలా ఉండగా, ఇదే కుంభకోణానికి సంబంధించి సీబీఐ నార్త్ బెంగాల్ యూనివర్సిటీ వీసీ సుబిరెస్ భట్టాచార్యను సోమవారం అరెస్ట్ చేసింది. అప్పట్లో ఆయన బెంగాల్ సెంట్రల్ స్కూల్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉండేవారు.

సంజయ్ రౌత్ కస్టడీ మళ్లీ పొడిగింపు

ముంబై: శివసేన ఎంపీ సంజయ్ రౌత్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మరో 14 రోజుల పాటు పొడిగించింది. మనీ లాండరింగ్ కేసులో రౌత్‌ను నిందితుడిగా పేర్కొంటూ ఈడీ వేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయస్థానం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ముంబై పత్రా చాల్ అభివృద్ధి పనుల్లో అవకతవకల కేసులో ఆగస్ట్ ఒకటో తేదీన ఈడీ సంజయ్ రౌత్‌ను అదుపులోకి తీసుకుంది. అప్పటి నుంచి ఆయన కస్టడీని న్యాయస్థానం పొడిగిస్తూ వస్తోంది. రౌత్ బెయిల్ పిటిషన్‌పై 21న కోర్టు విచారణ చేపట్టనుంది.

చండీగఢ్ వర్సిటీ కేసుపై 'సిట్'

చండీగఢ్: పంజాబ్‌లోని చండీగఢ్ యూనివర్సిటీలో వీడియోల లీక్ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు మహిళా అధికారులతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసినట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ సోమవారం చెప్పారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. హాస్టల్‌లో తోటి విద్యార్థినులు స్నానం చేస్తుండగా వీడియోలు రికార్డు చేసి షేర్ చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న విద్యార్థిని, ఆమె స్నేహితుడి ఫోన్లను ఫోరెన్సిక్ పరీక్షకు పంపామన్నారు. ఆందోళనల సందర్భంగా విద్యార్థినులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలొచ్చిన ఇద్దరు హాస్టల్ వార్డెన్లను సస్పెండ్ చేశారు. మరికొందరిని బదిలీ చేశారు. వర్సిటీలో సెలవులను 24 దాకా పొడిగించారు. ముగ్గురు నిందితులను 7 రోజులపాటు పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది.



విచార వదనాలతో శవపేటిక వెంట నడుస్తున్న రాజు చార్లెస్–3, ఆయన కుటుంబసభ్యులు

భారమైన హృదయాలతో...

రాణికి వీడ్కోలు

ముగిసిన ఎలిజబెత్–2 అంత్యక్రియలు
- విండ్సర్ కోటలో భర్త, తల్లిదండ్రుల సమాధుల పక్కనే ఖననం
- శోకతప్త హృదయాలతో అభిమానుల కన్నీరు
- రాష్ట్రపతి ముర్ము, బైడెన్ సహా పలువురు దేశాధినేతల హాజరు

లండన్: అసంఖ్యాక అభిమానుల అశ్రు నివాళుల నడుమ బ్రిటన్ దివంగత రాణి ఎలిజబెత్–2 అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. కార్యక్రమం ఆసాంతం పూర్తి ప్రభుత్వ లాంఛనాల నడుమ సాగింది. రాచ కుటుంబీకుల అంతిమయాత్రకు ఉపయోగించే ప్రత్యేక వాహనంలో రాణి పార్థివ దేహాన్ని ఉదయం 11 గంటలకు వెస్ట్‌మినిస్టర్ హాల్ నుంచి వెస్ట్‌మినిస్టర్ అబేకు తరలించారు. రాజు చార్లెస్–3తో పాటు ఆయన తోబుట్టువులు, కొడుకులు, కోడళ్లు, మనవడు, మనవరాలు, ఇతర రాజ కుటుంబీకులు వెంట నడిచారు. అబేలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దంపతులతో పాటు 2,000 మందికి పైగా దేశాధినేతలు, రాజులు, ప్రముఖులు చివరిసారిగా నివాళులర్పించారు. నేపథ్యంలో విషాద సంగీతం వినిపిస్తుండగా గంటకు పైగా ప్రార్థనలు కొనసాగాయి. బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ తదితరులంతా బైబిల్ వాక్యాలు పఠించారు. ఈ సందర్భంగా రాణికి నివాళిగా బ్రిటన్‌వ్యాప్తంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వెస్ట్‌మినిస్టర్ డీన్ తదితరులు శోక సందేశం వినిపించారు. దేశసేవకు జీవితాన్ని అంకితం చేస్తానంటూ రాణి తన 21వ పుట్టినరోజున చేసిన ప్రతిజ్ఞను ఆసాంతం నిలబెట్టుకున్నారంటూ కొనియాడారు. అనంతరం ఎలిజబెత్–2 వివాహ, పట్టాభిషేక వేడుకలకు వేదికగా నిలిచిన వెస్ట్‌మినిస్టర్ అబే నుంచే ఆమె అంతిమయాత్ర మొదలైంది. చారిత్రక లండన్ వీధుల గుండా భారంగా సాగింది. ఈ సందర్భంగా ఇరువైపులా అభిమానులు అసంఖ్యాకంగా బారులు తీరారు. తమ అభిమాన రాణికి శోకతప్త హృదయాలతో తుది వీడ్కోలు పలికారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై లక్షలాది మంది అంతిమయాత్రను వీక్షిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 96 ఏళ్లు జీవించిన రాణికి నివాళిగా లండన్లోని చారిత్రక బిగ్‌బెన్ గడియారం నిమిషానికోసారి చొప్పున 96 సార్లు మోగింది. హైడ్ పార్కులో రాయల్ గన్ సెల్యూట్ నిరంతరాయంగా కొనసాగింది. అనంతరం రాణి పార్థివ దేహాన్ని జాతీయ గీతాలాపన నడుమ దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని చారిత్రక విండ్సర్ కోటకు ప్రత్యేక వాహనంలో తరలించారు. శవపేటికపై ఉంచిన రాజ చిహ్నాలైన కిరీటం తదితరాలను తొలగించారు. సంప్రదాయ ప్రార్థనల అనంతరం సెయింట్ జార్జి చాపెల్‌కు తరలించారు. రాజ కుటుంబీకుల సమక్షంలో రాణి తల్లిదండ్రులు, భర్త, సోదరి సమాధుల పక్కనే ఖననం చేశారు. బ్రిటన్‌ను అత్యధిక కాలం పాలించిన రాణి పవిత్రాత్మ పరలోకంలోని ప్రభువును చేరాలంటూ బైబిల్ వాక్యాల పఠనం తర్వాత మరోసారి జాతీయ గీతాలాపనతో అంత్యక్రియలు ముగిశాయి.



రాణికి తుది నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము, పలు దేశాధినేతలు



క్వీన్ విక్టోరియా మెమోరియల్ మార్గం గుండా సాగుతున్న రాణి అంతిమయాత్ర

'అధ్యక్ష' బరిలోకి థరూర్!

సోనియా పచ్చజెండా
- ఎవరైనా పోటీ చేయొచ్చు: జైరాం
- 26న గెహ్లాట్ నామినేషన్



అశోక్ గెహ్లాట్



శశిథరూర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగాలని పార్టీ సీనియర్ నాయకుడు, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ నిర్ణయించుకున్నారు. పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన నిర్ణయాన్ని ఆమె ముందుంచారు. 'మీ ఇష్టం. అధ్యక్ష పదవి కోసం ఎవరైనా పోటీ పడవచ్చు' అంటూ సోనియా కూడా పచ్చజెండా ఊపినట్టు సమాచారం. తాను వ్యక్తిగతంగా ఎవరికీ మద్దతు ప్రకటించకుండా తటస్థంగా ఉంటానని చెప్పారంటున్నారు. భేటీ వివరాలను మీడియాకు వెల్లడించేందుకు థరూర్ నిరాకరించారు. ''పోటీ చేయాలనుకునే నేతలందరికీ స్వాగతం. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక పూర్తి పారదర్శకంగా జరిగే ప్రజాస్వామిక ప్రక్రియ. అందులో పాల్గొనేందుకు ఎవరి అనుమతీ అవసరం లేదు'' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా అన్నారు. పోటీకి తాను సన్నద్ధమవుతున్నట్టు కొద్ది రోజుల క్రితమే థరూర్ ప్రకటించడం తెలిసిందే. పార్టీలో అంతర్గత సంస్కరణల దిశగా ఆయన కొంతకాలంగా గట్టిగా గళం విన్పిస్తున్నారు. వరుస పరాజయాలు, నేతల నిష్క్రమణతో కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ బాగా డీలా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీకి అత్యవసరమైన పలు విప్లవాత్మక మార్పులకు అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ శ్రీకారం చుడుతుందని మలయాళ దినపత్రిక మాతృభూమికి రాసిన వ్యాసంలో థరూర్ అభిప్రాయపడ్డారు. పార్టీలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టడంతో పాటు ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని అధ్యక్ష అభ్యర్థులు ప్రమాణం చేయాలంటూ పలువురు యువ నేతలు, కార్యకర్తల చేసిన విజ్ఞాపనను ఆయన ట్విట్టర్లో షేర్ చేశారు. ''దీనిపై 650 మందికి పైగా సంతకం చేశారు. ఈ విజ్ఞాపనను స్వాగతిస్తున్నా'' అంటూ ట్వీట్ చేశారు. పార్టీని సమూలంగా ప్రక్షాళించాలంటూ లేఖ రాసి జీ–23గా పేరుపడ్డ కాంగ్రెస్ అసంతృప్త నేతల్లో థరూర్ కూడా ఉన్నారు.

రాజస్తాన్ పగ్గాలు పైలట్‌కు?

మరోవైపు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగడం ఇప్పటికే ఖాయమైంది. దేవీ నవరాత్రులు మొదలయ్యాక సెప్టెంబర్ 26న ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నట్టు సమాచారం. నామినేషన్ల దాఖలుకు 30వ తేదీ తుది గడువు. అక్టోబర్ 17న అధ్యక్ష ఎన్నిక జరగనుంది. 19న ఫలితాలు వెల్లడవుతాయి. గెహ్లాట్ నెగ్గి పార్టీ పగ్గాలు చేపడితే సచిన్ పైలట్‌ను రాజస్తాన్ సీఎంగా నియమిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు రాహుల్‌గాంధీయే మళ్లీ అధ్యక్షుడు కావాలంటూ ఆరు పీసీసీ కమిటీలు తీర్మానం చేశాయి.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆటలు సాగనివ్వం

పాదయాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ • 12వ రోజుకు చేరిన భారత్ జోడో యాత్ర



కేరళలో పున్నమద సరస్సులో పడవ పోటీలో పాల్గొన్న రాహుల్

అలప్పుజా: అధికార బీజేపీ దేశంలో విద్వేషం, హింసాకాండను ప్రేరేపిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. దేశాన్ని విభజించాలన్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆటలను సాగనివ్వబోమని హెచ్చరించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుటిల సిద్ధాంతాలను అమలు చేస్తామంటే చూస్తూ ఊరుకొనే ప్రసక్తే లేదన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆయన సోమవారం సాయంత్రం కేరళ రాష్ట్రం అలప్పుజా జిల్లాలోని చెర్తాలాలలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. హింసాద్వేషాలను నమ్ముకుంటే దేశం ప్రగతి సాధించలేదని మరోమారు స్పష్టం చేశారు. అరాచక పాలన వల్ల దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్న నిజాన్ని ప్రజలు గుర్తించారని, అందుకే తన పాదయాత్రకు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. సమాజాన్ని ముక్కలు చెక్కలు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించగలమా? కొత్త ఆసుపత్రులు నిర్మించగలమా? కొత్త రోడ్లు వేయగలమా? మన పిల్లలను విద్యావంతులను చేయగలమా? అని రాహుల్ ప్రశ్నించారు. ఎంతమాత్రం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. సామాన్య ప్రజలు తమ భుజస్కంధాలపై ఈ దేశాన్ని మోస్తున్నారని, కొందరు దుష్టులు సృష్టిస్తున్న ద్వేషాల వల్ల జనమే మూల్యం చెల్లించాల్సి వస్తోందని వాపోయారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నులు మన దేశంలో ఉన్నారని, అదే సమయంలో నిత్యావసరాల కోసం మన ప్రజలు అత్యధిక ధర చెల్లించాల్సి వస్తోందని అన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్న దేశం, ధరల మంటలు మండుతున్న దేశం మనకు కావాలా? అని ప్రశ్నించారు. బీజేపీ పాలనలో సామాన్యులు రోజురోజుకూ చితికిపోతుంటే బడాబాబులు మాత్రం మరింత ధనవంతులవుతున్నారని ఆక్షేపించారు.

రాహుల్ పాదయాత్ర సోమవారం 12వ రోజుకు చేరుకుంది. అలప్పుజలోని వడక్కల్ బీచ్‌లో మత్స్యకారులను కలుసుకున్నారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వెంబనాడ్ సరస్సులో ఓ హౌస్‌బోటులో పర్యాటక రంగ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను విన్నారు. స్నేక్ బోటు రేసింగ్‌లో పాల్గొన్నారు. 50 మంది యువకులతో కలిసి కాసేపు పడవ నడిపించారు.

యూపీలో యోగికి గుడి





లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు యూపీలోని భరత్‌కుండ్‌కు చెందిన ప్రభాకర్‌మౌర్య అనే వీరాభిమాని గుడి కట్టాడు. యోగి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. కాషాయ వస్త్రాలు, విల్లంబులతో దేవతల మాదిరిగా తల వెనుక వెలుగులతో ఏర్పాటు చేశాడు. రోజుకు రెండు సార్లు పూజలు చేసి, భక్తులకు ప్రసాదం పంచిపెడుతున్నాడు. ఫైజాబాద్–ప్రయాగ్‌రాజ్ హైవే పక్కనే భరత్‌కుండ్ ఉంది. అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న భరత్‌కుండ్ రామాయణ కాలంలో అరణ్యవాసం వెళ్లే శ్రీరాముడికి ఆయన సోదరుడు భరతుడు వీడ్కోలు పలికిన చోటుగా ప్రసిద్ధి. యోగి కార్యక్రమాలతో ప్రభావితమై ఆయనకు గుడి కట్టినట్లు మౌర్య తెలిపాడు.

బీజేపీలో చేరిన కెప్టెన్



న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కెప్టెన్ అమరీందర్ సింగ్ బీజేపీలో చేరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, కిరణ్ రిజిజు సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. తన పార్టీని బీజేపీలో విలీనం చేశారు. దేశ భద్రత పట్ల అంకిత భావం కలిగిన పార్టీ బీజేపీ అని ప్రశంసించారు. అమరీందర్ కుమారుడు రణీందర్ సింగ్, కుమార్తె జై ఇందర్ కౌర్ తదితరులు కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీలో చేరడానికి కంటే ముందు అమరీందర్ సింగ్ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలుసుకున్నారు.

చైనా నుంచి తైవాన్‌ను కాపాడుతాం

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టీకరణ



బీజింగ్: తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా ప్రయత్నిస్తే అడ్డుకుంటామని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆదివారం పునరుద్ఘాటించారు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు స్పష్టం చేశారు. చైనా ఆక్రమణ నుంచి అమెరికా బలగాలు, ప్రజలు తైవాన్‌ను రక్షిస్తారని పేర్కొన్నారు. 'స్వాతంత్ర్యానికి సంబంధించి తైవాన్ ప్రజలే సొంతంగా నిర్ణయం తీసుకుంటారు. స్వతంత్రంగా ఉండాలంటూ వారిని మేం ప్రోత్సహించం' అని అన్నారు. తైవాన్ అంశం శాంతియుతంగా పరిష్కారం కావాలన్నదే తమ విధానమని అనంతరం వైట్‌హౌస్ అనంతరం పేర్కొంది. ఈ విషయంలో తమ వైఖరి యథాతథమని తెలిపింది. అయితే, తైవాన్ విషయంలో సైనిక జోక్యంపై స్పందించలేదు. అమెరికా హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ ఇటీవలి తైవాన్ సందర్శనపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ఆ ప్రాంతంపైకి క్షిపణులను ప్రయోగించడం, యుద్ధ విమానాలను మోహరించడం తదితర చర్యలతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో బైడెన్ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. దశాబ్దాలుగా ఒకే చైనా విధానాన్ని అనుసరిస్తున్న అమెరికా తైవాన్‌తో అధికారికంగా సంబంధాలు కొనసాగించడం లేదు. బైడెన్ వ్యాఖ్యలపై చైనా మండిపడింది.

రసాయన ఎరువులకు 'పీఎం–ప్రణామ్'తో చెక్!

- వాడకం బాగా తగ్గించేందుకు కేంద్రం కార్యాచరణ, ప్రత్యామ్నాయ ఎరువులకు ప్రోత్సాహం
- రాష్ట్రాల అభిప్రాయం కోరిన వైనం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అంతేకాకుండా రసాయన ఎరువులపై సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రధాన మంత్రి ప్రమోషన్ ఆఫ్ ఆల్టర్నేట్ న్యూట్రియంట్స్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ (పీఎం–ప్రణామ్) యోజనను తీసుకొచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరగడం, వాటిపై రాయితీలు మోయలేని భారంగా మారుతున్న నేపథ్యంలో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సబ్సిడీల భారం రూ.2.25 లక్షల కోట్లు!

దేశంలో రసాయన ఎరువుల వాడకం ప్రతి ఏటా విపరీతంగా పెరిగిపోతోంది. 2017–18లో వినియోగం 5.28 కోట్ల మెట్రిక్ టన్నులు కాగా, 2021–22 నాటికి 6.40 కోట్ల మెట్రిక్ టన్నులకు (21శాతం) పెరిగింది. ఇందులో యూరియా వినియోగం 2017–18లో 2.98 కోట్ల మెట్రిక్ టన్నుల నుంచి 2021–22 నాటికి ఏకంగా 3.56 కోట్ల మెట్రిక్ టన్నులకు (19.64 శాతం) చేరుకుంది. అలాగే డీఏపీ వినియోగం 98.77 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 1.23 కోట్ల మెట్రిక్ టన్నులకు (25.44 శాతం) పెరిగింది. ఇతర ఎరువుల వినియోగం సైతం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. దానికి అనుగుణంగానే సబ్సిడీల భారం పెరుగుతూ వస్తోంది. 2020–21లో సబ్సిడీల భారం రూ.1.27 లక్షల కోట్లు కాగా, 2021–22 నాటికి రూ.1.62 లక్షల కోట్లకు చేరింది. 2022–23 నాటికి రూ.2.25 లక్షల కోట్లు చేరుతుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకే 'పీఎం–ప్రణామ్' పథకంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.


మిగిలే నిధులతో పథకం అమలు

'పీఎం–ప్రణామ్' కింద కేంద్ర సర్కారు ఎలాంటి ప్రత్యేక బడ్జెట్ కేటాయించదు. వివిధ కేంద్ర పథకాల కింద ఉన్న ఎరువుల సబ్సిడీలను ఆదా చేయడం ద్వారా మిగిలే నిధులతో ఈ పథకాన్ని అమలు చేయనుంది. మిగులు నిధుల్లో 50 శాతం సొమ్మును రాష్ట్రాలకు గ్రాంట్‌గా అందిస్తుంది. ఈ గ్రాంట్‌లో 70 శాతం నిధులను గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిల్లో ప్రత్యామ్నాయ ఎరువులు, ప్రత్యామ్నాయ ఎరువుల ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు వినియోగించవచ్చు. మిగిలిన 30 శాతం నిధులను రసాయన ఎరువుల వాడకం తగ్గింపుపై రైతుల్లో అవగాహన కల్పించిన పంచాయతీలకు, రైతు సంఘాలకు, స్వయం సహాయక సంఘాలకు బహుమతులు ఇవ్వడానికి, ఇతర ప్రోత్సాహకాలకు ఉపయోగించుకోవచ్చు. పీఎం–ప్రణామ్ యోజనకు సంబంధించిన లక్ష్యాలపై రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది. రాష్ట్రాల అభిప్రాయాలు పూర్తిగా తెలుసుకున్నాక తుది ముసాయిదాను సిద్ధం చేయనుంది.

మద్యం మత్తులో విమానం ఎక్కిన

పంజాబ్ సీఎం మాన్!

- దాంతో జర్మనీలో విమానం నుంచి అర్ధాంతరంగా దించేసిన సిబ్బంది
- పంజాబీలకు తలవంపులు: బాదల్
- కొట్టిపారేసిన ఆమ్ ఆద్మీ పార్టీ



చండీగఢ్: మద్యం సేవించి విమానం ఎక్కిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను అందులోని సిబ్బంది బలవంతంగా కిందకు దించేశారని ప్రతిపక్ష శిరోమణి అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ చెప్పారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టులో ఆదివారం ఈ సంఘటన జరిగిందన్నారు. ఈ మేరకు సోమవారం ట్వీట్ చేశారు. భగవంత్ మాన్ విపరీతంగా మద్యం సేవించి, ఢిల్లీకి చేరుకోవడానికి లుఫ్తాన్సా విమానం ఎక్కారని, ఆ సమయంలో ఒళ్లు తెలియని మత్తులో, కనీసం నడవలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఆయన పరిస్థితిని గుర్తించిన తోటి ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ విమాన సిబ్బందికి ఫిర్యాదు చేశారని, సిబ్బంది ఆయనను కిందకు దించేశారని, దీనివల్ల విమానం 4 గంటలు ఆలస్యమైందని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ సదస్సుకు ఆయన హాజరు కాలేకపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న పంజాబీలంతా సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందన్నారు. భగవంత్ మాన్ తీరు ప్రజలకు వెగటు పుట్టించిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పంజాబ్ ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. భగవంత్ మాన్ వ్యవహారం మొత్తం దేశానికే అవమానకరమని, ఆయన అనుచిత ప్రవర్తనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ పార్టీ నేత ప్రతాప్‌సింగ్ బాదల్ డిమాండ్ చేశారు. అయితే, సీఎంపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి మాల్విందర్ సింగ్ ఖండించారు. ముఖ్యమంత్రి ప్రతిష్టను దెబ్బతీయాలన్న లక్ష్యంతో నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతిపక్షాలు అది జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. పెట్టుబడుల కోసం 8 రోజులపాటు జర్మనీలో పర్యటించిన భగవంత్ మాన్ భారత్‌కు సోమవారం తిరిగివచ్చారు.

సాక్షి విజయనగరం

మంగళవారం । 20 । సెప్టెంబర్ । 2022



రాజాంలో రాచబాటలు

రాజాం పట్టణకేంద్రం మొన్నటి వరకూ శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న రెండో పట్టణం. - 8లో



కురిసింది వాన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విజయనగరం జిల్లా కేంద్రంలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. రోజంతా కురిసిన జల్లులతో రాకపోకలకు పట్టణ వాసులు ఇబ్బందులు పడ్డారు.

వర్ష సూచన

గుమ్మలక్ష్మీపురం: భారత వాతావరణ కేంద్రం (విశాఖపట్నం) అందించిన సమాచారం మేరకు తూర్పు మధ్య ఆగ్నేయ బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరం వద్ద మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రానున్న 2 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.స్రవంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

న్యూస్‌రీల్

పోస్టుల భర్తీ



నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ పోస్టుల భర్తీ ప్రక్రియ స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభమైంది. మెడికో సోషల్ కౌన్సెలర్–1, ఫిజియో థెరపిస్ట్–2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి సమక్షంలో ఇంటర్వ్యూలు జరిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ నాగభూషణరావు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



వీసీ కట్టిమణి

విజయనగరం అర్బన్: డాక్టర్ అంబేడ్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గిరిజన యూనివర్సిటీలు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పథకం కింద సివిల్స్–2023 పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రవేశాల కోసం మిగిలి ఉన్న సీట్ల కోసం ఎస్సీ అభ్యర్థుల నుంచి కౌన్సెలింగ్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి సోమవారం తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి ఉండి ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ నుంచి గిరిజన యూనివర్సిటీ కార్యాలయంలో ఒరిజినల్, జిరాక్స్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

శాసన మండలిలో జిందాల్ సమస్య

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతాంగం సమస్యను శాసన మండలిలో సోమవారం ప్రస్తావించినట్టు ఎమ్మెల్సీ రఘురాజు ఫోన్‌లో స్థానిక విలేకరులకు చెప్పారు. ఎస్.కోట మండలంలో 2008లో జిందాల్ సౌత్‌వెస్ట్ పేరుతో కర్మాగారం ఏర్పాటుకు ప్రభుత్వం రైతుల నుంచి 1100 ఎకరాలు సేకరించి జిందాల్‌కు ఇచ్చిందని, తర్వాత ప్రభుత్వాలు మారడం, బాక్సైట్ తవ్వకాలపై అభ్యంతరాలతో జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కాలేదన్నారు. కంపెనీ కోసం భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు లేవని, నేడు ఉద్యోగ విరమణ వయస్సుకు చేరుకున్నారన్నారు. అటు వ్యవసాయం, ఇటు ఉపాధి, ఉద్యోగం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, భూములు నిరుపయోగంగా మిగిలిపోయాయన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటుకు చొరవ తీసుకుని 14 ఏళ్ల రైతుల నిరీక్షణకు తెరదించాలని సభాధ్యక్షుడు భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కోరినట్టు ఆయన చెప్పారు.

విజయనగర ఉత్సవాల్లో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన



మాట్లాడుతున్న ఏపీడీ సావిత్రి

విజయనగరం అర్బన్: వచ్చే నెలలో జిల్లా కేంద్రంలో జరగనున్న విజయనగర ఉత్సవాల్లో మహిళా పొదుపు సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపడతామని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి తెలిపారు. స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు ఉత్సవాల్లో ప్రదర్శనకు ఉత్పత్తులను సిద్ధం చేయాలన్నారు. 2022–23 మిల్లెట్ సంవత్సరంలో భాగంగా ఈ నెల 20న చిరుధాన్యాల ఫుడ్‌ఫెస్టివల్‌ను జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తూ వ్యవసాయ సూత్రాలను, భూసారాన్ని పెంపొందించాల్సిన అంశాలపై ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. పొదుపు సంఘాల మహిళలను డీఎంహెచ్‌ఓ సిబ్బంది చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, జిల్లా కార్యాలయం కాంపోనెంట్ సిబ్బంది, జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సిబ్బంది ఫుల్



పాఠ్యాంశాన్ని శ్రద్ధగా వింటున్న బాలికలు

విజయనగరం అర్బన్:

కేజీబీవీలు... డ్రాపౌట్ బాలికలకు విద్యావరాన్ని అందించే విద్యాలయాలు. పేద, అనాథ బాలికల భవిష్యత్‌ను చక్కదిద్దే సరస్వతీ నిలయాలు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అందుబాటులోకి తెచ్చిన కేజీబీవీలు ఇప్పుడు బాలికల విద్యోన్నతికి బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతి, భోజన సదుపాయాలతో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. ఆరో తరగతిలో చేరిన బాలికలకు ఇంటర్మీడియట్ వరకూ చదువుకునే మహోన్నత అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేజీబీవీల్లో సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యమిస్తోంది. అన్ని విద్యాలయాల్లోనూ ఖాళీగా ఉన్న టీచర్, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసింది. శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఇంటర్మీడియట్ వరకు బోధన

జిల్లాలో బాలికల అక్షరాస్యతా శాతం తక్కువగా ఉన్న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 33 మండలాల్లో కస్తూర్బా బాలికా విద్యాలయాలు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటి వరకు పేద, అనాథ, డ్రాపౌట్ బాలికలకు ఆరు నుంచి 10వ తరగతి వరకు విద్యను బోధించేవి. ఇక్కడ చదివిన బాలికలు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేవారు. ఇప్పుడు 33 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ కోర్సులను బోధిస్తోంది. రానున్న రోజుల్లో డిమాండ్‌కు అనుగుణంగా అన్ని విద్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో ఇంటర్మీడియట్ గ్రూపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది

ఉమ్మడి జిల్లాల్లోని కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు 8,877 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు గత ఏడాది వరకు ఆయా స్కూళ్లలో పనిచేస్తున్న పోస్టుగ్రాడ్యుయేట్ అర్హత ఉన్న సీఆర్టీలు పాఠ్యాంశాలను బోధించేవారు. ఈ ఏడాది ప్రమాణాలతో కూడిన విద్యాబోధనే లక్ష్యంగా ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లతో ఖాళీలను భర్తీచేసింది.

అర్హత ఉన్న మహిళా అభ్యర్థులను బోధకులుగా నియమించింది. కేజీబీవీల్లో బోధన సిబ్బంది సంఖ్య 447కు చేరింది. వీరిలో ఇంటర్మీడియట్ తరగతులకు పాఠాలు చెప్పే పీజీటీలు 47 మంది ఉన్నారు. ఉన్నత పాఠశాల తరగతులకు పాఠాలు చెప్పే సీఆర్టీలు సబ్జెక్టు వారీగా ఉన్నారు. బోధన సిబ్బంది పోస్టుల భర్తీతో ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా అధికారులు ఆశిస్తున్నారు.

- బాలికా.. చదువులో సాగిపో..
- ఉమ్మడి జిల్లాల్లోని 33 కేజీబీవీలలో పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ
- ఇంటర్మీడియట్ తరగతుల బోధనకు గెస్ట్‌లెక్చరర్ల నియామకాలు
- ప్రమాణాలతో కూడిన విద్యాబోధన
- శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం
- 8,877 మంది బాలికలకు ప్రయోజనం

అత్యధికంగా 11 చోట్ల ఎంపీసీ గ్రూపు

జిల్లాలో ప్రయోగాత్మకంగా అన్ని కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. అయితే, విద్యార్థులకు అనుగుణంగా కొన్ని విద్యాలయాల్లో కొన్ని కోర్సులు నిర్వహిస్తోంది. అత్యధికంగా 11 చోట్ల ఎంపీసీ కోర్సును బోధిస్తోంది. బైపీసీ 10 చోట్ల, వృత్తి విద్యాకోర్సులు (ఎంపీహెచ్‌డబ్ల్యూ) 5 చోట్ల, సీఎస్‌ఈ–2, మిగిలినవాటిలో హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఎల్‌టీ, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఫిజియోథెరపీ కోర్సులను నిర్వహిస్తోంది.

అదనపు భవనాలు..

ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు వీలుగా పక్కా భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలి విడతగా తొమ్మిది కేజీబీవీలలో భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో జామి మండలం కుమరాం, చీపురుపల్లి, విజయనగరం, గజపతినగరం కేజీబీవీల్లో పక్కా భవనాల నిర్మాణం పూర్తయింది. వీటిని ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు

సూపర్ 60 బ్యాచ్ సక్సెస్..

కేజీబీవీల్లో చదువుతున్న బాలికల చదువుపై కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గత ఏడాది 33 కేజీబీవీల్లో చదువుతున్న పదోతరగతి బాలికలకు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. చదువులో రాణిస్తున్న బాలికలను గుర్తించి సూపర్ సక్సెస్ బ్యాచ్ పేరిట జామి, విజయనగరం కేజీబీవీలలో మొత్తం 120 మందికి ప్రత్యేక బోధన అందించారు. ఇక్కడ చదివిన ఎల్.కోట కేజీబీవీ విద్యార్థిని మాచవరపు సూర్యం పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 580 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి కేజీబీవీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. అధికమంది బాలికలు 500కు పైబడి మార్కులు సాధించారు. ఈ ఏడాది కూడా ఇదే విద్యాప్రణాళిక అమలుకు అధికారులు కసరత్తుచేస్తున్నారు.



జామి మండలం కుమరాంలోని కేజీబీవీ...



ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణకు ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించిన పక్కా భవనం

కేజీబీవీలలో తరగతుల వారీగా చదువుతున్న బాలికల సంఖ్య

తరగతి	బాలికలు
6వ	1,359
7వ	1,330
8వ	1,306
9వ	1,298
10వ	1,263
ఇంటర్ ప్రథమ సంవత్సరం	1,242
ద్వితీయ సంవత్సరం	1,079
మొత్తం	8,877

కేజీబీవీల్లో సబ్జెక్టుల వారీగా బోధనా సిబ్బంది సంఖ్య

బోధన సిబ్బంది పోస్టు	వాటి సంఖ్య
ప్రిన్సిపాల్స్	28
సీఆర్టీ (తెలుగు)	31
సీఆర్టీ (హిందీ)	31
సీఆర్టీ (ఇంగ్లిష్)	30
సీఆర్టీ (మ్యాథ్స్)	27
సీఆర్టీ (ఫిజికల్ సైన్స్)	27
సీఆర్టీ (బయాజీ)	30
సీఆర్టీ (సోషల్)	31
పీఈటీ	32
పీజీటీలు (అన్ని సబ్జెక్టులు కలిపి)	47
గెస్ట్ ఫ్యాకల్టీ (సీఆర్టీలు, పీజీటీలు కలిపి)	133
మొత్తం	447

బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ



కేజీబీవీల్లో చదివిన విద్యార్థినులంతా దాదాపు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే. వారి విద్యాసామర్థ్యాలకు అనుగుణంగా విద్య ప్రణాళికలను అమలుచేస్తున్నాం. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేశాం. బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– డాక్టర్ వీఏ స్వామినాయుడు, ఏపీసీ, సర్వశిక్ష

కార్యకర్త నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు...

- కోలగట్ల వీరభద్రస్వామి విజయ ప్రస్థానం
- విజయనగరం జిల్లాకు దక్కిన గౌరవం
- 2 సార్లు ఎమ్మెల్యేగా... 2 సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం



తాడేపల్లిలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కోలగట్ల, కుటుంబ సభ్యులు


విజయనగరం:

సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కోలగట్ల వీరభద్రస్వామి డిప్యూటీ స్పీకర్ హోదా వరకు వ్యక్తిగతంగా ఎదిగారు. పాలనలో తనదైన ముద్రవేస్తూ.. ప్రశంసలు అందుకుంటున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణలో భాగంగా కొద్ది నెలల కిందట డిప్యూటీ స్పీకర్‌గా కోలగట్ల పేరును సీఎం ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభా సమావేశాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సీఎంతో పాటు స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర మంత్రివర్గం సమక్షంలో ఆయన డిప్యూటీ స్పీకర్ పీఠాన్ని సోమవారం అధిరోహించారు. కోలగట్ల 1983లో కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం 1985లో కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 1987లో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికకాగా, 1989లో కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1989, 1994, 1999 సంవత్సరాల్లో విజయనగరం శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. మళ్లీ 2004 సంవత్సరం ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజుపై విజయం సాధించారు. 2013 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2014 సంవత్సరంలో ఎమ్మెల్సీ పదవితోపాటు ఆ పార్టీకి రాజీనామాచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. అదే ఏడాది విజయనగరం శాసనసభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందగా... వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం విజయనగరం ఎమ్మెల్యేగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్‌గా కొనసాగుతున్నారు.

పేరు	: కోలగట్ల వీరభద్రస్వామి
తల్లిదండ్రులు	: స్వర్గీయ లక్ష్మి, సన్యాసిరాజు
జననం	: 28.5.1960
విద్యాభ్యాసం	: ఇంటర్మీడియట్
కులం	: ఆర్యవైశ్య
వృత్తి	: వ్యాపారం
భార్య	: కోలగట్ల వెంకటరమణి (రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నిక)
పెద్దమ్మాయి	: సంధ్య, ఎంబీబీఎస్, జనరల్ ఫిజీషియన్
పెద్దల్లుడు	: డాక్టర్ నాగఅభిషేక్, అంకాలజిస్ట్
రెండో కుమార్తె	: శ్రావణి, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్
చిన్నల్లుడు	: జి.ఈశ్వర్‌కౌశిక్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వ్యాపారవేత్త

ప్రత్యేక గుర్తింపు..

విజయనగరానికి చెందిన పూసపాటి వంశీయులపై రాజకీయంగా పోరాడి విజయం సాధించడంతో ఎమ్మెల్యే కోలగట్లకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సుమారు 7 మార్లు ఎమ్మెల్యేగా, పలు శాఖల రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా పదవులు అధిరోహించిన పూసపాటి అశోక్‌గజపతిరాజుపై స్వతంత్ర్య అభ్యర్థిగా ఒకసారి, వైఎస్సార్‌సీపీ తరఫున మరోసారి పోటీచేసి తన సత్తాను నిరూపించుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా సాగుతున్నారు.



ఎమ్మెల్యే కోలగట్లకు శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

అభినందనల జల్లు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన కోలగట్లవీరభద్రస్వామికి అభినందనలు వెల్లువెత్తాయి. విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు,, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, చనమల్లు వెంకటరమణ, రాష్ట్ర పర్యాటకశాఖ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కుప్పం ప్రసాద్ ద్వారకానాథ్, గుబ్బ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించిన సీఎంకు తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'గురుదేవా' సేవలు ఎనలేనివి

- కృత్రిమ అవయవాల పంపిణీలో పాల్గొన్న సినీ దర్శకుడు రాఘవేంద్రరావు



కృత్రిమ అవయువాలను పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరావు

కొత్తవలస రూరల్: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్‌ట్రస్టు సేవలు ఎనలేనివని సిని దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. మానవ సేవే మాధవ సేవగా 20 సంవత్సరాలుగా దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు దానం చేస్తున్న ట్రస్టు అధ్యక్షుడు జగదీష్‌కుమార్ ధన్యుడని పేర్కొన్నారు. ట్రస్టు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత కృత్రిమ అవయువాల పంపిణీ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, కాకినాడ పోర్టు చైర్మన్ కేవీరావు పాల్గొన్నారు. 16కు పైగా రాష్ట్రాల్లోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తున్న మహోన్నత సంకల్పాన్ని కొనియాడారు. అనంతరం అవయువాల తయారీ యూనిట్‌ను పరిశీలించారు. అతిథుల చేతులమీదుగా దివ్యాంగులకు వీల్‌చైర్లు, ట్రైసైకిల్స్, బ్లైండ్‌స్టిక్స్‌ను పంపిణీ చేశారు.

పులి.. చంపేస్తోంది..



మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

- రెండు ఆవులను పొట్టనపెట్టుకున్న పులి

బాడంగి: పులి పంజా విసురుతోంది. తోటల్లో ఉన్న పశువుల శాలలపై దాడి చేస్తోంది. ఆవులను చంపేస్తోంది. బాడంగి మండలం గూడెపువలస పంచాయతీ శివారు గ్రామం రావివలస–మల్లంపేట కూడలిలోని కుంకుడుతోటలో ఆదివారం అర్ధరాత్రి చొరబడింది. రెండు ఆవులను హతమార్చింది. మండలంలోని హరిజనాపాల్తేరు సమీపంలో ఒక ఆవును చంపేసిన ఘటన మరువకముందే తిరిగి రావివలసలో రెండు ఆవులను పొట్టనపెట్టుకోవడంతో రైతులు హడలిపోతున్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి సుబ్బారెడ్డి బాడంగిలో నివసిస్తూ సేంద్రియ ఎరువులతో తోటలు, పంటలను సాగుచేస్తున్నారు. రావివలస వద్ద కొనుగోలుచేసిన మామిడితోటలో సుమారు 25 ఆవులను పోషిస్తున్నాడు. సోమవారం తోటలోకి వెళ్లిచూడగా రెండు ఆవులు కొద్ది దూరంలో చనిపోయి ఉన్నాయి. ఒక ఆవు వెనుకభాగాన్ని పులి పూర్తిగా తినేయగా, మరో ఆవు పీకను కొరికేసింది. వీఆర్వో జయప్రకాష్‌కు రైతు సమాచారం ఇవ్వగా, ఆయన అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. డీఆర్వో జె.సుధాకర్(బొబ్బిలి), సబ్ డీఎఫ్‌ఓ డి.రాజారావు (పార్వతీపురం), ఎఫ్‌బీఓ బి.శ్రీనివాసరావు, ఏబీఓ మంగమ్మతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి పాద ముద్రలను గుర్తించారు. ఎస్‌ఐ జయంతి, ఎంపీడీఓ అక్కారావు సమక్షంలో రెండు ఆవులకు పశువైద్యుడు గోవింద్ పోస్టుమార్టం చేసి తోటలోనే ఖననంచేశారు. మిగిలిన ఆవులను గ్రామంలోకి తరలించారు. రావివలస పరిసర గ్రామాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరారు. ఆకులకట్ట, మల్లంపేట, గూడపువలస, అల్లువానివలస, కోటిపల్లి, పాల్తేరు, రామచంద్రాపురం, కోడూరు తదితర గ్రామాల ప్రజలు ఒంటరిగా పొలాలవైపు వెళ్లవద్దని, ఆవులు తోలుకుని వెళ్లరాదని దండోరా వేయించారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన నారాయణరావు

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తగవిడివీధిలో నివాసం ఉంటున్న చందక నారాయణరావు(60) తప్పిపోయినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.సన్యాసి నాయుడు తెలిపారు. ఆయన భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు నారాయణరావు నెల్లిమర్లలోని బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహించే వారని, అనారోగ్యం కారణంగా మతిస్థిమితం కోల్పోవడంతో లాంగ్ లీవ్‌లో ఉన్నట్లు తెలిపారు. తప్పిపోయిన నారాయణరావు బ్లూ టీషర్టు, బ్లాక్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, ఎవరికైనా కనిపిస్తే తక్షణమే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన సంతోష్‌కుమార్

గంట్యాడ: విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థి తాటిపూడి జలాశయంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని నాగవంశపు వీధికి చెందిన టి.సంతోకుమార్ (19) డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 17వతేదీ సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడు. సోమ వారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో గొర్రిపాటి బుచ్చి అప్పారావు (తాటిపూడి) జలాశయం మెట్ల వద్ద శవమై కనిపించాడు. ఈ విషయాన్ని జలాశయం వాచ్‌మన్ మహేష్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు పోలీసులు విజయనగరంలో ఉన్న మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రవిశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. సోమవారం నుంచి జరగనున్న డిగ్రీ పరీక్షలు సరిగా రాయలేనేమోననే భయంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు గాయాలు


బాధితుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి గాయత్రికాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధి గార్రాజు చీపురుపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కె.లక్ష్మణరావు గాయాలపాలయ్యాడు. సోమవారం రాజాం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న లక్ష్మణరావుకు కుక్కలు అడ్డుగా రావడంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి సంఘటనా స్థలంలో ప్రథమ చికిత్సచేసి రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఈర్ల మహేష్

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో ఉన్న భూమాత లేఅవుట్‌లో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం సురెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఈర్ల మహేష్ (31) గృహాలకు సంబంధించిన డోర్ పాలిష్ (కార్పెంటర్) వర్క్ చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. విల్లాస్‌లోని డోర్లు పాలిష్ చేసేందుకు పోలిపల్లి సమీపంలోని భూమాత లేఅవుట్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఎయిర్ కంప్రెషర్‌ను ఉపయోగించి డోర్లు పాలిష్ చేస్తుండగా, ఎయిర్ కంప్రెషన్ మిషన్ ఇనుప రాడ్డుకు తగిలింది. దీంతో మిషన్ విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని బావమరిది సురెడ్డి నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.కృష్ణమూర్తి తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,130–00
బంగారం(22సి. 10గ్రా.)	45,950–00
వెండి (కిలో)	62,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

రాజాంలో రాచబాటలు

- ఇప్పుడిప్పుడే రోడ్లకు కొత్త సొబగులు
- నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రవాణా కష్టాలు
- వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే డబుల్ రోడ్డు నిర్మాణం


భారీగా విస్తరించిన రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు


రెండో విడతలో విస్తరించిన బొబ్బిలి రోడ్డు


విస్తరణకు సిద్ధంగా పాలకొండ రోడ్డు

రాజాం: రాజాం పట్టణకేంద్రం మొన్నటి వరకూ శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న రెండో పట్టణం. జిల్లాల పునర్విభజనలో విజయనగరం జిల్లాలో కలిసింది. ఇక్కడ ఓ వైపు జీఎంఆర్ విద్యాసంస్థలు, మరో వైపు చిన్నచిన్న కుటీర పరిశ్రమలు, ఇంకో వైపు పుష్కలమైన వ్యాపార సంస్థలు నిలదొక్కుకోవడంతో ప్రగతిలో ముందంజలో ఉంటుంది. పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాకు ప్రధాన వారధిగా ఉన్న రాజాం పట్టణ కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా రహదారి సమస్య ఉండేది. నిన్నమొన్నటి వరకూ పట్టించుకునే నాథుడు లేకపోవడం శోచనీయం. కనీసం గతుకుల రోడ్డుకు మరమ్మతులు కూడా జరిపించలేదు.

నాడు–నేడులో నిధుల విడుదల

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఉండగా ఓ వైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఇంకోవైపు అప్పట్లో టీడీపీ ఎమ్మెల్సీ, మరో వైపు మాజీ మంత్రి స్థానికంగా ఉన్నారే తప్పా రోడ్డు విస్తరణపై దృష్టిసారించలేదు. ప్రెస్‌మీట్‌లతో కాలయాపనచేశారే కానీ కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి అటు శ్రీకాకుళం రోడ్డు, ఇటు బొబ్బిలి, చీపురుపల్లి రోడ్డు, మరో వైపు పాలకొండ రోడ్డు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు ప్రమాదాలు జరిగి ఒకరిద్దరు మృత్యువాత కూడా పడ్డారు. ఇంత జరిగినా నాటి ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం రాజాం పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణపై దృష్టిసారించింది. మొత్తం రూ.30 కోట్ల నిధులు వెచ్చించింది. ప్రతిపాదనలకే పరిమితమైన ప్రధాన రహదారిని తొలివిడతలో శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ యుద్ధప్రాతిపదికన విస్తరించి, ప్లాంటేషన్ చేయించి, విద్యుత్ దీపాలంకరణ చేపట్టింది. అనంతరం బొబ్బిలి జంక్షన్ నుంచి పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడివరకూ రెండో విడతలో 80 అడుగుల రోడ్డును విస్తరించారు. ఈ రెండు రోడ్ల విస్తరణకు రూ.10 కోట్లు మేర నిధులు ఆర్‌అండ్‌బీ ద్వారా విడుదలచేశారు. ఇప్పుడు మూడో విడతలో భాగంగా బొబ్బిలి జంక్షన్ నుంచి చీపురుపల్లి రోడ్డులో గాయత్రి కాలనీ వరకూ. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్‌ఐటీ వరకూ పాలకొండ రోడ్డులో డబల్ రోడ్డు విస్తరణకు రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ల అనంతరం ఈ పనులు ప్రారంభంకానున్నాయి. ఇవే కాకుండా రాజాం నుంచి వంగర, సంతకవిటి నుంచి పొందూరు రూట్‌లో కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు నాడు–నేడులో ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే రాజాం నుంచి పాలకొండ వరకూ డబల్ రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ.13 కోట్లు మంజూరు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నిధులు కూడా త్వరలో మంజూరయ్యే అవకాశం ఉంది.

పూర్తిస్థాయిలో అభివృద్ధి



రాజాం ప్రధాన రహదారిలో పాలకొండ వైపు రోడ్డు గోతులమయమైంది. ఇందుకు కారణం గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ రహదారికి భారీగా నిధులు వెచ్చించి విడతల వారీగా రోడ్డును బాగుచేయిస్తోంది. రాజాంను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే కాకుండా చుట్టు పక్కల మండలాలకు డబల్ రోడ్డు నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే, రాజాం

వీటితో పాటు గతంలో మంజూరు చేసి వదిలేసిన సంతకవిటి–రాజాం రహదారిలో డబల్ రోడ్డు నిమిత్తం రూ.14.5 కోట్లు విడుదలకు స్థానిక ఎమ్మెల్యే పట్టుపడుతున్నారు. ఈ నిధులు వస్తే ఈరోడ్డు కూడా డబల్‌రోడ్డు కానుంది.

నేరస్తుల ఆచూకీ తెలపండి


మహారాష్ట్రకు చెందిన నేరస్తులు

విజయనగరం క్రైమ్: మహారాష్ట్రకు చెందిన నేరస్తులుగా భావిస్తున్న ప్రకాష్ నగేష్ షిండే, కొంతమంది వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి జిల్లాలో సంచరిస్తున్నట్లు పోలీసుశాఖకు సమాచారం అందిందని ఎస్పీ ఎం.దీపిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరస్తుల ఆచూకీ కనిపెట్టి, అదుపులోకి తీసుకునేందుకు జిల్లా పోలీసు శాఖ గాలింపు ముమ్మరం చేసిందన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా నిందితుల ఫొటోలను బహిర్గతం చేస్తున్నామని తెలిపారు. ఫొటోలో ఉన్న నేరస్తుల ఆచూకీ లభిస్తే, వెంటనే సమాచారాన్ని విజయనగరం రూరల్ సీఐ ఫోన్ నంబర్ 9121109427కు తెలియజేయాలని ఎస్పీ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు


జీఎంఆర్ నైరేడ్ సంస్థ

రాజాం: నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రాజాంలోని జీఎంఆర్ నైరేడ్ శిక్షణ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 7 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్‌లో వోల్టాస్ సహకారంతో 75 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసింగ్ విభాగంలో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలియజేసింది. స్త్రీలకు కంప్యూటర్ డీటీపీ విభాగంలో 45 రోజులు, లేడీస్ టైలరింగ్‌కు సంబంధించి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని వివరించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణ కోర్సులకు అర్హులని పేర్కొంది. ఇంటర్వ్యూ అక్టోబర్ 1 న ఉంటుందని, పదోతరగతి మార్క్సులిస్ట్, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లతో ఆరోజు ఉదయం 9 గంటలకు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కన నైరేడ్‌లో సంప్రదించాలని కోరింది. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించడంతో పాటు టీ షర్ట్, టూల్ కిట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వివరాలకు ఫోన్ 9989953145, 9866913371 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ అన్వేషిక పరీక్షకు కంచరాం విద్యార్థి


వరదరాజుతోపాటు గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాజాం సిటీ: జాతీయస్థాయి అన్వేషిక ప్రయోగ నైపుణ్య పరీక్షకు రాజాం మండలం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లగ్గ వరదరాజు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎంవీ సాయీశ్వరి సోమవారం తెలిపారు. ఈ నెల 18న విజయనగరంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్, ఫోకస్ అన్వేషిక నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులతో మూడు గంటల్లో మూడు ప్రయోగాలు చేయించి నైపుణ్యాన్ని పరీక్షించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన వరదరాజు అక్టోబర్‌లో కాన్పూర్ ఐఐటీలో జరగనున్న జాతీయ అన్వేషిక్ ప్రయోగ నైపుణ్య పరీక్షలో పాల్గొంటాడని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థి ఎంపికవడంతో హెచ్‌ఎంతో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

యువతకు ఉద్యోగావకాశాలు : డీఎస్పీ సుభాష్


డీఎస్పీ ఎ.సుభాష్

పార్వతీపురం టౌన్: రక్ష సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో పలు సంస్థల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసేందుకు యువతకు అవకాశాలు కల్పిస్తున్నట్లు డీఎస్పీ సుభాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు వారి ఆధ్వర్యంలో ఉచితంగా రెండు నెలల శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో మంచి జీతంతో సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 600 పోస్టుల భర్తీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న యువత వారి సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

వీరఘట్టం: డ్రింక్ అనుకుని సీసాలో ఉన్న యాసిడ్ తాగడంతో మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన బేరి అప్పన్న(65) మృతిచెందాడని ఎస్సై ఎం.హరికృష్ణ సోమవారం తెలిపారు. ఈనెల 14న పొరుపాటుగా యాసిడ్ తాగగా నోరంతా కాలిపోవడంతో వెంటనే పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదే రోజు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 8 గంటలకు మృతి చెందినట్లు మృతుడి కుమారుడు పోలినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వేపాడ హైస్కూల్‌లో ఆగంతుకుల ఆగడాలు


హైస్కూల్‌లో పదోతరగతి రూమ్‌ను చిందరవందరచేసి పుస్తకాలు కాల్చి, ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఆగంతుకులు


వేపాడ: మండల కేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగంతుకుల ఆగడాలు ఎక్కువైపోవడంతో పాఠశాలలో ఫర్నిచర్, పుస్తకాలు ధ్వంసమవుతున్నాయి. పాఠశాలలో పదోతరగతి గది గేటు తాళాలు పగులగొట్టిన ఆగంతుకులు తరగతి గదిలో ఫర్నిచర్, పుస్తకాలు ధ్వంసం చేసి కాల్చివేయడం, బోర్డుపై అసభ్యకరమైన రాతలు రాస్తుండడంతో ఉపాధ్యాయులకు ఏం చేయాలో తెలియని దుస్థితి ఏర్పడింది. గతంలో తలుపుల తాళాలు పగులగొట్టి ఫ్యాన్లు, లైట్లు దోచుకుపోయేవారు. శని,ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు..పాఠశాల తరగతి గది తాళాలు పగులగొట్టి, ఫర్నిచర్, పుస్తకాలు చిందరవందరగా ఉండడం చూసి అవాక్కయ్యారు. పాఠశాలలో పిల్లలు పుస్తకాలను ఉంచి హోంవర్క్ పుస్తకాలు తీసుకు వెళ్తుంటారు. ఆ పుస్తకాలను కాల్చి బోర్డులపై అసభ్యపదజాలంతో రాయడం బాధాకరంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై వల్లంపూడి పోలీసులకు సమాచారం అందించామని ఎస్సై, సిబ్బంది వచ్చి పరిశీలించి గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారని పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్ వల్లి తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం స్పందించి అకృత్యాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.


రికార్డుల్లో పేర్ల మార్పుపై కలెక్టర్ ఆరా

- నివేదిక కోసం తహసీల్దార్‌కు ఆదేశాలు
- 'భూ మంతర్ ఖాళీ' కథనంపై స్పందన

వీరఘట్టం: సాక్షి పత్రికలో సోమవారం ప్రచురితమైన 'భూ మంతర్ ఖాళీ' కథనంపై కలెక్టర్ స్పందించి ఆరా తీశారు. అసలేం జరిగిందో సమగ్ర నివేదిక ఇవ్వాలని వీరఘట్టం తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాధవి సంబంధిత వీఆర్‌ఓను వెంటనే పిలిపించి విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 379లో ఉన్న 66 సెంట్ల భూమిని ఎందుకు పలుమార్లు వేర్వేరు వ్యక్తుల పేరిట మార్పిడి చేశారని ప్రశ్నించారు. ఈ సర్వే నంబర్‌లో ఎంత మంది భూయజమానులు ఉన్నారు. వారికి ఆ భూమి ఏవిధంగా సంక్రమించిందో తెలుసుకునేందుకు పలువురు భూయజమానులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. పూర్తిస్థాయిలో వివరాలు రాబట్టేందుకు రెండు రోజుల సమయం పడుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ఇటువంటి తప్పులను ఉపేక్షించేది లేదని నిజమైన యజమానులకు భూమిని అప్పగిస్తామన్నారు.

కలెక్టర్ స్పందనకు 73 అర్జీలు


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పార్వతీపురం: స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత వ్యక్తులతో క్షేత్రస్థాయిలో విధిగా సంప్రదించి, సమస్య పరిష్కార ఫొటోలను అప్‌లోడ్ చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎక్కువగా పింఛన్లు, జగనన్న ఇంటి స్థలాలు, ఏనుగులు, పులుల బెడదనుంచి రక్షణ తదితర అంశాలపై 72 వినతులు అందాయి. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, డీఆర్‌ఓ జె.వెంకట్రావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఏహెచ్‌ఓ ఈశ్వరరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఈఓ పి.బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి, డీపీఓ బి.సత్యనారాయణ, డీవీఈఓ మంజులావీణ, డీఎంఓ కె.పైడిరాజు, డీడీఓ ఎ.లావణ్య, డీటీఓ ఎం.శశిభూషణరావు, డీపీటీఓ టీవీఎస్ సుధాకర్, డీఎఫ్‌ఓ కె.శ్రీనుబాబు, డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్సీ వెల్ఫేర్ ఎస్‌ఈ జె.శాంతీశ్వరరావు, డీటీఓ కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

పార్వతీపురంటౌన్: సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రజల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఎస్.శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఎస్సై దినకర్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించాక ఫొటో అప్‌లోడ్ చేయాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- స్పందనకు 192 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: స్పందన కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తు అందజేసినప్పుడు సంబంధిత ఫొటోను, సమస్య పరిష్కారమైన తరువాత ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి జిల్లా అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పంనకు ప్రజల నుంచి 192 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించినవి 134 అర్జీలున్నాయి. తరువత వరుసలో వైద్యశాఖ 26, డీఆర్‌డీఏ 12, మాన్యువల్‌గా 20 వినుతులు అందాయి. వినతులను కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ఉప కలెక్టర్లు సదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులకు సమాధానం రాసేటప్పుడు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్పందనలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిఫికేషన్ కార్డు ఉపయోగాలు, శాఖ ద్వారా చేపడుతున్న ఇతర సంక్షేమ పథకాల గురించి ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు.

ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యలను సత్వరంపరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించి బాధితుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఫోన్‌లో సూచనలు చేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం 45 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ రావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్పీ సీఐలు రుద్రశేఖర్, జి.రాంబాబు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై నిరంతరం నిఘా

- ప్రజలు ఆందోళన వద్దు
- ఫారెస్టు రేంజర్ త్రినాథరావు


ఫారెస్ట్ రేంజర్ త్రినాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో పులిసంచారం విషయమై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పార్వతీపురం ఫారెస్టు రేంజర్ త్రినాథరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాలూరు, మక్కువ మండలాల్లో పులి సంచరించి పశువులపై దాడిచేసిందని, ఈ మేరకు అటవీ శాఖాధికారులు పులి జాడను గుర్తించే పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అధికారులు బృందాలుగా ఏర్పడి పులిజాడను గుర్తించే విషయమై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పశువులను కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం అందించేందుకు పూర్తి చర్యలు చేపట్టామని తెలియజేశారు. పులిజాడను తెలుసుకునేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పులిజాడలు విజయనగరం జిల్లా బొబ్బిలి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పులి ఎటు వైపు వెళ్లిందో ట్రాక్ చేసే పనిలో ఉన్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో ఒంటరిగా తిరగరాదని హితవు పలికారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ


తిరుమలలో ఎమ్మెల్యే బడ్డుకొండ, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

డెంకాడ: నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో కలసి తిరుమల వేంకటేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. తన జన్మదినం రోజున స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

ఎంఈఓ పోస్టుల ప్రకటనపై హర్షం

విజయనగరం ఫూల్‌బాగ్: మండలానికి రెండు ఎంఈఓ పోస్టులు ప్రకటించడంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు. పంచాయతీరాజ్ ఉద్యోగులకు కూడా ఎంఈఓ పోస్టులు కేటాయించడం అభినందనీయమన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


ఈఓపీఆర్‌డీ భానోజీరావుకు వినతిపత్రం అందజేస్తున్న క్షేత్ర సహాయకులు

నెల్లిమర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని మండలానికి చెందిన ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఈఓపీఆర్‌డీ భానోజీరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకుల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, కనీస వేతనంగా రూ.20 వేలు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గౌరి, రామారావు, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ పి. బాలాజీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాం.దీనగర్ కాలనీ 6వ వార్డు సచివాలయం పరిధిలో ఒకటి, జరజాపుపేట 8వ వార్డు సచివాలయం పరిధిలో ఒక పోస్టు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఒకటి దివ్యాంగులకు, మరొకటి జనరల్ కేటగిరీకి కేటాయించామన్నారు. ఈ నెల 20 నుంచి 25 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్

విజయనగరం: రోటరీ విజయనగరం సెంట్రల్ నవతరోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెసానిక్ టెంపుల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ఈ పోటీలను రోటరీ పూర్వ గవర్నర్ ఎం.రామారావు ప్రారంభించగా.... చైర్మన్‌లు గ్రంధి కృష్ణ, రమేష్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కేఆర్‌కే రాజు, చైర్మన్ అశోక్, కో చైర్మన్ పీయూష్ అగర్వాల్ ప్రదర్శనలను తిలకించారు. నగరంలోని 8 పాఠశాలలకు చెందిన 16 టీమ్‌లు పోటీల్లో పాల్గొనగా... విజేతలకు నవతరోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

కుళాయిలు ప్రారంభం


కుళాయిలు ప్రారంభిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: అక్కివరం పంచాయతీలోని గొల్లపేట మోడల్‌స్కూల్‌లో పేరెంట్ కమిటీ చైర్మన్ ముద్దాడ రాము తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ ఏరియాను (కుళాయిలు) ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు సోమవారం ప్రారంభించారు. రూ.50 వేలతో పిల్లల చేతులు శుభ్రపరుచుకునేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వందేళ్ల తర్వాత..

- చురుగ్గా భూముల సర్వే
- గ్రామాల్లో ఎగురుతున్న 'డ్రోన్లు'
- మూడు మండలాల్లో సర్వే వేగవంతం
- రైతులు సహకరించాలని కోరుతున్న అధికారులు


నీలంరాజుపేటలో భూముల సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు (ఫైల్)

నెల్లిమర్ల రూరల్:

వందేళ్ల తర్వాత భూముల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పేరుతో గ్రామాల్లో సాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ సిబ్బంది వేగవంతం చేశారు. రాష్ట్రంలో 1920–27 మధ్యలో భూముల సర్వేజరిగింది. తర్వాత సర్వే చేయా లని ప్రయత్నించినప్పటికీ ఎవరికీ సాధ్యం కాలేదు. భూముల విషయంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను అధిగమించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల, డెంకా డ, పూసపాటిరేగ మండలాల్లో సమగ్ర భూము ల రీసర్వే కార్యక్రమం చురుగ్గా కొన సాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. దీనిపై ఆయా మండలాల తహసీల్దార్లు సర్వే సిబ్బందితో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తూ రీసర్వే వేగవంతానికి కృషి చేస్తున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో పల్లెల్లో డ్రోన్లను ఎగురువేస్తూ రీసర్వేను నిర్వహిస్తున్నారు.

భూముల రీసర్వే ఇలా...

నెల్లిమర్ల మండలంలోని నీలంరాజుపేట, కోరాడపేట, మధుపాడ గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేయగా గరికిపేట, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో సర్వే ప్రారంభమైంది. పూసపాటిరేగలోని మూడు గ్రామాల్లో డ్రోన్ సర్వేను పూర్తి చేసి ఓఆర్ఐ మ్యాప్‌లను సర్వే సిబ్బంది సిద్ధం చేశారు. మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. డెంకాడ మండలంలోని రెండు గ్రామాల్లో సర్వే పూర్తి కాగా.. మరో రెండు గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు మండలాల్లో మొత్తం ఆరు డ్రోన్ల ద్వారా సర్వే చేపడుతున్నారు. కాగా భోగాపురం మండలంలో త్వరలోనే భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

శాశ్వత భూ హక్కు కల్పించేందుకు చర్యలు

భూముల రీసర్వే ద్వారా కచ్చితత్వంతో కూడిన పట్టాలను రూపొందించి రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తారు. మూడేళ్ల తర్వాత వారికి పూర్తి హక్కులు లభిస్తాయి. ఈ లోగా ఏమైనా తేడాలుంటే సివిల్ కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. 2023 నాటికి సర్వే పూర్తి చేసి గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వందేళ్ల తర్వాత చేపట్టిన మహోన్నతమైన కార్యక్రమం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు సహకరించాలి..



ఏళ్ల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను కొలిక్కి తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమగ్ర భూముల రీ సర్వే ఆలోచన చారిత్రాత్మకమైన నిర్ణయం. సర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నెల్లిమర్ల మండలంలో భూముల రీసర్వే ప్రక్రియను విజయవంతంగా చేపడుతున్నాం. రైతులు సర్వే సిబ్బందికి సహకరిస్తే మంచి ఫలితాలు సాధిస్తాం. – కేవీ రమణరాజు, తహసీల్దార్, నెల్లిమర్ల మండలం

పారదర్శకంగా భూ సర్వే

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి


మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో భూముల రీసర్వే శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రణాళికా కార్యదర్శులు మూడు రోజుల పాటు జరిగే శిక్షణలో సర్వేపై పూర్తి అవగాహన ఏర్పరచుకుని ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా సర్వే చేపట్టాలని సూచించారు. ఏళ్లనాటి భూ వివాదాలను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సర్వే అండ్ రిజిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టర్ టి. త్రివిక్రమరావు మాట్లాడుతూ, రీసర్వే సమాచారం అంతా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయబడుతుందని, తద్వారా సమగ్ర సమాచారం ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ప్రతి ఒక్కరూ తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, 100 సంవత్సరాల తర్వాత రీ సర్వే చేపడుతుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ బంగార్రాజు, అసిస్టెంట్ సిటీప్లానర్ అమ్మాజీరావు, సర్వేయర్ సింహాచలం, ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టండి

- ప్రచారయాత్రను ప్రారంభించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు


జెండాఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

విజయనగరం ఫూల్‌బాగ్: కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎనిమిది సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం అన్నిరంగాల్లో విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు చుక్కలనంటుతున్నాయన్నారు. బియ్యం, పాలు, నూనెలు, పప్పు దినుసులతో సహా అన్ని వస్తువుల పైనా జీఎస్టీ పేరుతో భారం మోపారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలైతే రోజురోజుకూ పరుగులెడుతున్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీ, బ్యాంక్‌లు, బీఎస్ఎన్ఎల్‌తో సహా అన్నింటిని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అంబానీలు, అదానీలకు పోర్టులు, విమానాశ్రయాలు, టెలికం, విద్యుత్ రంగాలను దారాదత్తం చేయడం బాధాకరమన్నారు. ఇదే సమయంలో పేదలు, మధ్య తరగతి వారిని అన్నివిధాలా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ, సెప్టెంబర్ 14 నుంచి 27 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రసార ఆందోళన కార్యక్రమాలు.. 27 ఉదయం 10 గంటలకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర గల మోసానిక్ టెంపుల్ వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, పి.రమణమ్మ, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

రోటరీ స్పెల్ బీ పోటీలకు స్పందన


స్పెల్ బీ పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు

విజయనగరం: విద్యార్థులకు ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు స్పెల్ బీ పోటీలు దోహదపడతాయని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డి. ఉమాబాలాజీ తెలిపారు. పట్టణంలోని కొత్తగ్రహారం సామాజిక భవనంలో విద్యార్థులకు స్పెల్‌బీ పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థులను 18 గ్రూపులుగా విభజించి ఇంగ్లిష్ పదాలకు స్పెల్లింగ్‌లు అడిగి మార్కులు వేశారు. అంతకుముందు ఉమాబాలాజీ మాట్లాడుతూ వక్తృత్వం, వ్యాసరచన, స్పెల్ బీ పోటీలతో విద్యార్థుల మేధస్సు పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బి. సూర్యలక్ష్మి, యూత్ సర్వీస్ డైరెక్టర్ జి.రూప, చైర్మన్ జి. వినోద్‌కుమార్, ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, కాపుగంటి రవి, అరుణకుమారి, రాధికా రాణి, రాజేందర్, నాగప్రకాష్, శ్రీకాంత్ వర్మ, సంధ్యారాణి, సీతా విజ్వాని, తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్‌తో బాలల సమస్యలకు పరిష్కారం

విజయనగరం ఫూల్‌బాగ్: బాలల సమస్యలను హ్యూమన్ రైట్స్ క్లబ్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పూర్వ చైర్మన్ పి.చిట్టిబాబు అన్నారు. పారా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యూత్ హాస్టల్‌లో 50 పాఠశాలల హెచ్ఎంలకు 'మానవ హక్కులు, విద్య'పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో హ్యూమన్ రైట్స్ క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు కలిగి ఉంటారన్నారు. పారా సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ టి.రమేష్ మాట్లాడుతూ, పిల్లలు ఎదుర్కొన్న సమస్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వరప్రసాదరావు, కాశీబాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పైడితల్లి చండీయాగం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి చదురుగుడి వద్ద మంగళవారం చండీయాగం నిర్వహించనున్నట్లు ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ యాగంలో పాల్గొనాలని కోరారు.

డిప్యూటీ స్పీకర్‌కు అభినందనలు

విజయనగరం అర్బన్: రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విజయనగరం ఎమ్మెల్యే కొలగట్ల వీరభద్రస్వామికి కొప్పుల వెలమ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొరుపోలు సత్యారావు, జిల్లా నాయకులు మార్పిన అప్పలనాయుడు, వెంకటనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రధాన కాలువల్లో చెత్తను తొలగించండి

- మేయర్ విజయలక్ష్మి


కాలువను పరిశీలిస్తున్న నగర మేయర్, ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: నగరంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఆదేశించారు. 11వ డివిజన్‌లోని నల్లచెరువు ప్రధాన కాలువను సోమవారం పరిశీలించారు. కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోయిన విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న వివిధ విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఈఈ కె. శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో అరబిందో ఫార్మా కంపెనీ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. 2018 నుంచి 2022 విద్యా సంవత్సరాలలో బీఎస్సీ డిగ్రీ, ఎమ్మెస్సీ, బీ ఫార్మసీ, బీటెక్ (కెమికల్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం. సాంబశివరావు అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1,276 మంది విద్యార్థులు హాజరవ్వగా.. 613 మంది ఎంపికయ్యారని కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు కె..రాజసంతోష్, పి.నూకరాజు, అరబిందో సిబ్బంది సందీప్, రాహుల్ పాల్గొన్నారు.

ఇకపై ప్రతిరోజూ తనిఖీలు

- నగరపంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్
- సాక్షి ఎఫెక్ట్


పాన్ షాపు నుంచి పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

నెల్లిమర్ల: పాలిథిన్ ఉత్పత్తుల విక్రయాలపై సాక్షిలో 'నిషేధం ఉందా.. లేదా..?' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి నెల్లిమర్ల నగరపంచాయతీ అధికారులు స్పందించారు. పట్టణంలో ప్లాస్టిక్, పాలిథిన్ విక్రయిస్తున్న దుకాణాలు, హోటళ్లపై సోమవారం దాడులు నిర్వహించారు. కమిషనర్ బాలాజీ ప్రసాద్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు సచివాలయ కార్యదర్శులతో కలిసి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రధాన రహదారిలోని దుకాణాలపై దాడులు నిర్వహించారు. పాలిథిన్ బ్యాగులు, కవర్లు, గ్లాసులు, కప్పులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయాలు చేపడుతున్న దుకాణ యజమానులకు జరిమానా విధించారు. ఇకపై ప్రతిరోజూ దాడులు నిర్వహిస్తామని కమిషనర్ బాలాజీ ప్రసాద్ తెలిపారు.

ఉడా కాలనీలో చోరీ

విజయనగరం క్రైమ్: ఇంటి యజమానులు ఉంటుండగానే దొంగ తన చేతికి పనిచెప్పిన సంఘటన ఉడాకాలనీ బొబ్బాదిపేటలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉడాకాలనీ బొబ్బాదిపేట ప్రాంతంలో నివాసముంటున్న సుధారాణి ఇంటిలో దొంగతనం జరిగింది. కుటుంబ సభ్యులు ఇంటిలో ఉండగానే.. ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో దొంగ ప్రవేశించి బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బడ్డుకొండ జన్మదినోత్సవం

- కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు, అభిమానులు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు


డెంకాడ: ఎమ్మెల్యే బడ్డుకొండ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ,వైస్ ఎంపీపీ తదితరులు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్/డెంకాడ/భోగాపురం/భోగాపురం రూరల్/పూసపాటిరేగ: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే అన్నదానాలు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, మహేశ్వరి దంపతులు కేక్ కట్ చేశారు. అనంతరం 300 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కారుకొండ వెంకటకృష్ణారావు, చిక్కాల సంతోష్‌కుమార్, మొయిద శ్రీనివాసరావు, జానా ప్రసాద్, నక్కాన వెంకటరావు, రవ్వా నాని, గంటా సతీష్, గంటా మధు తదితరులు పాల్గొన్నారు. చంద్రంపేటలో నాయకులు కర్రోతు వెంకటరమణ, అప్పలనాయుడు ఆధ్వర్యంలో... పూతికపేటలో లెంక గోవిందరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంబరాలు చేపట్టారు. డెంకాడ మండల కాంప్లెక్స్ ప్రాంగణం ఆవరణలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బడ్డుకొండ అప్పలనాయుడుపై రూపొందించిన పాటల సీడీలను ఆవిష్కరించారు.స్థానిక పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్ బోని అప్పలనాయుడు మోపాడ వద్దనున్న అనాథాశ్రయానికి పది బస్తాల బియ్యం అందజేశారు. ఆకులపేట గ్రామంలో సర్పంచ్ సువ్వాడ రమేష్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భోగాపురం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు అభిమానుల నడుమ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పేదలకు పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. గ్రామాల్లోని ఆలయాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ పేరిట ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు సుభోషణరావు, పడాల భాను, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, ఆళ్ల ఉదయబాబు, బాలిపల్లి సత్తిబాబు, పాలెపు కనకరాజు, అడపా ప్రసాద్, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, దంతులూరి సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు. పూసపాటిరేగ మండల కేంద్రంలో ఎంపీపీ మహంతి కల్యాణి కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. స్థానిక క్యాంపస్ చాలెంజ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మహంతి సీతాలక్ష్మి, అల్లాడ రమేష్, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, బొల్లు రమేష్, దాడిశెట్టి త్రినాథరావు, పిన్నింటి ఎల్లంనాయుడు, మహంతి లక్ష్మణరావు, పట్టెపు శ్రీనివాసరావు, దారపు గున్నారెడ్డి, రౌతు సాయికుమార్, టి.సీతారాం, కోట్ల రఘు, తాడిశెట్టి బాబు, రౌతు సత్తిబాబు, కె. శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు


పూసపాటిరేగ: రోగులకు పండ్లు , రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, తదితరులు


నెల్లిమర్ల రూరల్: పూతికపేటలో కేక్ కట్ చేస్తున్న వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, తదితరులు


భోగాపురం రూరల్: ఉప్పాడపేటలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు


భోగాపురం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు

సభా సమయం





"నేను ఆప్యాయంగా 'స్వామి అన్నా' అని పిలుచుకునే వ్యక్తిని రాజ్యాంగ బద్ధమైన స్థానంలో కూర్చోబెట్టడం గర్వంగా ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఉన్న ఆయన అనుభవం ఈ స్థానానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. మీరు ఉప సభాపతిగా ఈ చట్టసభలో అందరికీ న్యాయంచేయాలని ఆశిస్తూ.. మీకు నా అభినందనలు. ఈ సందర్భంగా మీకంటే ముందు ఉప సభాపతిగా ఉన్న కోన రఘుపతి... మరో సామాజికవర్గానికి అవకాశం ఇవ్వాలని చెప్పగానే మనస్ఫూర్తిగా అంగీకరించారు. చిరునవ్వుతో ఆయన స్వాగతించారు.

- ఉపసభాపతిగా కోలగట్ల వీరభద్రస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మీడియా పాయింట్

ముందు కౌన్సిలర్‌గా గెలవండి

• మంత్రి ఆర్కే రోజా



పవన్ కళ్యాణ్ ఓ సర్వే చేయించారట. మాకు 45 నుంచి 65 సీట్లు వస్తే మిగతావన్నీ పవన్‌కు వస్తాయా? ఇదే సర్వేవల్ల కదా ఆయన రెండు చోట్లా పోటీ చేసి బొక్కబోర్లా పడ్డారు. జగన్ గెలవరు ఇది నా శాసనం అన్నారు గతంలో. శాసన సభకే రాకుండా చేశాం. ముందు ఆయన కౌన్సిలర్‌గా గెలవాలి. తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ అవ్వాలి. ఆ తర్వాత చూద్దాం ఎమ్మెల్యే గురించి. సినిమా హీరోలంతా పవన్‌ను చూసి సిగ్గుపడుతున్నారు. ఎన్టీఆర్, చిరంజీవి సింగిల్‌గా పోటీ చేశారు. కేసీఆర్‌తో భోజనం మీటింగ్‌లో కూర్చుని రాష్ట్రానికి రావాల్సినవన్నీ జగన్ వదిలేసుకున్నారని పవన్ విమర్శించారు. ఓటుకు నోటు కేసులో హైదరాబాద్ నుంచి పారిపోయి కరకట్టలో దాక్కున్న చంద్రబాబుని ఎందుకు ప్రశ్నించలేదు? విభజన చట్టాలు అమలు కానప్పుడు షూటింగ్‌లో ఉన్నారా.. సూట్ కేసులు తీసుకుంటున్నారా? దమ్ముంటే జగనన్నపై పవన్ సింగిల్‌గా పోటీచేయాలి. లోకేష్ వాయిదా వేయగానే మీరూ యాత్రలు వాయిదా వేశారంటే మీ ఇద్దరి మధ్య స్నేహం అర్థం అవుతోంది. రైతులకు చంద్రబాబు ద్రోహం చేస్తే జగన్ మూడేళ్లలో మంచి చేశారు. చంద్రబాబు మూడున్నర లక్షల కోట్లు అప్పు చేసి వెళ్ళి పోయారు.

ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి గురించి ఏం మాట్లాడాలి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎమ్మెల్యేగా గెలవలేని పవన్ గురించి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేనేమి మాట్లాడాలి? ఆయన ఒక నటుడు. రాజకీయంలో ఏం అనుభవం ఉంది? మొక్కుబడిగా సభ పెడుతున్నారని యనమల అన్నారు. కనీసం ఆ ఐదు రోజులూ టీడీపీ వాళ్లు సవ్యంగా జరగనివ్వడంలేదు. వారికి సమస్యలపై చర్చించే ధైర్యం లేదు. చర్చిస్తే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని భయం. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం పైన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపైన అనవసర ఆరోపణలు చేస్తున్నారు. మూడు రాజధానులు, ఆర్థిక పరిస్థితులపై సీఎం ప్రెజెంటేషన్ ఇచ్చాక ప్రజల్లో చర్చ మొదలైంది. టీడీపీ హయాంలో రైతు ఆత్మహత్యల పరిహారం ఎగ్గొడితే మేం ఇచ్చాం. శ్వేతపత్రం ఏంటి అన్ని పత్రాలూ అసెంబ్లీ సాక్షిగా చూపిస్తున్నాం.

చర్చకు భయపడుతున్నారు

• ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు



సభలో చర్చకు టీడీపీ నాయకులు భయపడుతున్నారు. సబ్జెక్ట్ లేకుండా సభకు వస్తున్నారు. ఎప్పుడు సస్పెండ్ చేయించుకుని వెళ్లిపోదామా అన్నట్లు టీడీపీ సభ్యుల ప్రవర్తన ఉంది. వారిని బలవంతంగా చంద్రబాబు అసెంబ్లీకి పంపుతున్నట్టున్నారు. వాళ్లు బీఏసీలో ఒకటి, అసెంబ్లీలో మరొకటి మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో చర్చించకుండా బయటకు వచ్చి సీఎం చెప్పిన లెక్కలు అసత్యాలంటున్నారు. చర్చ జరిగితేనే కదా వాస్తవాలేమిటో తెలిసేది.

సభ సజావుగా జరగనివ్వండి

• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రైతుకి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేస్తోంది. ఇంకా రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభలో ప్రస్తావించాలని నూతన సభ్యులు ఎదురుచూస్తుంటే.. ప్రతిపక్ష టీడీపీ సభ్యులు వారికి మాట్లాడే అవకాశం లేకుండా సభను పదేపదే అడ్డుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టుపై సీఎం వైఎస్ జగన్ చాలా స్పష్టంగా మాట్లాడారు. దీంతో టీడీపీ సభ్యులకు తల ఎక్కడ పెట్టుకోవాలో కూడా అర్థం కాలేదు. అమరావతి పేరుతో టీడీపీ చేయిస్తున్నవి దొంగ యాత్రలని ప్రజలకు తెలుసు.

నిర్మాణాత్మక పాత్ర పోషించడంలో విపక్షం విఫలం

• మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



శాసన సభలో నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన ప్రతిపక్ష పార్టీ పూర్తిగా విఫలమైంది. టీడీపీ చెప్పే అసత్యాలను ప్రజలు నమ్ముతారనే ఇంకా భావిస్తున్నారు. అందుకే సభలో ప్లకార్డుల ప్రదర్శనతో ఎంతో విలువైన శాసన సభా సమయాన్ని వృథా చేస్తున్నారు. మాది రైతు వ్యతిరేక పాలన అనే టీడీపీ ఆరోపణను పూర్తిగా ఖండిస్తున్నా. వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. ఈ ఏడాది జూన్ ఒకటిన డెల్టాకు నీరు ఇచ్చిన మా ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమా? చంద్రబాబు బుద్ధేమిటో ప్రజలకు తెలుసు. అందుకే చిత్తుగా ఓడించి, రాజకీయాలకు పనికిరారని తేల్చారు. అయినా చంద్రబాబుకు బుద్ధి రాలేదు.

పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకున్న చంద్రబాబు

• ఎమ్మెల్సీ పోతుల సునీత



ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారు. దాన్ని పూర్తి చేయకుండా పోలవరానికి, రాష్ట్ర ప్రజలకు బాబు ద్రోహం చేశారు. సీఎం జగన్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం సీఎం జగన్ గ్రామ సచివాలయాలను, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆయనకు అన్ని వర్గాల ప్రజలు అండగా ఉన్నారు. చంద్రబాబు విషయంలో రాష్ట్ర ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. అధికారంలోకి వచ్చేందుకు ఆయన చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి.

మండలిలో చర్చకంటే రచ్చ ఎక్కువ

• పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



శాసన మండలిలో సభ్యులు ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు. చర్చకంటే రచ్చ ఎక్కువగా నడుస్తోంది. పోలవరంపై ఎవరి లెక్కలు వారు చెబుతున్నారు. వరదతో పాటు పాలకులు కూడా ముంచారని ముంపు ప్రాంతాల ప్రజలు విమర్శిస్తున్నారు. పునరావాసానికి సంబంధించిన లెక్కలను స్పష్టం చేయాలి. ముంపు బాధితులకు న్యాయం చేయాలి.

టీడీపీ తీరు షరా మామూలే..

మూడో రోజూ అసెంబ్లీలో తెలుగుదేశం సభ్యుల రభస

- వ్యవసాయంపై బుధవారం చర్చిస్తామన్న ప్రభుత్వం
- అయినా సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు గలాభా
- ఒకరోజు టీడీపీ సభ్యుల సస్పెన్షన్
- వారి తీరుపై స్పీకర్ తమ్మినేని అసంతృప్తి



పోడియం ఎక్కి స్పీకర్‌ను చుట్టుముట్టిన టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: శాసనసభలో వరుసగా మూడోరోజు కూడా ప్రతిపక్ష టీడీపీ సభ్యుల తీరు మారలేదు. పాలనాపరమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమన్నా సరే సభలో గలాభా సృష్టించేందుకే ఆ పార్టీ మొగ్గుచూపింది. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చల కంటే సభ నుంచి పలాయనానికే మరోసారి ప్రాధాన్యమిచ్చింది. సోమవారం మధ్యాహ్నం భోజన విరామానంతరం సభ ప్రారంభం కాగానే రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ మాట్లాడేందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం అనుమతించారు. కానీ, టీడీపీ సభ్యులు వ్యవసాయ రంగంపై చర్చించాలని పట్టుబట్టారు. వ్యవసాయం, రైతుల అంశాలపై బుధవారం సభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ చెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. ప్రభుత్వం చర్చకు వెనుకంజ వేస్తే అభ్యంతరం తెలపాలి గానీ, చర్చించేందుకు సిద్ధమని ప్రకటించాక అడ్డుకోవడం తగదని స్పీకర్ ఎంతగా చెప్పినా వారు వినిపించుకోలేదు. ప్లకార్డులు పట్టుకుని స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. అంతేకాక, ఎమ్మెల్యేలు బాలవీరాంజనేయ స్వామి, వెలగపూడి రామకృష్ణబాబు, మంతెన రామరాజు, జోగేశ్వరరావు, బుచ్చయ్యచౌదరి తదితరులు స్పీకర్ పోడియంపైకి చేరుకుని సభను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీనిపై చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించే విషయంలో టీడీపీ సభ్యులకు ఏమాత్రం చిత్తశుద్ధిలేదని విమర్శించారు. ఎంత త్వరగా సస్పెండై బయటకు వెళ్లిపోవాలన్నదే వారి ఉద్దేశంగా ఉందని మూడు రోజులుగా తెలుస్తూనే ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల అంశంపై మాట్లాడేందుకు టీడీపీ సభ్యులకు ధైర్యంలేదని విమర్శించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇప్పటికే సభకు ముఖం చాటేయగా ఆ పార్టీ సభ్యులూ బయటకెళ్లి తమ పచ్చ మీడియాతో మాట్లాడాలని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంతగా సర్దిచెప్పినప్పటికీ టీడీపీ సభ్యుల తీరు మారకపోవడంతో వారిని సస్పెండ్ చేసేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని శాసనసభా వ్యవహారాల శాఖను సోమవారం పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాను ఆదేశించారు. దాంతో టీడీపీ సభ్యులు అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్, బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి భవానీ, పెతకంశెట్టి గణబాబు, చినరాజప్ప, జోగేశ్వరరావు, పయ్యావుల కేశవ్, వెలగపూడి రామకృష్ణబాబు, రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాలవీరాంజనేయ స్వామిలను సస్పెండ్ చేయాలని అంజాద్‌బాషా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. దాంతో స్పీకర్ వారిని ఒకరోజు సస్పెండ్ చేశారు.

సభను అడ్డుకునేందుకే వస్తున్నారు : సీఎం జగన్

ఇక కేవలం అసెంబ్లీ కార్యక్రమాలను అడ్డుకోవాలనే దురాలోచనతోనే టీడీపీ సభ్యులు సభకు వస్తున్నారని సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. శాసనసభ కార్యకలాపాలను వారు అడ్డుకోవడంపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చ జరగకూడదు.. ప్రజలకు నిజాలు తెలియకూడదనే ఉద్దేశంతోనే వారు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ అంశాలపై బుధవారం చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. అందుకు స్పీకర్ అనుమతించిన తరువాత కూడా టీడీపీ సభ్యుల ప్రవర్తన మారకపోవడాన్ని సీఎం తప్పుబట్టారు. చంద్రబాబు సభకు రారు.. వీళ్లను పంపించి సభను అడ్డుకోవాలని ప్రయత్నిస్తారని విమర్శించారు. టీడీపీ సభ్యులను అవసరమైతే సస్పెండ్‌చేసి సభా కార్యక్రమాలను సజావుగా సాగేలా.. ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని ఆయన స్పీకర్‌కు సూచించారు.

ప్రజలే నిర్ణయిస్తారు

• స్పీకర్ తమ్మినేని సీతారాం



మరోవైపు.. అసెంబ్లీలో టీడీపీ సభ్యుల తీరుపై స్పీకర్ తమ్మినేని సీతారాం అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించేందుకు ఉద్దేశించిన సభా కార్యక్రమాలను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఉద్దేశపూర్వకంగానే సభను అడ్డుకుంటున్న వారిని ఈ సమావేశాల వరకూ సస్పెండ్ చేయవచ్చన్నారు. కానీ, ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశమివ్వాలన్న ఉద్దేశంతో సంయమనంతో వ్యవహరిస్తున్నానన్నారు. అందుకే వారికివ్వాల్సిన సమయం కంటే ఎక్కువ సేపు మాట్లాడేందుకు అనుమతిస్తున్నా వారు ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. ప్రజలకు అన్ని విషయాలను తెలియాలని, వారే అంతిమ నిర్ణేతలన్నారు.

ఉప సభాపతిగా 'కోలగట్ల'

ఏకగ్రీవంగా ఎన్నికైన కోలగట్ల వీరభద్రస్వామి



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సభాపతి స్థానంలో కూర్చోబెడుతున్న స్పీకర్ తమ్మినేని, సీఎం వైఎస్ జగన్, మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా కోలగట్ల వీరభద్రస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమం అనంతరం ఉప సభాపతిగా వీరభద్రస్వామి ఏకగ్రీవమైనట్లు సభాపతి తమ్మినేని సీతారాం ప్రకటించారు. ఇటీవల ఉప సభాపతిగా కోన రఘుపతి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కోలగట్ల వీరభద్రస్వామి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన గెలుపు లాంఛనమైంది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ నూతన ఉప సభాపతిని ఆలింగనం చేసుకుని స్వయంగా సభాపతి స్థానం వద్దకు తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టారు. సభాపతితో పాటు అధికార, ప్రతిపక్ష సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ ఉప సభాపతిగా కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నికవడం సంతోషాన్నిస్తోందన్నారు. ఆప్యాయంగా 'స్వామి అన్నా' అని పిలుచుకునే వ్యక్తిని రాజ్యాంగ బద్ధమైన స్థానంలో కూర్చోబెట్టడం గర్వంగా ఉందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా ఆయన అనుభవం ఈ స్థానానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తొలిసారిగా 2004లో అసెంబ్లీకి ఎన్నికయ్యారని, ఆ తర్వాత పరిణామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా రాజీనామా చేసి ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీలో తన వెంటే నడుస్తున్నారని చెప్పారు. 'మీరు ఉప సభాపతిగా ఈ చట్టసభలో అందరికీ న్యాయంచేయాలని ఆశిస్తూ.. మీకు నా అభినందనలు. ఈ సందర్భంగా మీకంటే ముందు ఉప సభాపతిగా ఉన్న కోన రఘుపతి చేసిన మంచి ఈ సభ ద్వారా అందరికీ తెలియాలి. మూడేళ్లపాటు ఉప సభాపతిగా పనిచేసిన ఆయన.. మరో సామాజికవర్గానికి స్థానం ఇవ్వాలని చెప్పగానే మనస్ఫూర్తిగా అంగీకరించారు. మన పార్టీలో వీలైనంత ఎక్కువమందికి ప్రాధాన్యమిచ్చే కార్యక్రమం జరుగుతుంది. అది చాలా మంచిదంటూ ఎటువంటి బాధలేకుండా చిరునవ్వుతో ఆయన స్వాగతించారు.' అని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

ఉత్తరాంధ్రకు దక్కిన గౌరవం

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో సభాపతిగా, ఉప సభాపతిగా ఉత్తరాంధ్ర వాసులు ఉండటం గర్వంగా ఉందన్నారు. ఉప సభాపతిగా వీరభద్రస్వామికి లభించిన పదవి వైశ్యులకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా వీరభద్రస్వామికి ఉన్న అనుభవం సభ నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాజ్యాంగబద్ధమైన పదవిని అలంకరించిన తొలి వ్యక్తిగా కోలగట్ల రికార్డు సృష్టించారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలను సమానంగా చూసి ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరిగేలా చూడాలని కోరారు.

ఇది ఆర్యవైశ్యులకు దక్కిన గౌరవం: కోలగట్ల

'నన్ను వ్యక్తిగా ఉప సభాపతి స్థానంలో కూర్చోబెట్టినప్పటికీ ఈ గౌరవం రాష్ట్రంలోని మా ఆర్యవైశ్య సామాజికవర్గానికి దక్కుతుంది. నాకు ఇంతటి అవకాశమిచ్చిన విజయనగరం నియోజకవర్గ ప్రజలను ఈ సభ గౌరవించింది'.. అంటూ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఉప సభాపతిగా ఎన్నికైన అనంతరం ఆయన సభాపతి స్థానం నుంచి మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించిన తాను.. మున్సిపల్ కౌన్సిలర్ మొదలు ఉభయ సభల వరకు సేవలందించడంవల్లే ఇంతటి గౌరవ స్థానానికి వచ్చానన్నారు. ఐదు నెలల కిందట ఉప సభాపతిగా సీఎం జగన్ తన పేరు ప్రకటించి మాటతప్పకుండా తనను ఈ స్థానంలో కూర్చోబెట్టారన్నారు. సభలో ఉన్నంతవరకు పక్షపాతం లేకుండా వ్యవహరిస్తానని చెప్పారు. తనను ఉప సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు 'కోలగట్ల' కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సభపై, సభ్యులపై ఉన్న గౌరవాన్ని పెంపొందించేలా అందరూ సహకరించాలన్నారు. సభ్యుల హక్కులను కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను హుందాగా నడిపిస్తానన్నారు.

మరో దేశంలో అయితే చంద్రబాబుకు ఉరే

- పోలవరంపై తప్పిదాలు ఆయన్ను తరతరాలు వెంటాడతాయి
- మంత్రి అంబటి రాంబాబు మండిపాటు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఇక్కడ మోసాలు చేసినట్లు మరో దేశంలో చేసి ఉంటే, ఆయన్ను ఉరి తీస్తారని రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పోలవరం విషయంలో ఆయన చేసిన తప్పిదాలు ఆయన్ను తరతరాలు వెంటాడుతూనే ఉంటాయని, వ్యవస్థలను మేనేజ్ చేసుకోవడంలో దిట్ట కాబట్టే ఇక్కడ ఆయన ఆటలు సాగుతున్నాయని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు పరిహారంపై సోమవారం అసెంబ్లీలో టీడీపీ సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'విభజన హామీల ప్రకారం కేంద్రం కట్టాల్సిన ప్రాజెక్టు ఇది. కానీ పట్టుపట్టి నిర్మాణ బాధ్యతలు తీసుకున్న గత ప్రభుత్వం.. 2018 నాటికి పూర్తి చేస్తామని బల్లగుద్ది చెప్పింది. కానీ పూర్తి చేయలేదు. ఈ దుస్థితికి చంద్రబాబే కారణం. పోలవరానికి ఆయన చేసిన అన్యాయం మాటల్లో చెప్పలేం. పోలవరాన్ని ఆయన ఏటీఎంగా మార్చుకుని దోచుకున్నారు. రామోజీ బంధువు కంపెనీ అయిన నవయుగకు ఈ ప్రాజెక్టును అప్పగించారు. ముందు చూపు లేకుండా డయా ఫ్రమ్ వాల్ నిర్మించారు. కాఫర్ డ్యామ్ మధ్యలో ఆపేశారు. వరద నీరు కాఫర్ డ్యామ్ గ్యాప్‌ల ద్వారా వెళ్లడంతో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. ప్రపంచంలో ఎక్కడైనా ఇలా నిర్మించారా? డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడం వల్ల రూ.400 కోట్లు, కోతను పూడ్చేందుకు మరో రూ.2 వేల కోట్లు అదనంగా భారం పడేలా చేశారు. ఎకరాకు రూ.1.50 లక్షల చొప్పున తీసుకొని భూములు ఖాళీ చేసి వెళ్లిన పోలవరం నిర్వాసితుల గురించి బాబు ఏనాడైనా ఆలోచించారా? ప్రాజెక్టు డిస్ప్లేస్ ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గిస్తున్నారన్న మీ మాటల్లో వాస్తవం లేదు. 45.72 మీటర్ల ఎత్తు వరకు ప్రాజెక్టును దశల వారీగా పూర్తి చేసి తీరుతాం. అని అంబటి అన్నారు.

3 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

సాక్షి, అమరావతి: శాసనసభ సోమవారం మూడు బిల్లులను ఆమోదించింది. కార్పొరేట్, ఇతర పెద్ద కంపెనీలు రాష్ట్రంలో తమ ఫ్రాంచైజీలు, డీలర్లకు లైసెన్సు ఇచ్చేటప్పుడు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులకు సంబంధించిన భారత (ఏపీ) స్టాంపు చట్ట సవరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది నియామకంలో ఏకరూపత ఉండేలా సంబంధిత కమిటీల్లో ఉన్నత విద్య, ఆర్థిక శాఖాధికారులను నియమించేందుకు ఉద్దేశించిన ఏపీ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లును, క్యాంపస్‌ల వారీగా ఉన్న నియామక ప్రక్రియ, రోస్టర్ నిర్ణయాన్ని యూనివర్సిటీ ప్రాతిపదికగా చేసే అధికారాన్ని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి దఖలుపరిచే సవరణ బిల్లును సభ ఆమోదించింది. కాగా, మరో ఐదు బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. ఏపీ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ చట్ట సవరణ బిల్లును ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టారు. ఏపీ సర్వే, సరిహద్దుల చట్ట సవరణ బిల్లు, ఏపీ భూమి హక్కులు, పట్టాదార్ పాస్ పుస్తకాల చట్ట సవరణ బిల్లు, ఏపీ కౌలుదారీ (ఆంధ్ర ప్రాంత) రద్దు చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీల చట్ట సవరణ బిల్లును వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రవేశపెట్టారు.

మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం

అసెంబ్లీలో ఆమోదించిన నాలుగు బిల్లులను శాసన మండలిలో సభ్యులు ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లు-2022, ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సవరణ) బిల్లు-2022, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (డిసిప్లినరీ ప్రొసీడింగ్స్ ట్రిబ్యునల్) (రద్దు) బిల్లు-2022, ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తి, పశువుల) మార్కెట్లు (సవరణ) బిల్లు-2022లను మండలి ఆమోదించింది.

శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు

మెరుగైన వైద్యమే మా ప్రభుత్వ సంకల్పం

• వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. శాసన మండలిలో సోమవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె బదులిస్తూ.. గత ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేకపోయిందన్నారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో ఏపీలో 16 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రూ.7,850 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. మూడు కాలేజీలకు మాత్రం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.195 కోట్లు అందించిందని తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ సీఎం జగన్ లక్ష్యమన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మరో కాలేజీ ఏర్పాటుకు సీఎం ప్రతిపాదించారని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి 5 కాలేజీల్లో అడ్మిషన్లు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలా తాము దోమలపై దండయాత్ర, యుద్ధం అంటూ డబ్బాలు కొట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఏజెన్సీలో ఇటీవల సంధ్య అనే బాలిక చనిపోయింది విష జ్వరం వల్ల కాదని, ఇతర అనారోగ్యం కారణంగా మరణించిందని అధికారులు నిర్ధారించారని చెప్పారు.

మూడేళ్లలోనే 22.03 లక్షల మందికి కొత్తగా పింఛన్లు

• ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటివరకు 22,03,355 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు చెప్పారు. సోమవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వమే వలంటీర్ల ఆధ్వర్యంలో సంతృప్త స్థాయిలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల మంజూరులో జన్మభూమి కమిటీలు అడ్డగోలుగా అర్హత ఉన్న వారిని కూడా పక్కన పెట్టి, నచ్చిన వారికి మాత్రమే కొత్త పింఛన్లు మంజూరు చేశాయని వివరించారు. ఇప్పుడు పింఛన్ల కోసం ఆ పరిస్థితి ఎక్కడైనా ఉందా.. అని ప్రశ్నించారు. టీడీపీ ఐదేళ్ల కాలంలో పింఛన్ల కోసం రూ.27,687 కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం కేవలం 40 నెలల్లోనే పింఛన్ల రూపంలో రూ.56,937.28 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసిందని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో నెలకు సరాసరిన రూ. 461 కోట్లు పింఛన్లకు ఇవ్వగా, ఇప్పుడు ప్రతి నెలా రూ. 1,579 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తోందని తెలిపారు.

ఉలికిపాటు ఎందుకు

• గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



రాష్ట్రంలో మునుపెన్నడూలేని విధంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల గురించి వివరిస్తుంటే టీడీపీ సభ్యులకు ఉలికిపాటు ఎందుకని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మెడికల్ కాలేజీల గురించి ఆయన వివరిస్తున్న సమయంలో టీడీపీ సభ్యులు అడ్డుపడటంతో కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. తనను మంత్రి రమేష్ అవమానించారంటూ టీడీపీ సభ్యుడు ఫరూక్ అభ్యంతరం తెలిపారు. రాతపూర్వకంగా ఇస్తే రికార్డులు పరిశీలిస్తానని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు బదులివ్వడంతో వివాదం సద్దుమణిగింది.

శాసనసభలో ప్రశ్నోత్తరాలు

రైతులకు అండగా నిలిచాం

• మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. రైతు ముంగిటకే సేవలందించే లక్ష్యంతో ఆర్బీకేలను వన్ స్టాప్ డెస్టినేషన్స్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మిల్లర్లు, దళారీల ప్రమేయం లేకుండా ధాన్యాన్ని కల్లాల నుంచే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. 2021-22 ఖరీఫ్ సీజన్‌లో 5,784 ఆర్బీకేల ద్వారా 40,31,656 టన్నులు, రబీలో 3,257 ఆర్బీకేల ద్వారా 26,93,450 టన్నులు చొప్పున మొత్తం 67.27 లక్షల టన్నుల ధాన్యం కొన్నామన్నారు. ఖరీఫ్‌లో 5,79,405 మంది రైతులకు రూ.7,839 కోట్లు, రబీలో 2,31,970 మంది రైతులకు రూ.4,829 కోట్లు చొప్పున మొత్తం 8.11 లక్షల రైతులకు రూ.12,669 కోట్లు చెల్లించామని వివరించారు.

మనమే ఆదర్శం: ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ.. రూ.2,500 కోట్లతో 10 వేలకు పైగా ఆర్బీకేలను ఏర్పాటు చేశారన్నారు. మనల్ని ఆదర్శంగా తీసుకొని ఒడిశాలో కూడా ఆర్బీకేలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పగటి పూటే 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ధాన్యం బకాలు రూ.960 కోట్లు, విత్తన బకాయిలు రూ.384 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబుకు రైతుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చుని అన్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణల ద్వారా మరో గ్రీన్ రివెల్యూషన్ తెస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని ఎమ్మెల్యే గొల్లబాబూరావు చెప్పారు. గతంలో 1,700 ఉన్న కొనుగోలు కేంద్రాల సంఖ్యను 5,784కు పెంచడమే కాకుండా, దళారీ వ్యవస్థ లేకుండా కల్లాల నుంచే కొంటున్నామని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కల్లాల వద్ద నిర్దేశించిన తేమ శాతానికే కొనేలా చర్యలు తీసుకోవాలని, గన్నీ బ్యాగ్‌ల కొరత లేకుండా చూడాలని చెప్పారు. అన్ని భూములు వెబ్‌ల్యాండ్ పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే టమాటా, వేరు శనగకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. ధాన్యంతో పాటు ఇతర పంటలను కూడా ఆర్బీకేల ద్వారా కొనాలని కోరారు.

ఎన్టీఆర్, వైఎస్సార్, జగన్ ట్రెండ్ సెట్టర్స్

• కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలి, ప్రజల కష్టాలు ఎలా తీర్చాలని బాగా ఆలోచించిన వ్యక్తి సీఎం జగన్ అని పేర్కొన్నారు. అసెంబ్లీ మూడో రోజు సోమవారం 'విద్య, వైద్యంలో నాడు-నేడు' అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్టీఆర్, వైఎస్సార్, జగన్ మాత్రమే ట్రెండ్ సెట్టర్లని చెప్పారు. చంద్రబాబుకు ప్రజలు అవకాశం ఇచ్చినా 14 ఏళ్ల పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనని అన్నారు. ప్రజలు వలస వెళ్లకూడదని, ఆత్మహత్యలకు పాల్పడకూడదని పిల్లలు బాగా చదువుకోవాలని సీఎం జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
మంగళవారం ॥ 20-9-2022


స్వాతి రాథోడ్ | పారుల్ భరద్వాజ్

సవాలుకు సై

'ఎగిరించకు లోహ విహంగాలను' అన్నారు శ్రీశ్రీ 'సాహసి' కవితలో. ఈ సాహసులు మాత్రం రకరకాల లోహవిహంగాలను ఎగిరించడంలో తమ సత్తా చాటుతున్నారు. చండీగఢ్, అస్సాంలోని మోహన్‌బరీ చినూక్ హెలికాప్టర్ యూనిట్‌లలో తొలిసారిగా ఇద్దరు మహిళా ఫైటర్ పైలట్‌లు విధులు నిర్వహించబోతున్నారు....

మూడు సంవత్సరాల క్రితం...

'ఇది చిరకాలం గుర్తుండే పోయే శుభసందర్భం' అనే ఆనందకరమైన మాట ఫ్లైట్ లెఫ్టినెంట్ పారుల్ భరద్వాజ నోటి నుంచి వినిపించింది. రష్యా తయారీ ఎంఐ–17వీ5 హెలికాప్టర్‌ను నడిపిన తొలి 'ఆల్ ఉమెన్ క్రూ'లో పారుల్ భరద్వాజ్ ఒకరు. ఆమెతోపాటు ఫ్లైట్ లెఫ్టినెంట్ హీన జైస్వాల్, ఫ్లైయింగ్ ఆఫీసర్ అమన్ నిధి ఉన్నారు.

'ఆల్ ఉమెన్ క్రూ'కు ఎంపిక కావడం అంత తేలికైన విషయం కాదు. రకరకాల పరీక్షలలో విజయం సాధించి దీనికి ఎంపికయ్యారు.

మొదట సికింద్రాబాద్‌లోని హకీంపేట్ హెలికాప్టర్ ట్రైనింగ్ సెంటర్‌లో, ఆ తరువాత బెంగళూరులో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

'ఎంఐ–17వీ5 నడిపే మహిళా బృందంలో నేను భాగం అయినందుకు గర్వంగా ఉంది. దేశం కోసం ఏదైనా చేయాలనుకునేవారికి స్ఫూర్తినిచ్చే విషయం ఇది' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది పారుల్ భరద్వాజ్.

పంజాబ్‌లోని ముకేరియన్ పట్టణానికి చెందిన పారుల్ రకరకాల హెలికాప్టర్‌లను నడపడంలో సత్తా చాటింది.

> అనుమానాలు, వాదోపవాదాల సంగతి ఎలా ఉన్నప్పటికీ... చినూక్‌ను నడపడం అనేది సవాలుతో కూడుకున్న పని. ఆ పనిని ఇష్టంగా స్వీకరించి సత్తా చాటడానికి సిద్ధం అయ్యారు పరుల్ భరద్వాజ్, స్వాతీ రాథోడ్‌లు. వీరికి అభినందనలు తెలియజేద్దాం.

తాజాగా... అధిక బరువు ఉన్న ఆయుధాలు, సరుకులను వేగంగా మోసుకెళ్లే మల్టీ–మిషన్ 'చినూక్' సారథ్య బాధ్యతను తొలిసారిగా ఇద్దరు మహిళలకు అప్పగించింది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్. వారు... పరుల్ భరద్వాజ్, స్వాతీ రాథోడ్. చండీగఢ్, అస్సాంలోని మోహన్‌బరీలో ఈ ఇద్దరు విధులు నిర్వహిస్తారు.

గత సంవత్సరం రిపబ్లిక్ డే పరేడ్‌లో 'ఫ్లై–పాస్ట్' లీడ్ చేసిన తొలి మహిళగా రికార్డ్ సృష్టించిన స్వాతి రాథోడ్ రాజస్థాన్‌లోని నగౌర్ జిల్లాలో జన్మించింది. పైలట్ కావాలనేది తన చిన్నప్పటి కల. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్‌లో చేరడం తనను మరోస్థాయికి తీసుకువెళ్లింది. 2014లో పైలట్ కావాలనే తన కోరికను నెరవేర్చుకుంది స్వాతి రాథోడ్.

'ఎం–17 నుంచి చినూక్‌లోకి అడుగుపెట్టడం ముందడుగుగా చెప్పుకోవాలి. వాయుసేనలో పనిచేస్తున్న మహిళలు తాము ఉన్నచోటే ఉండాలనుకోవడం లేదు. తమ ప్రతిభను నిరూపించుకొని ఉన్నతస్థాయికి చేరాలనుకుంటున్నారు. ఇది గొప్ప విషయం' అంటున్నారు ఎయిర్ మార్షల్ అనీల్ చోప్రా.

ఎంఐ–17వీ5తో పోల్చితే చినూక్ పనితీరు పూర్తిగా భిన్నం. దీనికితోడు కొన్ని భయాలు కూడా!

అమెరికాకు చెందిన ఏరో స్పేస్ కంపెనీ 'బోయింగ్' తయారుచేసిన చినూక్ భద్రతపై ఇటీవల కాలంలో రకరకాల సందేహాలు వెల్లువెత్తాయి. వీటి ఇంజన్‌లో మంటలు చెలరేగే ప్రమాదం ఉందనేది వాటిలో ఒకటి. అయితే దీన్ని 'బోయింగ్' సంస్థ ఖండించింది. ఎలాంటి సమస్యా ఉండదని స్పష్టం చేసింది.

అనుమానాలు, వాదోపవాదాల సంగతి ఎలా ఉన్నప్పటికీ... చినూక్‌ను నడపడం అనేది సవాలుతో కూడుకున్న పని. ఆ పనిని ఇష్టంగా స్వీకరించి సత్తా చాటడానికి సిద్ధం అయ్యారు పరుల్ భరద్వాజ్, స్వాతీ రాథోడ్‌లు. వీరికి అభినందనలు తెలియజేద్దాం.

ఇద్దరు మహిళల వల్ల దేశంలోకి చీతాలొచ్చాయి. ఇకపై మధ్యప్రదేశ్ అడవుల్లో అవి చూపులు రిక్కించి వాయువేగంతో వేటాడనున్నాయి. నమీబియా నుంచి చీతాలు భారత్‌లో అడుగు పెట్టడానికి ఇరు దేశాల మధ్య కోఆర్డినేటర్‌గా పని చేసిన డాక్టర్ లారీ మార్కర్ ఒక కారణం. అలాగే చీతాల సంరక్షణలో తర్ఫీదు పొంది మన దేశంలో ఏకైక 'చీతా లేడీ'గా గుర్తింపు పొందిన ప్రద్న్యా గిరాడ్కర్ కృషి మరో కారణం. చీతాల ప్రవేశ ప్రయోగం విజయవంతం అవుతుందని అంటోంది ప్రద్న్యా.


ప్రద్న్యా గిరాడ్కర్



న్యూస్ మేకర్

చీతా లేడీ

70 ఏళ్ల క్రితం నేటి చత్తీస్‌గఢ్‌లోని చివరి మూడు చీతాలను అక్కడి రాజు వేటాడి చంపడంతో మన దేశంలో చీతాలు అంతరించిపోయాయి. అప్పటి నుంచి వాటిని తిరిగి దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయి. దానివల్ల ఉపయోగం లేదని ఒక వర్గం, చీతాలు వృద్ధి చెందితే పర్యావరణానికి మేలు అని ఒక వర్గం వాదులాడుకున్నాయి. 'అంతరించిపోయిన చీతాలను తిరిగి దేశంలో ప్రవేశపెట్టడం ద్వారా అవి బతికి బట్టకడతాయనడానికి అధ్యయనాలు ఏమిటో చెప్పండి' అని సుప్రీంకోర్టు ఈ ప్రయత్నాన్ని ప్రశ్నించింది. అన్ని అడ్డంకులు ఇన్నాళ్లకు తీరి నమీబియా నుంచి విమానంలో ఎగిరొచ్చిన 8 చీతాలు మధ్యప్రదేశ్‌లోని కూనో అభయారణ్యంలో రెండు పాయింట్లలో విడుదలయ్యాయి. ఈ మొత్తం కార్యక్రమం వెనుక ఇద్దరు స్త్రీలు ఉన్నారు.

'మనుషుల చేతుల్లో చీతాలు అంతరించి పోయాయి. ఇవాళ మనుషులే వాటిని కాపాడాలి. ఎందుకంటే చీతాలు తాము నివసించే వాతావరణానికి అలవాటుపడటానికి ఐదు నుంచి పదేళ్లు తీసుకుంటాయి' అంటారు లారీ మార్కర్. అమెరికాకు చెందిన ఈ జువాలజిస్టు ప్రపంచంలోనే 'చీతా నిపుణురాలి'గా గుర్తింపు పొందారు. చీతాల సంరక్షణ కోసం 'చీతా కన్సర్వేషన్ ఫండ్' అనే సంస్థ స్థాపించి ఆఫ్రికన్ దేశాలలో వాటి సంరక్షణకు కృషి చేస్తున్నారు. గత 12 సంవత్సరాలుగా మన దేశంలో చీతాల ప్రవేశానికి సాగిన ప్రయత్నంలో నమీబియాకు, మన దేశానికి మధ్య సంధానకర్తగా పని చేశారు. 'రాబోయే సంవత్సరకాలంలోని దక్షిణాఫ్రికాలోని నమీబియా నుంచి మరిన్ని చీతాలు భారత్‌కు చేరుకుంటాయి' అని తెలిపారామె. 'నమీబియాలో గడ్డి మైదానాలు కూనో అభయారణ్యంలో పోదలకు దగ్గరగా ఉంటాయి. చీతాలు వేగంగా పరిగెత్తి వేటాడేంత విశాలత ఇక్కడ లేకపోవచ్చు. కాని అవి పొంచి ఉండి కూడా వేటాడతాయి. అది సమస్య కాదు. జనావాసాల వైపు వచ్చినప్పుడు వాటిని కాపాడే చైతన్యమే కావాల్సింది' అంటారు లారీ మార్కర్.

చీతా కూడా రాజే

'పులి అడవికి రాజైతే చీతా గడ్డిమైదానాలకు రాజు. చీతాను కాపాడాలంటే గడ్డి మైదానాలను కూడా కాపాడాలి. అలా కాపాడితే గడ్డి మైదానాలపై ఆధారపడే జంతువులన్నీ కాపాడబడతాయి. దాని వల్ల జీవ వైవిధ్యం కొనసాగుతుంది' అంటారు ప్రద్న్యా గిరాడ్కర్. ఈమె 'వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' అనే సంస్థను స్థాపించి వన్యప్రాణుల సంరక్షణలో శాస్త్రీయమైన విజ్ఞానాన్ని ప్రచారం చేస్తున్నారు. మన దేశంలో చీతాల పునఃప్రవేశాన్ని గట్టిగా సమర్థించిన పర్యావరణ నిపుణురాలు ఈమె.

'పులుల సంరక్షణ విధానాల గురించి నేను ముంబై యూనివర్సిటీలో పిహెచ్‌డి చేశాను. చీతాలు దేశానికి తేవాలి అనే వాదనకు నేను సమర్థింపు ఇచ్చాను. 2011లో నమీబియాలో చీతాల సంరక్షణ గురించి లారా పార్కర్ నిర్వహించిన శిక్షణా శిబిరానికి మన దేశం నుంచి నేను ఎంపికయ్యాను. నమీబియా వెళ్లి అక్కడి ఒట్జిఒరోన్గో అభయారణ్యంలోని 52 చీతాల సంరక్షణలో పాటించవలసిన విధానాలను తెలుసుకున్నాను. మనిషికీ మృగానికీ మధ్య ఉండే వైరం తెలిసింది. అలాగే మనిషి, మృగం కలిసి బతకక తప్పని స్థితిని కూడా తెలుసుకున్నాను' అంటారు ప్రద్న్యా గిరాడ్కర్.

చీతాలు మనదేశం రావడానికి కావలసిన మొత్తం ప్లాన్‌ను లారీ మార్కర్ తయారు చేస్తున్నప్పుడు ప్రద్న్యా ఆ పనిలో పాల్గొన్నారు. 'చీతాలకు తక్కువ స్వేచ్ఛ ఆ తర్వాత ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. వాటిని శాటిలైట్ కాలర్స్ ద్వారా గమనిస్తూ వస్తాం. మరీ అడవికి దూరంగా వెళ్లిపోయినప్పుడు వాటిని తిరిగి సురక్షిత ప్రాంతానికి చేర్చడం ముఖ్యం. నమీబియాలోని చీతాల ఆహారం మన కూనోలో దొరికే ఆహారానికి దగ్గరే. కూనో అభయారణ్యంలో లేళ్లు, దుప్పులు, కృష్ణ జింకలు దండిగా ఉన్నాయి. అవి చీతాలకు సరిపోతాయి' అంటారామె.


కూనో నేషనల్ పార్క్


చీతాలతో డాక్టర్ లారీ మార్కర్

'చీతాలు మన దేశంలో నిలదొక్కుకుంటే పులులకు సంబంధించిన ఆరు జాతులూ మన దగ్గర ఉన్నట్టవుతుంది. అంతేకాదు టూరిజం పెరుగుతుంది. ఇప్పుడు చేసిన ఖర్చు సులభంగా తిరిగి వస్తుంది. అయితే సవాళ్లు కూడా ఉంటాయి. మన దేశంలో గతంలో చీతాలు ఉన్నాయి కనుక ఆఫ్రికా చీతాలకు మన చీతాలకు జన్యుపరంగా చాలా తక్కువ వ్యత్యాసం ఉంది కనుక అవి ఇక్కడ మనుగడ సాధిస్తాయనే ఆశిస్తాను' అంటారామె.

ఒక ముఖ్యమైన వన్యప్రాణి సంరక్షణ ఘట్టంలో ఉన్న ఈ ఇద్దరు స్త్రీలు అభినందనీయులు.

సాగుబడి
ఉత్తర కార్తె : సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె : 27 నుంచి

- ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న మహిళా రైతు ఓబులమ్మ
- ఆరేళ్ల క్రితం కొద్ది విస్తీర్ణంతో ప్రారంభించి.. భర్త, కుమార్తె, అల్లుడు తోడ్పాటుతో పదెకరాలకు విస్తరణ
- నిమ్మ తోటలో అంతర పంటల సాగు.. తోట దగ్గరే వ్యాపారులకు విక్రయం
- కూరగాయలను స్వయంగా తానే ఇంటింటికీ వెళ్లి అమ్ముతున్న ఓబులమ్మ
- గతేడాది పదెకరాల్లో రూ. 6.99 లక్షల నికరాదాయం
- ప్రతిష్టాత్మక 'జైవిక్ ఇండియా' జాతీయ ఉత్తమ రైతు పురస్కారాన్ని గెల్చుకున్న ఓబులమ్మ
- ఈనెల 23న ఆగ్రాలో అవార్డును అందుకోనున్న మహిళా రైతు

ఓబులమ్మ ప్రకృతి సేద్యానికి 'జై'!

తలకు మించిన భారంగా, నష్టదాయకంగా మారిన రసాయనిక వ్యవసాయంతో విసిగి వేసారి ఆరేళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం చేపట్టిన మహిళా రైతు కుటుంబం రైతు లోకానికే ఆదర్శంగా నిలిచింది. అంతే కాదు, జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన జైవిక్ ఇండియా జాతీయ ఉత్తమ రైతు పురస్కారాన్ని గెల్చుకోవటం విశేషం.

వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం టి. కొత్తపల్లెకు చెందిన బండి ఓబులమ్మ, తిరుమలయ్య దంపతులు 2016 నుంచి కొద్ది విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించి.. తదనంతరం పదెకరాలకు ప్రకృతి సేద్యాన్ని విస్తరించారు. నిమ్మ తోటలో అంతర పంటలు సాగు చేస్తున్నారు. దేశీ వరిని సాగు చేస్తున్నారు. కొంత విస్తీర్ణంలో ఏడాది పొడవునా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ.. స్వయంగా నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ నిరంతర ఆదాయం గడిస్తున్నారు.

రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పూర్తిగా నిలిపివేశారు. మూడు ఆవులను కొనుగోలు చేసి, పేడ, మూత్రంతో ఘనజీవామృతం, జీవామృతం స్వయంగా తయారు చేసి వాడుతున్నారు. అవసరం మేరకు కషాయాలు వాడి పంటలు పండిస్తున్నారు. తొలుత యూట్యూబ్‌లో ప్రకృతి సేద్యపు విజయగాథలు చూసి స్ఫూర్తి పొంది శ్రీకారం చుట్టారు. తదనంతరం గ్రామ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఏపీ ప్రభుత్వ ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తూ.. పర్యావరణానికి, ప్రజలకు ఆరోగ్యదాయకమైన సేద్య రీతిలో తిరుగులేని పట్టు సంపాదించారు. అంతే కాదు, సొంతంగా ప్రజలకు అమ్ముకోవటంలోనూ విజయం సాధించారు.

కలిసొచ్చిన నోటి ప్రచారం

పండించిన కూరగాయలు, ఆకుకూరలను తాము తినటంతో పాటు ఓబులమ్మ స్వయంగా ఇంటింటికీ వెళ్లి అమ్ముతుండటం విశేషం. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆరోగ్యదాయక ఉత్పత్తుల విశిష్టత గురించి గ్రామాల్లో ఆయమ్మకు ఈయమ్మకు చెప్పడం మొదలు పెట్టారు. వీటిని తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలియజెప్తూ అమ్మేవారు. ఈ విషయం ఆ నోట ఈ నోట తామర తంపరగా పాకిపోయింది.

వారి గ్రామానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే మైదుకూరు పట్టణంలోని కూరగాయల వ్యాపారులకూ ఈ విషయం తెలిసింది. వారి నుంచి కడప, పొద్దుటూరులో కూరగాయల వ్యాపారులకు కూడా తెలిసింది. వారు నేరుగా ఓబులమ్మ తోట దగ్గరకు వచ్చి కూరగాయలు కొనుక్కెళ్లటం అలవాటైంది. దీంతో ఓబులమ్మ పండించే ప్రకృతి వ్యవసాయ పంట దిగుబడులకు మార్కెటింగ్ సమస్యతో పాటు రవాణా ఖర్చు కూడా మిగిలింది. ఖర్చు తగ్గడంతో మంచి రాబడి ప్రారంభమైంది.

దీంతో ఓబులమ్మ తన భర్త తిరుమలయ్యతో కలిసి క్రమంగా ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచుతూ వచ్చారు. 2018 నుంచి తమకున్న మొత్తం 10 ఎకరాల్లోనూ ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. అల్లుడు శివరామయ్య, కుమార్తె ఆదిలక్ష్మిల సహకారంతో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ దిగ్విజయంగా ఓబులమ్మ, తిరుమలయ్య దంపతులు ప్రకృతి వ్యవసాయంలో ముందడుగు వేస్తున్నారు.


ప్రకృతి సేద్య పద్ధతిలో సాగవుతున్న నిమ్మ తోట


స్వయంగా కూరగాయలు అమ్ముతున్న ఓబులమ్మ


నిమ్మ తోటలో అంతర పంటగా సాగు చేసిన ఉల్లిలో కూలీలతో కలిసి కలుపు తీస్తున్న ఓబులమ్మ



మా కష్టాన్ని గుర్తించినందుకు చాలా సంతోషంగా ఉంది

ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టినప్పటి నుంచి సాగు ఖర్చు భారీగా తగ్గింది. నా భర్త తిరుమలయ్యతోపాటు అల్లుడు శివరామయ్య, కుమార్తె ఆదిలక్ష్మితో కలిసి వివిధ పంటలను సాగు చేస్తున్నాను. పురుగు మందులకు బదులు నీమాస్త్రం, దశపర్ణి కషాయం, వేపనూనె, కానుగ నూనెలను వాడతాం. ఎరువులకు బదులుగా జీవామృతం, ఘనజీవామృతం వేసుకుంటాం. వీటిని మేమే తయారు చేసుకుంటాం. పంటల సాగుకు ముందు నవధాన్యాలను విత్తి, ఎదిగిన తర్వాత పొలంలో కలియదున్నుతాం. తర్వాత వేసే పంటలకు అది సత్తువగా పనికొస్తుంది. పండ్లను వ్యాపారులే వచ్చి కొనుక్కుంటున్నారు. కూరగాయలను ఇంటింటికీ తీసుకెళ్లి అమ్ముతున్నా. మా కష్టాన్ని గుర్తించిన ప్రకృతి వ్యవసాయ అధికారులు అవార్డుకు దరఖాస్తు చేయించారు. జైవిక్ ఇండియా అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది.

– బండి ఓబులమ్మ, ప్రకృతి వ్యవసాయదారు, టి. కొత్తపల్లె, మైదుకూరు మం., వైఎస్సార్ జిల్లా

నిమ్మ తోటలో అంతర పంటలు

మొదల్లో 2 ఎకరాల్లో నిమ్మ మొక్కలు నాటి.. అంతర పంటలుగా వంగ, మిరప, అరటి, బొప్పాయి వంటి తదితర పంటలను సాగు చేశారు. నిమ్మ, అరటి, బొప్పాయి పండ్లను పొలం వద్దనే వ్యాపారులకు అమ్మేవారు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలను మాత్రం ఆలవాటు కొద్దీ ఉదయాన్నే గ్రామాగ్రామానికి తిరిగి అమ్మడం నేటికీ కొనసాగిస్తున్నారు ఓబులమ్మ. 2020లో మరో 6 ఎకరాల్లో నిమ్మ మొక్కలు నాటారు. ఈ ఆరు ఎకరాల్లో కూడా అంతర్ పంటగా ప్రతి 50 సెంట్లలో టమోటా, మిరప, వంగ, గోంగూర, పాలకూర, చుక్కాకు వంటివి సాగు చేశారు. పండ్లు, కూరగాయలను పొలం వద్దే కొనుగోలు చేసుకొని తీసుకు వెళ్తుండటంతో ఓబులమ్మకు మార్కెటింగ్ సమస్య లేకుండా పోయింది.

అధిక ధరకే అమ్మకాలు

గతేడాది 10 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా రూ. 6.99 లక్షల నికరాదాయం వచ్చిందని ఓబులమ్మ తెలిపారు. రూ. 4.8 లక్షలు ఖర్చవ్వగా వివిధ పంటల అమ్మకం ద్వారా రూ. 11,79 లక్షల ఆదాయం వచ్చింది. 3 ఎకరాల్లో నువ్వులు, 2 ఎకరాల్లో కొర్రలు, 2 ఎకరాల్లో మైసూరు మల్లిక, బహురూపి దేశీ వరిని ఓబులమ్మ సాగు చేశారు. మిగతా 3 ఎకరాల్లో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేశారు. నువ్వుల ద్వారా రూ. లక్ష, నిమ్మకాయల ద్వారా రూ.4.70 లక్షలు, మైసూరు మల్లిక, బహురూపి బియ్యం ద్వారా 1.13 లక్షలు, కొర్ర ధాన్యం ద్వారా రూ. 56 వేలు, మిర్చి ద్వారా రూ. 2.78 లక్షలు, టమాటోలు తదితర కూరగాయల ద్వారా రూ. 1.62 లక్షల ఆదాయం వచ్చింది. కూరగాయలు, ఆకుకూరల అమ్మకం ద్వారా ప్రతి రోజూ కొంత రాబడి వస్తున్నది.

మార్కెట్‌లో సాధారణ కూరగాయల చిల్లర కన్నా కిలోకు 2–3 రూపాయల అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఓబులమ్మ వివరించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో నిమ్మ తోటలో అంతరపంటలుగా 2 ఎకరాల్లో ఉల్లి, 1.5 ఎకరాల్లో కొత్తిమీర, 50 సెంట్లలో వరి పంటలను సాగు చేస్తున్నారు. ఇతర వివరాలకు ఓబులమ్మ అల్లుడు శివరామయ్య (98485 58193)ను సంప్రదించవచ్చు.

– గోసుల ఎల్లారెడ్డి, సాక్షి, కడప అగ్రికల్చర్

కాసుల పంట డ్రాగన్!

- రెడ్ రకం డ్రాగన్ దిగుబడి బాగుందంటున్న అనంత రైతు
- ఎకరానికి రెండో ఏడాదే 11 టన్నుల దిగుబడి
- మొక్కలద్వారా అదనపు ఆదాయం


డ్రాగన్ పండ్ల తోటలో లక్ష్మీదేవి

ఆరోగ్యదాయినిగా పేరుగాంచిన డ్రాగన్ ఫ్రూట్ రైతులకు కాసుల పంట పండిస్తోంది. ఉద్యాన పంటలకు నెలవైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు లాభదాయకంగా సాగు చేస్తున్న పండ్ల రకాల జాబితాలో తాజాగా డ్రాగన్ ఫ్రూట్ చేరింది. సేంద్రియ పద్ధతుల్లో డ్రాగన్ సాగు చేస్తూ నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు మంచి లాభాలు కళ్లజూస్తున్నారు. ఈ కోవకు చెందిన వారే కేవీ రమణారెడ్డి. అనంతపురం శివారు సిండికేట్‌నగర్‌కు చెందిన రమణారెడ్డి గార్లదిన్నె మండలం మర్తాడులో 3 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు మరో 6 ఎకరాల్లో ఖర్జూరం సాగు చేస్తున్నారు. పదో తరగతి వరకు చదువుకున్న రమణారెడ్డి రెండేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టి, రెండో ఏడాదే మంచి దిగుబడులు సాధించారు.

రెండేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ రెడ్ రకం 6 వేల మొక్కలను తెప్పించిన రమణారెడ్డి మూడు ఎకరాల్లో నాటారు. చెట్ల మధ్య 8 అడుగులు, సాళ్ల మధ్య 10 అడుగులు దూరంలో సిమెంటు స్థంభాలు నాటి... స్థంభానికి నాలుగు మొక్కలు నాటారు. గుంత తీసి అందులో వేపపిండి, వర్మీకంపోస్టు, పశువుల ఎరువు వేసి.. ఎకరాకు 500 సిమెంటు స్థంభాల చుట్టూ 2 వేల మొక్కలు నాటారు. స్థంభం పైభాగం లోకి మొక్కలకు ఆలంబనగా పాత టైరును అమర్చారు.

మొత్తమ్మీద పంటకు తొలిఏడాది మొక్కల ఖర్చు, సిమెంటు పోలు, రింగు తదితర వాటిని పరిగణలోకి తీసుకుంటే ఎకరాకు రూ.8 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. తర్వాత నుంచి ప్రతి ఏటా రూ.50 వేలకు కాస్త అటుఇటుగా ఖర్చవుతుంది. నీళ్ల పెద్దగా అవసరం లేదు. డ్రిప్ ద్వారా 15 రోజులకో తడి ఇస్తున్నాను. వర్షాకాలంలో అవసరం లేదు. ఎకరాకు ఏటా 10 నుంచి 12 టన్నుల వరకు డ్రాగన్ పండ్ల దిగుబడి వస్తుందని అంటున్నారు రమణారెడ్డి. వేపనూనె పిచికారీ చేస్తే ఎర్రచీమల సమస్య అదుపులోకి వచ్చిందని రమణారెడ్డి వివరించారు. ఏడాదికి రెండు సార్లు ఐదు ట్రాక్టర్లు పశువులు ఎరువు వేశారు. కొంత కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు వాడాను.

పండ్ల కోతకు కూలీల అవసరం తక్కువే. తాను, తన భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు ముగ్గురు కూలీలతో సరిపోతోందన్నారు.


అంట్లు కట్టి, మొక్కల అమ్మకం మొదలు పెట్టారు. ఒక కటింగ్‌ను రూ.70కి, రెండు నెలలు పెంచిన మొక్కను రూ.100కి అమ్ముతున్నానని రమణారెడ్డి చెబుతున్నారు. ఇపుడున్న పరిస్థితుల్లో డ్రాగన్ మించిన ఆదాయాన్నిచ్చే పంట మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు.

– గంగుల రామలింగారెడ్డి, సాక్షి, అనంతపురం అగ్రికల్చర్
ఫోటోలు: బి.మహబూబ్‌బాషా

రెండో ఏడాదే అధికాదాయం

డ్రాగన్ ఫ్రూట్ పంట ద్వారా రెండో ఏడాది ఊహించిన దాని కన్నా అధిక దిగుబడి వచ్చింది. మూడు ఎకరాల్లో ఇప్పటికే 18 టన్నుల పండ్లు అమ్మాను. చెన్నై, బెంగళూరు వ్యాపారులతోపాటు స్థానిక వ్యాపారులు కూడా తీసుకెళుతున్నారు. పండు సైజును బట్టి టన్ను రూ.1.35 లక్షల నుంచి రూ.1.65 లక్షల వరకు పలికింది. కాపు బాగున్నందున ఇంకా రూ.15 టన్నులకు పైగా దిగుబడి రావచ్చు. ఈ లెక్కన రూ.50 లక్షలకు పైగా రావచ్చనుకుంటున్నా. నాటిన రెండో ఏడాది నుంచే రెమ్మలు కత్తిరించి అమ్ముతున్నా. ఇప్పటికి రూ.24 లక్షల విలువ చేసే మొక్కలు అమ్మాను.

– కేవీ రమణారెడ్డి, డ్రాగన్ ఫ్రూట్ రైతు (93469 25502, 94908 56363), మర్తాడు, గార్లదిన్నె మం., అనంతపురం జిల్లా



రెడ్ వెరైటీ.. ఎండను తట్టుకుంటుంది..

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అనంతపురం జిల్లా నేలలు, వాతావరణం అనుకూలమే. ఇప్పటికి 20 మందికి పైగా రైతులు 70–80 ఎకరాల్లో డ్రాగన్ సాగు చేపట్టారు. మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ అయినా ముమ్ముందు లాభదాయకంగా ఉంటుంది. ఒక్కసారి నాటుకుంటే గరిష్టంగా 25–30 ఏళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. డిసెంబర్–మే మధ్య కాలంలో ప్రూనింగ్, పోషకాల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలు చేపడితే ఇబ్బంది ఉండదు. మొక్కల ఎంపికలో కొంత జాగ్రత్త తీసుకోవాలి. మర్తాడు రైతు రమణారెడ్డి సాగు చేసిన రెడ్ వెరైటీ డ్రాగన్ పండ్లు సైజు పరంగా, దిగుబడి పరంగా మంచిదే. ఎండకు తట్టుకుంటుంది.

– డా. బి.విమల (94938 31009), ఉద్యాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, రేకులకుంట, అనంతపురం జిల్లా



భారత నంబర్‌వన్‌గా కర్మన్ కౌర్

ఐదేళ్ల తర్వాత భారత మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో నంబర్‌వన్‌గా కొత్త క్రీడాకారిణి వచ్చింది. 2017 నుంచి భారత టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతున్న అంకితా రైనా సోమవారం విడుదల చేసిన సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయింది. చెన్నై ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన కర్మన్ కౌర్ భారత కొత్త నంబర్‌వన్‌గా అవతరించింది. కర్మన్ 37 స్థానాలు ఎగబాకి 322వ ర్యాంక్‌కు చేరగా... చెన్నై ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిన అంకిత నాలుగు స్థానాలు పడిపోయి 329వ ర్యాంక్‌లో నిలిచింది.

ఆధిక్యంలో అర్జున్

జూలియస్ బేర్ జనరేషన్ కప్ ఆన్‌లైన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో ఐదు రౌండ్‌లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 12 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. 16 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఆధిబన్ (భారత్), లియెమ్ (వియత్నాం), నవారా (చెక్ రిపబ్లిక్), నీమన్ (అమెరికా)లపై అర్జున్ గెలిచి, కార్ల్‌సన్ (నార్వే) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీలో విజయానికి 3 పాయింట్లు, 'డ్రా' అయితే ఒక పాయింట్ కేటాయిస్తారు.



గవర్నర్ గారి అత్యుత్సాహం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ గణేశన్ అయ్యర్ ఫొటో మోజుతో దిగ్గజ ఆటగాడితో వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శల పాలయ్యింది. ఆదివారం డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ టైటిల్ పోరు జరిగింది. భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి సారథ్యం వహించిన బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ విజేతగా నిలిచింది. ఫైనల్లో సునీల్ ఛెత్రి బృందం 2–1తో ముంబై సిటీ ఎఫ్‌సీపై నెగ్గింది. సాల్ట్‌లేక్ స్టేడియంలో అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో 'కప్'ను కెప్టెన్ ఛెత్రికి అందజేసేందుకు స్టేజీ ఎక్కిన గవర్నర్ గణేశన్ తను ఫొటోలో ప్రముఖంగా కనబడటం లేదన్న కారణంతో ఛెత్రి భుజంపై చేయి వేసి పక్కకు జరగమన్నారు. దీనిపై సోషల్ మీడియాలో గవర్నర్ వ్యవహారశైలిని అందరూ తప్పుబడుతూ ట్వీట్లు, పోస్ట్‌లు పెడుతున్నారు. ఓ దిగ్గజ ఆటగాడు, విజేత కెప్టెన్‌ను కాదని ప్రదానం చేసే వాళ్లే ప్రముఖంగా కనిపించే పిచ్చి ఏంటని విమర్శిస్తున్నారు.

జాన్సన్ గదిలో పాము



లక్నో: ఆస్ట్రేలియా క్రికెటర్ మిచెల్ జాన్సన్ బస చేసిన హోటల్ గదిలో పాము కలకలం రేపింది. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయిన ఈ లెఫ్టార్మ్ సీమర్ వెటరన్ టి20 లీగ్ ఆడేందుకు ఇక్కడికి వచ్చాడు. అయితే తన గదిలోకి వచ్చిన పాము ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన జాన్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'దయచేసి ఎవరైనా ఇది ఏ రకమైన పామో చెప్పండి. ఇది నా గది తలుపుపై వేలాడుతోంది. నా దగ్గర పామువి మంచి ఫొటోలే ఉన్నాయి. లక్నోలో ఇలాంటి అనుభవం ఎదుర్కోవడం వింతగా ఉంది' అని పోస్ట్ చేశాడు. జాక్వస్ కలిస్ (దక్షిణాఫ్రికా) సారథ్యంలోని ఇండియా క్యాపిటల్స్ తరఫున గుజరాత్ జెయింట్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో జాన్సన్ బరిలోకి దిగాడు. అంతర్జాతీయ కెరీర్‌లో జాన్సన్ టెస్టుల్లో 313 వికెట్లు, వన్డేల్లో 239 వికెట్లను పడగొట్టాడు. 2015లో ఆటకు గుడ్‌బై చెప్పాడు.

సమరానికి సై

- టి20 సిరీస్‌లో ఆస్ట్రేలియాతో భారత్ పోరు
- ఇరు జట్ల మధ్య నేడు తొలి మ్యాచ్
- రాత్రి గం 7:00 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

గత టి20 ప్రపంచకప్‌కు భారత జట్టు చాలా పటిష్టంగా కనిపించింది. వరుసగా రెండు సీజన్లు ఐపీఎల్ ఆడిన వేదికపై సత్తా చాటడం ఖాయమనిపించింది. అయితే అనూహ్యంగా కనీసం సెమీస్ కూడా చేరలేకపోయింది. నాటి వైఫల్యానికి కారణమైన లోపాలను సరిదిద్దుకుంటూ టీమిండియా ఆ తర్వాతి నుంచి ఆట తీరును మార్చుకుంది. ఇప్పుడు సంవత్సరం తిరిగేలోగా మరో టి20 ప్రపంచకప్‌పై దృష్టి పెట్టింది. ఆ మెగా ఈవెంట్‌కు ముందు సరిగ్గా ఆరు మ్యాచ్‌లతో రోహిత్ సేన సన్నద్ధం కానుంది. పిచ్‌లు, పరిస్థితులు భిన్నంగా ఉండబోతున్నా ఆత్మవిశ్వాసంతో ఆసీస్ విమానమెక్కేందుకు మిగిలిన మ్యాచ్‌లలోనే కూర్పును పరీక్షించేందుకు లభించిన అవకాశమిది.

మొహాలి: ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చే జట్టుతో సొంతగడ్డపై భారత్ సమరానికి సై అంటోంది. ఆస్ట్రేలియాతో జరిగే మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు తొలి మ్యాచ్ జరగనుంది. ఈ సిరీస్ ముగిసిన వెంటనే దక్షిణాఫ్రికాతో కూడా భారత్ మూడు టి20లు ఆడనుంది. వరల్డ్‌కప్‌కు టీమ్‌ను ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఆటగాళ్లందరినీ ఈ ఆరు మ్యాచ్‌ల్లోనూ ఆడించి టీమ్ మేనేజ్‌మెంట్ ఒక అంచనాకు రానుంది. ముఖ్యంగా ఆసియా కప్‌లో టీమ్‌ను ఇబ్బంది పెట్టిన మిడిలార్డర్‌ను సరిదిద్దుకోవడం భారత్‌కు కీలకంగా మారింది. అటు ఆస్ట్రేలియా కూడా ఎక్కువ మంది యువ ఆటగాళ్లకు అవకాశం ఇస్తుండటంతో సిరీస్ ఆసక్తికరంగా సాగనుంది.

మూడో పేసర్‌ను ఆడిస్తారా...

ఆసియా కప్‌తో పోలిస్తే భారత జట్టులో రెండు కీలక మార్పులు ఖాయం. టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తుది జట్టులోకి రానుండగా, కొంత కాలంగా ఆటకు దూరమైన హర్షల్ పటేల్‌ను కూడా పరీక్షించడం అవసరం. అలాంటప్పుడు మరో రెగ్యులర్ బౌలర్ భువనేశ్వర్‌ను ఆడిస్తారా లేదా అనేది చూడాలి. భువీకి ఎలాగూ అనుభవం ఉంది కాబట్టి వైవిధ్యం కోసం అర్ష్‌దీప్‌ను కూడా ప్రయత్నించవచ్చు. హార్దిక్ పాండ్యా మూడో పేసర్ పాత్రకు సరిపోడనేది ఆసియా కప్ నేర్పిన పాఠాల్లో ఒకటి. కాబట్టి అతడి బౌలింగ్‌ను కాకుండా రెగ్యులర్ బౌలర్‌ను నమ్ముకోక తప్పదు. ప్రధాన స్పిన్నర్‌గా చహల్‌కు చోటు ఖాయం. రెండో స్పిన్నర్‌గా అక్షర్, అశ్విన్‌లలో ఒకరికే అవకాశం దక్కుతుంది. ఈ సిరీస్‌తో పాటు వరల్డ్‌కప్ టీమ్‌లో ఉన్నా, దీపక్ హుడాకు తుది జట్టులో చోటు దక్కుతుందా చెప్పలేని పరిస్థితి. టాప్–3గా రోహిత్, రాహుల్, కోహ్లి ఖాయం కాబట్టి తర్వాతి ముగ్గురు బ్యాటర్లు మరింత బాధ్యతగా ఆడటం అవసరం. సూర్యకుమార్, పంత్, హార్దిక్ సమష్టిగా విఫలం కావడంతోనే ఆసియా కప్‌లో భారత్ ఫైనల్ చేరలేకపోయింది. హార్దిక్‌ను పూర్తి స్థాయి బ్యాటర్‌గానే చూస్తూ ఐదుగురు బౌలర్లతో ఆడితే దినేశ్ కార్తీక్‌కు స్థానం లభించడం కష్టం.



రోహిత్ శర్మ



ఆరోన్ ఫించ్

ఫించ్‌పై తీవ్ర ఒత్తిడి...

స్వదేశంలో వరల్డ్‌కప్‌కు ముందు మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత్‌కు వచ్చి మ్యాచ్‌లు ఆడటంపై ఆస్ట్రేలియా కూడా అంత ఆసక్తిగా ఉన్నట్లు లేదు. సిరీస్‌కు ముందే విశ్రాంతి అంటూ డేవిడ్ వార్నర్ తప్పుకోగా, మరో ముగ్గురు కీలక ఆటగాళ్లు స్టార్క్, స్టొయినిస్, మిచెల్ మార్ష్ కూడా దూరమయ్యారు. ఇలాంటి స్థితిలో కెప్టెన్ ఆరోన్ ఫించ్ కచ్చితంగా రాణించాలి. పేలవ ఫామ్‌తో వన్డేల నుంచి రిటైర్ అయిన అతను టి20ల్లోనైనా సత్తా చాటితే జట్టుకు మేలు జరుగుతుంది. ఫించ్‌తో కలిసి వేడ్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. స్మిత్ మూడో స్థానంలో ఆడతాడని ఇప్పటికే ఆసీస్ ప్రకటించగా, మ్యాక్స్‌వెల్ తనదైన దూకుడును జోడించగలడు. ఈ సిరీస్ ఒక యువ ఆటగాడికి ఎంతో కీలకం కానుంది. అతనే టిమ్ డేవిడ్. ఇంత కాలం సింగపూర్‌కు ప్రాతినిధ్యం వహించి తొలిసారి ఆసీస్ జట్టులోకి ఎంపికైన అతను ఐపీఎల్ అనుభవంతో ఎంత దూకుడుగా ఆడతాడో చూడాలి. కమిన్స్, హాజల్‌వుడ్, కేన్ రిచర్డ్సన్ పేస్ భారం మోయనుండగా, లెగ్‌స్పిన్నర్ జంపాకు మంచి రికార్డే ఉంది.

23 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు 23 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 13 మ్యాచ్‌ల్లో భారత్, 9 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలిచాయి. మరో మ్యాచ్ వర్షంవల్ల రద్దయింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఏడు మ్యాచ్‌లు ఆడిన భారత్ నాలుగింటిలో గెలిచి, మూడింటిలో ఓడిపోయింది.

17 ఏళ్ల తర్వాత పాకిస్తాన్‌లో ఇంగ్లండ్

నేటి నుంచి 7 మ్యాచ్‌ల టి20 సిరీస్



కరాచీ: ప్రపంచకప్ దృష్ట్యా అన్నీ జట్లు టి20లు ఆడేందుకు తెగ సిద్ధమవుతున్నాయి. ఎన్నాళ్ల నుంచో అసలు పాక్ గడపే తొక్కని ఇంగ్లండ్ కూడా పొట్టి ఫార్మాట్‌లో పెద్ద ముఖాముఖీ టోర్నీ ఆడేందుకు వచ్చింది. చివరిసారిగా 2005లో పాక్‌లో పర్యటించిన ఇంగ్లండ్ 17 ఏళ్ల తర్వాత ఏడు మ్యాచ్‌ల టి20ల సిరీస్ ఆడేందుకు ఇక్కడ అడుగు పెట్టింది. మంగళవారం ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుంది. రెగ్యులర్ సారథి జోస్ బట్లర్ కండరాల గాయంతో ఇబ్బంది పడుతుండగా, మొయిన్ అలీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. 20, 22, 23, 25 తేదీల్లో కరాచీలో నాలుగు మ్యాచ్‌లు... 28, 30, అక్టోబర్ 2 తేదీల్లో లాహోర్ వేదికగా మూడు టి20లు జరగనున్నాయి. బట్లర్ ఆఖరి దశ మ్యాచ్‌ల్లో ఒకట్రెండు ఆడే అవకాశముందని జట్టు వర్గాలు తెలిపాయి.

భారత్‌కు పతకాల పంట



న్యూఢిల్లీ: గోల్డెన్ గ్లవ్ అంతర్జాతీయ యూత్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్లు అదరగొట్టారు. పది స్వర్ణ పతకాలతో కలిపి మొత్తం 19 పతకాలతో తమ పంచ్ పవర్‌ను చాటుకున్నారు. భావన శర్మ (48 కేజీలు), దేవిక ఘోర్పడే (52 కేజీలు), కుంజరాణి దేవి (60 కేజీలు), రవీనా (63 కేజీలు), కీర్తి (ప్లస్ 81 కేజీలు), విశ్వనాథ్ (48 కేజీలు), ఆశిష్ (54 కేజీలు), సాహిల్ (71 కేజీలు), జాదుమణి (51 కేజీలు), భరత్ జూన్ (92 కేజీలు) పసిడి పతకాలు సాధించారు. ముస్కాన్ (75 కేజీలు), ప్రాంజల్ యాదవ్ (81 కేజీలు) రజత పతకాలు నెగ్గారు. కశిష్ (50 కేజీలు), నీరూ (54 కేజీలు), ఆర్య (57 కేజీలు), ప్రియాంక (66 కేజీలు), లాషు (70 కేజీలు), నిఖిల్ (57 కేజీలు), దీపక్ (75 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు.

అమెరికా గోల్ఫ్‌లో తెలుగు కెరటం

పీజీఏ టూర్‌లో రాణిస్తున్న తీగల సాహిత్ రెడ్డి

నపా (అమెరికా): అమెరికాకు చెందిన తెలుగు గోల్ఫర్ తీగల సాహిత్ రెడ్డి ఫార్టినెట్ వరల్డ్ ర్యాంకింగ్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో మెరిశాడు. 73 మంది పాల్గొన్న ఈ టోర్నీలో అతను 11 పాయింట్ల స్కోరుతో సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాడు. టాప్–10లో నిలిచిన సాహిత్‌కు 2 లక్షల 70 వేల డాలర్లు (రూ.2 కోట్ల 15 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. రికీ ఫౌలెర్, నిక్ టేలర్‌లు కూడా 11 స్కోరు చేయడంతో ముగ్గురు ఆరో స్థానాన్ని పంచుకున్నారు. 24 ఏళ్ల ఈ తెలుగు గోల్ఫర్ తాజా ప్రదర్శనతో ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ (పీజీఏ) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడు స్థానాలు ఎగబాకి 51వ స్థానానికి చేరుకున్నాడు.

ఎవరీ తీగల సాహిత్?

సాహిత్ రెడ్డి జన్మతః అమెరికన్ అయినప్పటికీ భారతీయుడు. హైదరాబాద్‌కు చెందిన తీగల మురళీధర్ రెడ్డి ఉన్నత విద్యాభ్యాసం కోసం 1987లో అమెరికాకు వెళ్లారు. ఉన్నత విద్య పూర్తయ్యాక తెలుగమ్మాయి కరుణను వివాహమాడి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. వీరికి సాహిత్‌తో పాటు మరో కుమారుడు సహన్ రెడ్డి ఉన్నాడు. ఇప్పటికీ అతని కుటుంబం ప్రతీ రెండేళ్లకోసారి హైదరాబాద్‌కు వచ్చి వెళుతుంది. 2001లో సాహిత్ తల్లి థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడటంతో ఇద్దరి పిల్లల బాగోగులు అమ్మమ్మ విజయలక్ష్మి చూసుకునేది. చిన్నప్పటి నుంచి సాహిత్‌కు గోల్ఫ్ అంటే సరదా. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆటను ఆపలేదు. దీని ఫలితం ఇప్పుడు ప్రొఫెషనల్ అయ్యేందుకు దోహదపడింది. 2020లో ప్రొఫెషనల్ గోల్ఫర్‌గా మారిన సాహిత్ ఈ రెండున్నరేళ్లలోనే సంచలన ప్రదర్శనతో అది కూడా అసాధారణ పోటీ ఉండే అమెరికాలో ఈ స్థాయికి దూసుకురావడం గొప్ప ఘనత. 6 అడుగుల 3 అంగుళాల ఎత్తు, 90 కేజీల బరువున్న సాహిత్ 2021–22 సీజన్‌లో జోరు పెంచాడు. మొత్తం నాలుగు టోర్నీల్లో టాప్–10లో నిలిచాడు. దీంతో ఈ సీజన్‌లోనే సాహిత్ 17 లక్షల డాలర్లు (రూ.13 కోట్ల 54 లక్షలు) ప్రైజ్‌మనీ రూపేణా సంపాదించడం గమనార్హం. ప్రొఫెషనల్



గోల్ఫ్ అసోసియేషన్ టోర్నీల్లో భారత ఆటగాళ్లు చాలా మందే ఆడుతున్నారు కానీ ఓ హైదరాబాదీ ఈ స్థాయిలో రాణిస్తుండటం విశేషం.

సినిమా

భారీ బడ్జెట్‌తో పౌరాణిక చిత్రాలు

రామాయణం, మహాభారతం.. ఇలా మన పురాణాల ఆధారంగా ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చాయి. నాటితరం నటీనటులు చేసిన సినిమాలను ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు నేటి తరం వంతు. పురాణాల ఆధారంగా పాన్ ఇండియా సినిమాలు వెండితెరపై ఆవిష్కృతం కానున్నాయి. ఆ 'పాన్ పురాణం' విశేషాలు తెలుసుకుందాం.



ప్రభాస్, కృతీ సనన్



సమంత

వెండితెరపై ప్రభాస్ కటౌట్ ఉందంటే ఆడియన్స్ థియేటర్స్‌కు వచ్చేస్తారు. పాన్ ఇండియా స్టార్‌గా పాపులర్ అయిన ప్రభాస్ లేటెస్ట్‌గా 'ఆదిపురుష్' అనే మైథలాజికల్ ఫిల్మ్ చేశారు. ఈ చిత్రంలో రాముడు పాత్రలో ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జనవరి 12న రిలీజ్ కానుంది.

మరోవైపు సమంత నటించిన తొలి మైథలాజికల్ మూవీ 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ ప్రేమకావ్యంలో శకుంతల పాత్రలో సమంత, దుష్యంతుడి పాత్రలో మలయాళ నటుడు దేవ్ మోహన్ నటించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఇక గుణశేఖర్ దర్శకత్వంలోనే రానున్న మరో మైథలాజికల్ ఫిల్మ్ 'హిరణ్య కశ్యప'. ఇందులో టైటిల్ రోల్‌లో రానా నటిస్తారు. మరోవైపు మహాభారతం ఆధారంగా సినిమా చేయాలన్నది తన డ్రీమ్ అని రాజమౌళి పలు సందర్భాల్లో చెప్పారు. సో...



రానా

మహాభారతం ఆధారంగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ మల్టీస్టారర్ వచ్చే అవకాశం ఉంది. ఇక బాలీవుడ్ నిర్మాతలు మధు మంతెన, నమిత్ మల్హోత్రాలతో కలిసి టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ రామాయణం ఆధారంగా ఓ మూవీ ప్లాన్ చేశారు. అలాగే వ్యాపారవేత్త బీఆర్ శెట్టి దాదాపు వెయ్యి కోట్ల బడ్జెట్‌తో మహాభారతం ఆధారంగా సినిమా తీయాలనుకుంటున్నారు. అలాగే మలయాళ ఫిల్మ్ మేకర్ ఆర్.ఎస్ విమల్ 'సూర్యపుత్ర మహావీర్ కర్ణ'ను ప్రకటించారు. ఈ సినిమా టైటిల్ రోల్‌లో విక్రమ్ నటిస్తారనే ప్రచారం జరుగుతోంది.



విక్రమ్

మరికొన్ని

ఇప్పటివరకు మనం త్రీడీ వెర్షన్‌లో సినిమాలు చూశాం. ఇప్పుడు 5డీ వెర్షన్‌లో మహాభారతం ఆధారంగా సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. దాదాపు 700కోట్ల బడ్జెట్‌తో ఫిరోజ్ నడియాడ్‌వాలా ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారని టాక్. ఇక 'మహాభారతం' ఆధారంగానే దీపికా పదుకోన్ ప్రధాన పాత్రలో 'ద్రౌపది' సినిమా తెరకెక్కనుంది. అలాగే రామాయణం ఆధారంగా అలౌకిక్ దేశాయ్ దర్శకత్వంలో 'సీత: ఇన్‌కార్నేషన్' సినిమా రూపొందనుంది. ఈ సినిమాకు విజయేంద్రప్రసాద్ ఓ స్క్రీన్‌ప్లే రైటర్‌గా ఉన్నారు. ఇందులో సీతగా కంగనా రనౌత్ చేయనున్నారు. 'అపరాజిత అయోధ్య'లోనూ నటించనున్నారు కంగన. మరోవైపు సోనమ్ కపూర్ మహాభారతం ఆధారంగా ఉదయశంకర్ రాసిన 'ఆర్యావతార క్రానికల్' అనే మూడు భాగాల నవల హక్కులను దక్కించుకున్నారు. ఇటీవల రణ్‌బీర్ కపూర్ 'బ్రహ్మాస్త్ర' ఫిల్మ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మైథలాజికల్ మూవీ పార్ట్ 2, 3 కూడా వెండితెరపైకి రానున్నాయి.



దీపికా పదుకోన్



సందీప్, వరుణ్ తేజ్, శక్తి ప్రతాప్

బాలీవుడ్ ఎంట్రీ షురూ

వరుణ్ తేజ్ హిందీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. శక్తి ప్రతాప్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తొలి తెలుగు–హిందీ ద్విభాషా చిత్రం 'మేజర్'తో ఘనవిజయాన్ని అందుకున్న సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ సంస్థ రెనైసెన్స్ పిక్చర్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలి సీన్‌కి వరుణ్ తేజ్ తల్లి పద్మజ కొణిదెల కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. నిర్మాత బాపినీడు గౌరవ దర్శకత్వం వహించారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నా పాత్ర కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. ఇందులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా నటిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా జర్నీలో భాగమైనందుకు హ్యాపీ'' అన్నారు నిర్మాత సందీప్ ముద్దా. ''దేశం గర్వించదగ్గ నిజమైన హీరోల కథలను చెప్పనున్నాం. నవంబర్‌లో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు ఇండియా సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ జనరల్ మేనేజర్ లాడా గురుదేవ్ సింగ్.



రాహుల్, కోలా బాలకృష్ణ, ఆకాష్ పూరి

సస్పెన్స్.. థ్రిల్

కోలా బాలకృష్ణ, సాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'నేనెవరు'. నిర్భయ్ పల్నాటి దర్శకత్వంలో భీమినేని శివ ప్రసాద్–తన్నీరు రాంబాబు నిర్మించారు. ఈ చిత్రం ఆడియో అండ్ ప్రోమో, ఫస్ట్ గ్లింప్స్‌ని హీరోలు ఆకాష్ పూరి, రాహుల్ విజయ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. దివంగత ఎడిటర్ కోలా భాస్కర్ చివరి చిత్రం ఇది'' అని చిత్రబృందం పేర్కొంది. రచయితలు నివాస్, నాగబాల సురేష్ కుమార్, సుప్రీంకోర్టు న్యాయవాది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సామల భాస్కర్, సంగీతం: ఆర్.జి. సారధి, సహనిర్మాతలు: పూనమ్ చంద్, కుమావత్, కిరణ్ కుమార్ మోటూరి.

తెలవారెనేమో నా సామి!

త్రిగుణ్, మేఘా ఆకాష్ జంటగా నటించిన చిత్రం 'ప్రేమదేశం'. శ్రీకాంత్ సిద్ధమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మధుబాల ప్రత్యేక పాత్రలో నటించారు. శిరీష సిద్ధమ్ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'తెలవారెనే సామి ... తెలవారెనేమో నా సామి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ''ప్రేమదేశం' సినిమాని నా చిన్నప్పుడు చూశాను. ఇదే టైటిల్‌తో వస్తున్న మా సినిమాను టీమ్ సహకారంతో పూర్తి చేశాను'' అన్నారు శ్రీకాంత్ సిద్ధమ్. ''ఈ సినిమా నా కాలేజ్ డేస్‌ను గుర్తు చేసింది'' అన్నారు త్రిగుణ్. ''అక్టోబర్‌లో వస్తున్న మా చిత్రం హిట్టవుతుంది'' అన్నారు మేఘా ఆకాష్. ఈ చిత్రానికి కెమెరా: సజాద్ కాక్కు, సహనిర్మాత: భరత్, అసోసియేట్ ప్రొడ్యూసర్: రఘు కల్యాణ్.



త్రిగుణ్, మేఘా ఆకాష్

గోలీ సోడావే...

మంచు విష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం 'జిన్నా'. ఇషాన్ సూర్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సన్నీ లియోన్, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్లు. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై ఈ సినిమా రూపొందింది. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గోలీ సోడావే..' పాటని విడుదల చేసింది చిత్రయూనిట్. నకాష్ అజీజ్, నూతన మోహన్ పాడిన ఈ పాటని విష్ణు, పాయల్ రాజ్‌పుత్‌పై చిత్రీకరించారు. ''సైకలాజికల్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో వస్తున్న చిత్రమిది. జి. నాగేశ్వర్ రెడ్డి కథ అందించిన ఈ మూవీకి ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందించారు. కోన వెంకట్ స్క్రిప్టు అందించడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



పాయల్, విష్ణు



ధనుష్

డిసెంబరులో సారొస్తారు

ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళంలో తెరకెక్కిన చిత్రం 'సార్' (తెలుగు). తమిళంలో 'వాత్తి'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సాయి సౌజన్యతో కలిసి సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ డిసెంబర్ 2న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించి, ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ''ప్రస్తుత విద్యా వ్యవస్థ తీరు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో డిసెంబర్ 2న విడుదల చేస్తాం'' అని నాగవంశీ .ఎస్, సాయి సౌజన్య తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జె. యువరాజ్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

ఆది టాప్‌గేర్

ఆది సాయికుమార్, రియా సుమన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'టాప్ గేర్'. ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో శ్రీ ధనలక్ష్మీ ప్రొడక్షన్స్ పతాకంపై కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా లుక్, 3డీ మోషన్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్ మామిడిపల్లి.



ఆది

మహిళలు కనెక్ట్ అవుతారు

''దొంగలున్నారు జాగ్రత్త' యూనిక్ కథ. కథలో కీలకమైన నీరజ పాత్ర నాది. ప్రతి మహిళ నా పాత్రకు కనెక్ట్ అవుతారు'' అని హీరోయిన్ ప్రీతి అస్రాని అన్నారు. శ్రీ సింహా కోడూరి, ప్రీతి అస్రాని జంటగా నటించిన చిత్రం 'దొంగలున్నారు జాగ్రత్త'. సతీష్ త్రిపుర దర్శకత్వంలో డి. సురేష్ బాబు, సునీత తాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ప్రీతి అస్రాని మాట్లాడుతూ– ''మళ్ళీ రావా' తర్వాత 'ప్రెజర్ కుక్కర్, యాడ్ ఇన్ఫినిటమ్, సీటీమార్' చిత్రాలు చేశాను.. ఇప్పుడు 'దొంగలున్నారు జాగ్రత్త'లో ఛాలెంజ్‌తో కూడిన పాత్రలో నటించాను. సమంతగారి 'యశోద'లో అతిథి పాత్ర చేశాను. ప్రస్తుతం తెలుగులో రెండు, తమిళ్‌లో రెండు సినిమాలు చేస్తున్నాను'' అన్నారు.



ప్రీతి అస్రాని

సాక్షి బిజినెస్
మంగళవారం
20-9-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 300	నిఫ్టీ ▲ 92
59,141	17,622

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,436	▽	13
డోజోన్స్	30,817	▽	5
ఎఫ్‌టీఎస్‌ఈ 100 (16వ తేదీ ముగింపు)	7,237	▽	45
డాక్స్	12,803	▲	62
షాంఘై	3,116	▽	11
నికాయ్ (16వ తేదీ ముగింపు)	27,568	▽	308

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

కెనరా బ్యాంక్‌కు ఈజ్ 4.0 సంస్కరణల సూచీ అవార్డు



ముంబై: ప్రభుత్వ రంగ కెనరాబ్యాంక్‌కు ప్రతిష్టాత్మక 'ఈఏఎస్‌ఈ (ఈజ్) 4.0 సంస్కరణల సూచీ అవార్డు, 2022' లభించింది. అత్యుత్తమ పనితీరుకు గాను 2021–22 మార్చి త్రైమాసికానికి సంబంధించి ఈజ్ అవార్డు మూడవ ర్యాంక్‌ను దక్కించుకున్న బ్యాంక్, 'ప్రూడెంట్ బ్యాంకింగ్ ఇన్‌స్టిట్యూషనలైజింగ్ థీమ్' కింద మొదటి బహుమతిని కూడా అందుకుంది. ముంబైలో ఐబీఏ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చేతుల మీదుగా ఈజ్ 4.0 సంస్కరణల సూచీ అవార్డును అందుకుంటున్న బ్యాంక్ ఎండీ అండ్ సీఈఓ ఎల్‌వీ ప్రభాకర్‌ను చిత్రంలో తిలకించవచ్చు. దీర్ఘకాల సుస్థిర వ్యాపారవృద్ధి, డిజిటల్ సామర్థ్యాల విభాగాల్లో బ్యాంక్ చక్కటి పనితీరు కనబరుస్తున్నట్లు ప్రభాకర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఒలెక్ట్రాకు 123 ఈ-బస్‌ల ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, ఈవీ ట్రాన్స్ కన్సార్షియం తాజాగా 123 ఎలక్ట్రిక్ బస్‌ల సరఫరాకై లెటర్ ఆఫ్ అవార్డును అందుకుంది. థానే మున్సిపల్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ నుంచి దీనిని చేజిక్కించుకుంది. ఆర్డర్ విలువ రూ.185 కోట్లు అని ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. ఈవీ ట్రాన్స్ ఈ ఎలక్ట్రిక్ బస్‌లను ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నుండి కొనుగోలు చేసి 9 నెలల్లో డెలివరీ చేయనుంది. లిథియం అయాన్ బ్యాటరీని బస్‌లకు పొందుపరిచారు. నాలుగు గంటల్లో చార్జింగ్ పూర్తి అవుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కంపెనీ తయారీ బస్‌లు ముంబై, పుణే, నాగ్‌పూర్‌లో పరుగెడుతున్నాయి. ఒలెక్ట్రా ఈ–బస్‌లు దేశవ్యాప్తంగా ఏడు కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణించాయని కంపెనీ తెలిపింది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	49,320
బంగారం (99.5 స్వచ్ఛత)	49,123
వెండి (కిలో)	56,354

ఎస్‌యూవీల్లోకి హోండా రీ-ఎంట్రీ

వచ్చే ఏడాది కొత్త మోడల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ హోండా కార్స్.. భారత ప్యాసింజర్ కార్ల మార్కెట్లో 50 శాతం వాటా కలిగి ఉన్న స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) విభాగంలోకి తిరిగి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. తద్వారా ఇక్కడి విపణిలో వ్యాపారం తిరిగి వృద్ధి బాటలోకి వస్తుందని హోండా కార్స్ ఇండియా ఆశిస్తోంది. ఎస్‌యూవీ విభాగంలో ఉత్పత్తుల కొరత అమ్మకాల పరిమాణం, మార్కెట్ వాటా తగ్గడానికి దారితీసింది. కొత్త ఎస్‌యూవీ మోడల్ అభివృద్ధి దాదాపు పూర్తి అయింది. ప్రస్తుతం ఈ కారు తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఎస్‌యూవీలైన సీఆర్–వి, బీఆర్–వి, మొబిలియో మోడళ్ల ఉత్పత్తిని ఇప్పటికే కంపెనీ నిలిపివేసింది. డబ్ల్యూఆర్–వి, జాజ్ ఎస్‌యూవీలతోపాటు నాల్గవ తరం సిటీ సెడాన్ మోడళ్లు 2023 మార్చి నుంచి కనుమరుగు కానున్నాయి. ప్రస్తుతం భారత్‌లో సెడాన్స్ అయిన సిటీ హైబ్రిడ్, అయిదవతరం సిటీ, కాంపాక్ట్ సెడాన్ అమేజ్ కార్ల అమ్మకాలపైనే కంపెనీ ఆధారపడింది.



నిష్క్రమించే ఆలోచనే లేదు..

హోండా అంతర్జాతీయంగా 2030 నాటికి 30 ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఏటా 20 లక్షల ఈ–కార్లు తయారు చేయాలన్నది సంస్థ లక్ష్యం. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని మోడళ్ల ఉత్పత్తిని నిలిపివేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు వెళ్లాలని హోండా నిర్ణయించుకుంది. భారత్‌తో సహా కొన్ని దేశాల్లో ప్లాంట్లు మూతపడ్డాయి. ఇప్పుడు పటిష్ట స్థితిలో ఉన్నట్టు కంపెనీ వెల్లడించింది. 'నాల్గవ అతిపెద్ద కార్ల మార్కెట్ అయిన భారత్ నుంచి నిష్క్రమించే ఆలోచనే లేదు. రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు సాగించాం. తప్పుకోవడానికి కారణమే లేదు. ఇక్కడ కొనసాగుతాం' అని స్పష్టం చేసింది.

3 రోజుల నష్టాలకు చెక్

- లాభాల్లో ముగిసిన మార్కెట్లు
- సెన్సెక్స్ 300 పాయింట్లు అప్
- 59,000 అధిగమించిన ఇండెక్స్
- 92 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడంతో రోజంతా లాభాలతో కదిలాయి. సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ సాధించి 59,141 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 92 పాయింట్లు ఎగసి 17,622 వద్ద స్థిరపడింది. వెరసి ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌కు విరుద్ధమైన రీతిలో నిలిచాయి. ప్రారంభంలో వెనకడుగు వేసినప్పటికీ వెనువెంటనే పుంజుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా పీఎస్‌యూ బ్యాంక్స్, మీడియా, ఎఫ్‌ఎంసీజీ, ఆటో రంగాలు 2–1 శాతం మధ్య లాభపడి మార్కెట్లకు దన్నునిచ్చాయి. రియల్టీ 1 శాతం, మెటల్ 0.5 శాతం చొప్పున నీరసించాయి.

బ్లూచిప్స్ తీరిలా...

నిఫ్టీ దిగ్గజాలలో ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌యూఎల్, ఎస్‌బీఐ, నెస్లే, బజాజ్ ఫిన్, హెచ్‌డీఎఫ్‌సీ, దివీస్, ఐటీసీ, యాక్సిస్, యూపీఎల్, ఐషర్, మారుతీ, ఇన్ఫోసిస్ 3.4–1 శాతం మధ్య లాభపడ్డాయి. మరోపక్క టాటా స్టీల్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బ్రిటానియా, పవర్‌గ్రిడ్, సిప్లా, ఐసీఐసీఐ 2.4–0.8 శాతం మధ్య నష్టపోయాయి.

చిన్న షేర్లు వీక్

మార్కెట్లు బలపడినప్పటికీ చిన్న షేర్లలో అమ్మకాలదే పైచేయిగా నిలిచింది. దీంతో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ ఇండెక్సులు 0.16 శాతం చొప్పున డీలాపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,973 నష్టపోగా.. 1,655 లాభపడ్డాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 312 కోట్లు ఇన్వెస్ట్ చేయగా దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 95 కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి.

తాత్కాలికమే..: యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్ష నేపథ్యంలో ఇకపై మార్కెట్లు ఊగిసలాటకు లోనుకావచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు. బుధవారం ప్రకటించనున్న సమీక్షలో ఫెడ్ 0.75% వడ్డీ రేటును పెంచే అంచనాలున్నట్లు తెలియజేశారు.



స్టాక్ హైలైట్స్

- హెర్క్యులెస్ హోయిస్ట్స్ షేరు బిజినెస్‌ల విడదీత వార్తలతో 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 218 వద్ద ఫ్రీజయ్యింది.
- షుగర్, ఇంజనీరింగ్ విభాగాలుగల త్రివేణీ ఇంజనీరింగ్ షేరు 17% జంప్‌చేసి 288 వద్ద ముగిసింది.
- వందే భారత్ సెమీ హైస్పీడ్ రైళ్ల కోసం మాడ్యులర్ ఇంటీరియర్స్‌కు రూ. 113 కోట్ల విలువైన ఆర్డర్లు లభించడంతో ఇండోనేషనల్ షేరు 20% అప్పర్ సర్క్యూట్ రూ. 404 వద్ద ముగిసింది.
- అదానీ గ్రూప్ తాజాగా రూ. 20,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించడంతో అంబుజా సిమెంట్స్ 9% దూసుకెళ్లి 565 వద్ద ముగిసింది.

మేడిన్ ఇండియా బొమ్మల హవా

- బొంగరాలు, విక్రమ్ బేతాళ్ పజిల్స్ మొదలైన వాటికి డిమాండ్
- 1.5 బిలియన్ డాలర్ల దేశీ టాయ్స్ మార్కెట్
- రెండేళ్లలో 3 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న అంచనాలు



చెన్నై: లెగో, బార్బీ లాంటి విదేశీ ఉత్పత్తులను పక్కన పెట్టి దేశీయంగా మన ఆటలు, బొమ్మలు, ఆట వస్తువులకు డిమాండ్ పెరుగుతోంది. బొంగరాలు, విక్రమ్ బేతాళ్ పజిళ్లు, ఇతరత్రా దేశీ థీమ్స్‌తో తయారవుతున్న ఆటవస్తువులపై పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. టాయ్స్ పరిశ్రమకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గతేడాది నిర్దిష్ట నిబంధనలను తప్పనిసరి చేయడంతో కొన్ని రకాల బొమ్మలను దిగుమతి చేసుకోవడం కొంత తగ్గింది. అదే సమయంలో దేశీ టాయ్స్ తయారీ సంస్థలు కూడా వినూత్నంగా ఆలోచించడం మొదలుపెట్టాయి. భారతదేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఉత్పత్తులను రూపొందించడంపై దృష్టి పెట్టాయి. మార్కెట్ లీడర్లయిన ఫన్‌స్కూల్, హాస్బ్రో, షుమీ లాంటి సంస్థలు ఆట వస్తువులు, గేమ్స్‌ను రూపొందిస్తున్నాయి. జన్మాష్టమి మొదలుకుని రామాయణం వరకు వివిధ దేశీ థీమ్స్ కలెక్షన్లను కూడా తయారుచేస్తున్నాయి. పిల్లలు ఆడుకునే సమయం కూడా అర్థవంతంగా ఉండాలనే ఆలోచనా ధోరణి కొత్త తరం పేరెంట్స్‌లో పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటివి హాట్ కేకులుగా అమ్ముడవుతున్నాయి. సంప్రదాయ భారతీయ గేమ్స్‌కు ఊహించిన దానికన్నా ఎక్కువ స్పందనే లభిస్తోందని ఫన్‌స్కూల్ వర్గాలు తెలిపాయి. దీంతో తాము బొంగరాలు, గిల్లీదండా (బిళ్లంగోడు) లాంటి ఉత్పత్తులను కూడా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నాయి. తాము చిన్నప్పుడు ఆడుకున్న బొమ్మలు, ఆటల్లాంటివి తమ పిల్లలకు కూడా పరిచయం చేయాలన్న ఆసక్తి సాధారణంగానే తల్లిదండ్రుల్లో ఉంటుందని, ఇది కూడా దేశీ గేమ్స్ ఆదరణ పొందడానికి కారణమవుతోందని హాస్బ్రో ఇండియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ బొమ్మలు, గేమ్స్ మొదలైనవి పూర్తిగా దేశీయంగానే తయారవుతున్నాయని, దీనితో స్థానికంగా కొనుగోళ్లు, తయారీకి కూడా ఊతం లభిస్తోందని వివరించాయి. తాము మోనోపలీ ఆటను తమిళంలో కూడా అందుబాటులోకి తెచ్చామని, దీన్ని తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నామని పేర్కొన్నాయి. అటు జన్మాష్టమి కలెక్షన్ ఆవిష్కరించిన ఆటవస్తువుల కంపెనీ షుమీ కొత్తగా దీపావళి కలెక్షన్‌ను కూడా ప్రవేశపెడుతోంది.

90 శాతం వాటా అసంఘటిత సంస్థలదే..

దేశీ టాయ్స్ మార్కెట్ 1.5 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ఇందులో సింహభాగం 90 శాతం వాటా అసంఘటిత సంస్థలదే ఉంటోంది. అంతర్జాతీయంగా టాయ్స్ మార్కెట్ 5 శాతం మేర వృద్ధి చెందుతుంటే మన మార్కెట్ మాత్రం 10–15 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. దీంతో వచ్చే రెండేళ్లలో మార్కెట్ పరిమాణం 2–3 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఎంతో కాలంగా భారత్‌లో దేశీ ఆటవస్తువులు, బొమ్మలు, గేమ్స్‌కు డిమాండ్ ఉన్నప్పటికీ తయారీ సంస్థలు ఇప్పుడు దాన్ని గుర్తిస్తున్నాయని టాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ శరద్ కపూర్ తెలిపారు.

ఎయిరిండియా సబ్సిడరీల అమ్మకం

విక్రయ ప్రక్రియకు తెరతీసిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: ఇటీవల ప్రైవేటైజ్ చేసిన ఎయిరిండియాకు అనుబంధంగా వ్యవహరించిన రెండు సంస్థల విక్రయ ప్రక్రియకు ప్రభుత్వం తాజాగా తెరతీసింది. ఎయిరిండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్(ఏఐఏఎస్ఎల్), ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఈఎస్ఎల్) అమ్మకానికి చర్యలు ప్రారంభించినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇందుకు పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ సంస్థ(దీపమ్) ఇన్వెస్టర్ల సమావేశాలు, రోడ్ షోలను మొదలుపెట్టినట్లు వెల్లడించారు. వెరసి త్వరలో ఈ రెండు సంస్థల కొనుగోలుకి ఆసక్తి వ్యక్తంచేసే(ఈవోఐ) బిడ్స్‌కు ఆహ్వానం పలకనున్నట్లు తెలియజేశారు. రుణ భారంతో కుదేలైన ఎయిరిండియాను గతేడాది అక్టోబర్‌లో రూ. 18,000 కోట్లకు టాటా గ్రూప్‌నకు ప్రభుత్వం విక్రయించిన సంగతి తెలిసిందే.

ఆయుర్వేదంతో వ్యాధులు దూరం: బైద్యనాథ్



హైదరాబాద్: వర్షాకాలం ప్రత్యేకించి జూలై నుంచి సెప్టెంబర్ వరకూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, అప్రమత్తత అవసరమని బైద్యనాథ్ ఒక ప్రకటనలో పేర్కొంది. అన్ని కాలాలతో పాటు వర్షాకాలంలో ఆరోగ్యాన్ని ఎలా సంరక్షించుకోవాలన్న అంశాన్ని ఆయుర్వేద సైన్స్ వివరించినట్లు తెలిపింది. జలుబు, దగ్గు, తరచూ తుమ్ములు, ఆకలి కోల్పోవడం, ఒంటి నొప్పులు, జ్వరం, డయేరియా, మలేరియా ఒంటి వ్యాధుల నివారణ, ఆయుర్వేదం ఔషధాల ద్వారా చికిత్సకు తీసుకోవాల్సిన చర్యలపై బైద్యనాథ్ నిపుణులను సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-9-2022	
విశాఖ	425-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
19-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ భూగర్భ జలం, జల గణన శాఖలో 74 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన భూగర్భ జలం, జల గణన శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన జిల్లాల వారీగా టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 74
» **అర్హత:** డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్)తోపాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.**వయసు:** 31.03.2022 నాటికి 35ఏళ్లలోపు ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.18,000(టూర్ అలవెన్స్ నెలకు రూ.5000)
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికేట్‌లు సంబంధిత జిల్లాల భూగర్భ జల అధికారులకు పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2022
» **ఇంటర్వ్యూ తేది:** 11.10.2022
» **వేదిక:** సంబంధిత జిల్లా భూగర్భ జల, జల గణన శాఖ అధికారి కార్యాలయం.
» **వెబ్‌సైట్:** www.apsgwd.ap.gov.in

గెయిల్ (ఇండియా) లిమిటెడ్, న్యూఢిల్లీలో 77 పోస్టులు

న్యూఢిల్లీలోని గెయిల్(ఇండియా) లిమిటెడ్.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వర్క్–సెంటర్లు/యూనిట్‌లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 77
» **అర్హత:** పోస్టును అనుసరించి డిప్లొమా, బీఈ/బీటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, సీఏ, సీఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది:** 15.10.2022
» **వెబ్‌సైట్:** www.gailonline.com

హిందుస్థాన్ షిప్‌యార్డ్, విశాఖపట్నంలో 104 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 104
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–55, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్–49.
» **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్, సీఎస్‌ఈ/ఐటీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్.
» **అర్హత:** డిప్లొమా/డిగ్రీ(ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీ) ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** మెరిట్ ఆధారంగా.
» **ఎన్ఏటీఎస్ పోర్టల్‌లో వివరాల నమోదుకు చివరితేది:** 21.09.2022
» **హెచ్ఎస్ఎల్ పోర్టల్‌లో దరఖాస్తులకు చివరి తేది:** 26.09.2022
» **వెబ్‌సైట్:** www.mhrdnats.gov.in

నిట్, వరంగల్‌లో హాస్టల్ మేనేజర్ పోస్టులు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. ఒప్పంద ప్రాతిపదికన హాస్టల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** హాస్టల్ మేనేజర్(మేల్–03, ఫీమేల్–02). » **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. హాస్టళ్లు, మెస్‌లు, క్యాంటీన్‌లు నిర్వహించడంలో అనుభవం కలిగి ఉండాలి. వయసు: 50ఏళ్లు మించకూడదు. **జీతం:** నెలకు రూ.50,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్, తెలంగాణ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 15.10.2022
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

పీఎంబీఐ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఫార్మాసూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా(పీఎంబీఐ).. వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఆఫీసర్/సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్.
» **విభాగాలు:** ఐటీ అండ్ ఎంఐఎస్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్, సేల్స్ అండ్ మార్కెటింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ/బీసీఏ/బీబీఏ /బీఎస్సీ /బీటెక్/బీఫార్మసీ/ఎంసీఏ/ఎంటెక్/ఎంఎస్సీ /ఎంఫార్మసీ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **జీతం:** నెలకు రూ.28,000 నుంచి రూ.30,000 చెల్లిస్తారు
» **వయసు:** 28 నుంచి 30ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఫార్మాసూటికల్స్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా(పీఎంబీఐ)ఈ–1, ఎనిమిదో ఫ్లోర్, వీడియోకాన్ టవర్, జండేవలన్ న్యూఢిల్లీ–110055 చిరునామకు పంపించాలి.
» **ఇంటర్వ్యూ తేది:** 22.09.2022
» **వెబ్‌సైట్:** janaushadhi.gov.in

ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ కొలువు

» 5,008 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
» రెండు దశల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకం
» తొలిసారిగా ప్రాంతీయ భాషల్లోనూ రాత పరీక్షలు

బ్యాంకు కొలువుల అభ్యర్థులకు..శుభవార్త! దేశంలోని అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఐదువేలకుపైగా జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు దశల రాత పరీక్ష ద్వారా నియామకాలు ఖరారు చేయనుంది. దీనికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్స్ నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానంతోపాటు విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా క్రమం తప్పకుండా క్లరికల్, పీవో(ప్రొబేషనరీ ఆఫీసర్), స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ చేపడుతోంది. కాబట్టి ఐబీపీఎస్, ఎస్ఎస్‌సీ వంటి పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు అదే ప్రిపరేషన్‌తో.. ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ ఉద్యోగాలకు కూడా పోటీ పడొచ్చు.

ఐదు వేలకుపైగా పోస్టులు

ఎస్‌బీఐ మొత్తం 5,008 జూనియర్ అసోసియేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో హైదరాబాద్ సర్కిల్‌లో 225 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- నవంబర్ 30,2022 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు:** ఆగస్ట్ 1, 2022 నాటికి 18–28 ఏళ్లుగా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

తొలిసారి ప్రాంతీయ భాషల్లో

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్స్ తాజా నోటిఫికేషన్‌లో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం.. తొలిసారిగా పరీక్షలను ప్రాంతీయ భాషల్లో నిర్వహించనుండడం. తెలుగు సహా మొత్తం ఇరవై భాషల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న భాషలో పరీక్షకు హాజరు కావచ్చు. హైదరాబాద్ సర్కిల్‌లో పరీక్ష రాయాలనుకునే వారు తెలుగు లేదా ఉర్దూ మీడియంలను ఎంచుకునే అవకాశముంది.

రెండు దశల రాత పరీక్ష

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పోస్టులకు రెండు దశల రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ముందుగా ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. అందులో సాధించిన ఉత్తీర్ణత, కటాఫ్ లిస్ట్ ఆధారంగా..తదుపరి దశలో జరిపే మెయిన్ పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అంతిమంగా మెయిన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు.

స్థానిక భాష పరీక్ష

అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే మాధ్యమాన్ని దరఖాస్తు సమయంలోనే తెలియజేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగానే పరీక్ష పేపర్ మాధ్యమం ఉంటుంది. మాతృ భాష కాకుండా.. వేరే భాషలో పరీక్ష రాసిన అభ్యర్థులకు.. మెయిన్ ఎగ్జామ్ తర్వాత స్థానిక భాష పరీక్ష నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ 100 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్ష.. ప్రిలిమినరీ. మూడు విభాగాలుగా ఆన్‌లైన్‌లో మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగతా విభాగాలకు సంబంధించి.. అభ్యర్థులు తమ రాష్ట్రానికి చెందిన లేదా తాము దరఖాస్తు చేసుకున్న రాష్ట్రానికి సంబంధించిన ప్రాంతీయ భాషలో పరీక్ష రాయొచ్చు.

200 మార్కులకు మెయిన్

తొలిదశ రాత పరీక్ష ప్రిలిమినరీలో చూపిన ప్రతిభ ఆధారంగా 1:10 నిష్పత్తిలో (ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున) తదుపరి దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉండే మెయిన్ పరీక్ష మొత్తం నాలుగు విభాగాల్లో 200 మార్కులకు జరుగుతుంది. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు –50 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2గంటల 40 నిమిషాలు. మెయిన్ ఎగ్జామ్‌లోనూ అభ్యర్థులు జనరల్ ఇంగ్లిష్ మినహా మిగతా విభాగాలను తమకు ఆసక్తి, అర్హత ఉన్న ప్రాంతీయ భాషలో హాజరయ్యే అవకాశం ఉంది.

నవంబర్‌లో పరీక్ష.. సన్నద్ధత ఇలా

ఎస్‌బీఐ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం–ప్రిలిమినరీ పరీక్ష నవంబర్‌లో జరుగనుంది. మెయిన్ మాత్రం ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే అవకాశం ఉంది. అంటే..ప్రిలిమ్స్‌కు గరిష్టంగా రెండు నెలలు, మెయిన్స్‌కు మూడు లేదా నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు ముందుగా ప్రిలిమినరీ పరీక్ష తేదీ వరకు.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో ఉన్న సబ్జెక్ట్‌లకు ప్రిపరేషన్ సాగించాలి. ఆ తర్వాత పూర్తిగా మెయిన్స్‌పై దృష్టి పెట్టాలి. మెయిన్ పరీక్షలో మాత్రమే ఉన్న జనరల్ /ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాలకు ప్రత్యేక సమయం కేటాయించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

అభ్యర్థుల ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలించే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఉండాలి. అదేవిధంగా ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దిన పత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

పరీక్షలో మరో కీలక విభాగం ఇది. మెయిన్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగానికి సరితూగే విభాగంగా దీన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అర్థమెటిక్ అంశాలు (పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ–నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పట్టు సాధించేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటాఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లనూ సాధన చేయాలి.

రీజనింగ్

ఈ విభాగం ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉంటుంది. ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

మెయిన్‌లోనే ఉండే ఈ విభాగంలో రాణించాలంటే.. బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించిన చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో.. కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఎకానమీ, ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్

కంప్యూటర్ నాలెడ్జ్‌ను పరీక్షించే ఉద్దేశంతో మెయిన్‌లో మాత్రమే ఉండే విభాగం ఇది. ఈ విభాగానికి సంబంధించి ప్రధానంగా కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

గత ప్రశ్న పత్రాల సాధన

అభ్యర్థులు గత ప్రశ్న పత్రాల సాధన, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం ఉపయుక్తంగా ఉంటుంది. ఫలితంగా ఏ టాపిక్‌కు ఎంత వెయిటేజీ ఉందో తెలుస్తుంది. అంతేకాకుండా సమాధానాలను సరిచూసుకోవడం ద్వారా తాము ఇంకా అవగాహన పొందాల్సిన అంశాలపై స్పష్టత లభిస్తుంది. మాక్ టెస్ట్‌లకు హాజరవడం వల్ల టైమ్ మేనేజ్‌మెంట్ కూడా అలవడుతుంది. ఇలా ఇప్పటి నుంచే మెయిన్ ఎగ్జామినేషన్ దృక్పథంతో చదివితే.. ప్రిలిమ్స్‌లో సులువుగా నెగ్గడానికి, ఆ తర్వాత మెయిన్‌లో రాణించడానికి అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: సెప్టెంబర్ 27, 2022
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: నవంబర్, 2022లో
- మెయిన్ పరీక్ష తేదీ: డిసెంబర్ 2022 లేదా జనవరి 2023లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://bank.sbi/careers, https://www.sbi.co.in/careers

క్లుప్తంగా

రెండు రోజుల్లో నీట్ అర్హుల జాబితా

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన నీట్ యూజీ–2022 అర్హుల జాబితా ఒకటి, రెండు రోజుల్లో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అందనుంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జూలైలో నీట్ యూజీ–2022 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నెల 7న ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 65,305 మంది పరీక్ష రాయగా, 40,344 మంది అర్హత సాధించారు. అర్హుల జాబితాను విశ్వవిద్యాలయానికి తెచ్చాక వచ్చే వారంలో అర్హుల జాబితాను ప్రదర్శించే అవకాశం ఉంది.

22 వరకు ఇంటర్మీడియెట్ నాలుగో విడత ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ నాలుగో విడత ప్రవేశాలు సోమవారం నుంచి ప్రారంభించినట్లు బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరి బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 వరకు నాలుగో విడత అడ్మిషన్లను కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆ తర్వాత అడ్మిషన్లకు మరో అవకాశం ఉండదని ఆయన స్పష్టంచేశారు.

60 లక్షల మందితో ప్రకృతి సాగు


బొర్రమామిడిలో జేమ్స్ రోమాక్స్, ఇతర అధికారులు

సాక్షి, అమరావతి/అనంతపురం అగ్రికల్చర్/పాడేరు : రాష్ట్రంలో రానున్న తొమ్మిదేళ్లలో 60 లక్షల మంది రైతులతో పాటు 20 లక్షల మంది రైతు కూలీలను ప్రకృతి సాగువైపు మళ్లించడం ద్వారా కనీసం 60 లక్షల హెక్టార్ల భూమిని అత్యంత సారవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించినట్లు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్ వెల్లడించారు. ప్రకృతిసాగు పద్ధతులు పాటించడం ద్వారా విద్యుత్, ఎరువులపై రైతులకిచ్చే రూ.54 వేల కోట్ల సబ్సిడీ మొత్తం ప్రభుత్వానికి ఆదా కానుందన్నారు. అమెరికాకు చెందిన గ్రౌండ్స్‌వెల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఏడురోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన 15 దేశాలకు చెందిన 30మంది ప్రతినిధుల బృందం సోమవారం అనంతపురం జిల్లాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ప్రకృతి సాగుచేస్తున్న రైతులు, రైతు సాధికార సంస్థకు చెందిన వివిధ జిల్లాల అధికారులతో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజయకుమార్ మాట్లాడారు. ఇక గోఆధారిత ప్రకృతి వ్యవసాయ విధానాలను అమలుచేస్తున్న ఏపీ ప్రభుత్వం ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారుతోందని విదేశీ ప్రతినిధి బృందం నేత స్టీవ్ బ్రేసియా ప్రశంసించారు. గిరిజన ప్రాంతాల్లోనూ ప్రకృతి వ్యవసాయం అద్భుతమని ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్, పొల్యూషన్ ప్రతినిధి జేమ్స్ రోమాక్స్ కొనియాడారు.

రాజకీయ పార్టీలన్నీ వికేంద్రీకరణకు మద్దతివ్వాలి

- లేకపోతే తగిన బుద్ధి చెబుతాం
- విద్యార్థి జేఏసీ కన్వీనర్ కాంతారావు


ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): ఉత్తరాంధ్రలోని అన్ని రాజకీయ పార్టీలు వికేంద్రీకరణకు, పరిపాలన రాజధానిగా విశాఖకు మద్దతు పలకాలని విద్యార్థి జేఏసీ కన్వీనర్ బి.కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం విశాఖ ఎన్‌ఏడీ జంక్షన్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతి రైతుల పేరుతో చేస్తున్న యాత్ర.. చంద్రబాబు బినామీల యాత్రని ఎద్దేవా చేశారు. వీరికి రాష్ట్రాభివృద్ధి అవసరం లేదని.. వారి సొంత అభివృద్ధి మాత్రమే కావాలని దుయ్యబట్టారు. ఇది ఉత్తరాంధ్రపై భూబకాసురుల దండయాత్రన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్రకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని.. ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రమంతా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఆకాంక్షించే రాజకీయ పార్టీలన్నీ పరిపాలన రాజధానికి మద్దతివ్వాలని.. లేకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు భరత్, హరీష్, బాలాజీ, ఉదయ్, జాని చందు, రాఘవ, వివేక్, జగదీష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

ఇదీ.. మార్గదర్శి మోసాల కథ!



చట్ట విరుద్ధంగా రూ.వేల కోట్ల డిపాజిట్ల సేకరణ.. అనుబంధ కంపెనీలకు నిధుల మళ్లింపు

- రికార్డులు ఇవ్వకుండా, తనిఖీలకు సహకరించకుండా..
- డిపాజిట్‌దారులకు మార్గదర్శి తిరిగి చెల్లించేపరిస్థితిలో లేదని విచారణాధికారి నివేదిక

సాక్షి, అమరావతి: హిందూ అవిభక్త కుటుంబం పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ సాధారణ ప్రజానీకం నుంచి ఆర్బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా రూ.2,600 కోట్లను సేకరించింది. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని ఆధారాలతో ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తెచ్చారు. అయితే అక్కడి నుంచి తగిన స్పందన లేకపోవడంతో తమ ముందున్న ఆధారాల ఆధారంగా మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్గదర్శి ఉల్లంఘనలపై విచారణ జరిపేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు ఎస్.రంగాచారిని నియమిస్తూ 2006లో జీవో 800 జారీ చేసింది. ఇదే సమయంలో సీఐడీ తరఫున సంబంధిత కోర్టుల్లో పిటిషన్లు, దరఖాస్తులు దాఖలు చేసేందుకు అధీకృత అధికారిగా టి.కృష్ణరాజును నియమిస్తూ జీవో 801 జారీ చేసింది. ఈ రెండు జీవోలపై మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.

రంగాచారికి సహకరించని మార్గదర్శి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్గదర్శి అక్రమాలపై విచారణ జరిపిన రంగాచారి 2007 ఫిబ్రవరిలో తన నివేదిక సమర్పించారు. రికార్డుల తనిఖీకి మార్గదర్శి ఏమాత్రం సహకరించలేదని నివేదికలో పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ ఎత్తున నష్టాల్లో ఉందని, మెచ్యూరిటీ సమయంలో డిపాజిట్లు తిరిగి చెల్లించే పరిస్థితిలో ఆ సంస్థ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిధులను ఇతర అనుబంధ కంపెనీలకు మళ్లించడమే ఈ పరిస్థితికి కారణమని తెలిపారు.

చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి ఫిర్యాదు...

మార్గదర్శి అక్రమాలు, చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి కృష్ణరాజు 2008 జనవరిలో నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. దీన్ని కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి సీసీ 540లో తదుపరి చర్యలను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేయగా సీసీ 540లో తదుపరి చర్యలు కొనసాగించుకునేందుకు అనుమతినిచ్చింది. అటు తరువాత ఇదే సీసీ 540పై మార్గదర్శి మరో రూపంలో పిటిషన్ దాఖలు చేసి హైకోర్టు నుంచి సానుకూలంగా స్టే ఉత్తర్వులు పొందింది.

స్టే ఇవ్వని సుప్రీంకోర్టు.. ఏకంగా ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు...

2011లో తిరిగి సీసీ 540ని కొట్టేయాలంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద మార్గదర్శి పిటిషన్ దాఖలు చేసింది. ఆర్బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్) కింద తామెలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, క్రిమినల్ ఫిర్యాదును కొట్టేయాలని కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏదైనా కేసులో స్టే కాల పరిమితి ఆరు నెలలు కావడంతో హైకోర్టు ఇచ్చిన స్టే గడువు ముగిసింది. స్టే గడువు పెంపు కోసం మార్గదర్శి 2018లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే స్టే పొడిగింపునకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇదిలా ఉండగా సీసీ 540ని కొట్టేయాలంటూ మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్‌పై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ విచారణ జరిపారు. ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి రోజు అంటే 31.12.2018న జస్టిస్ రజనీ మార్గదర్శికి అనుకూలంగా తీర్పు వెలువరించారు. మార్గదర్శి కోరినట్లు సీసీ 540ని కొట్టేశారు. హైకోర్టు విభజన హడావుడిలో ఉన్నప్పుడు వెలువడిన ఈ తీర్పును అప్పట్లో ఎవరూ గుర్తించలేదు. కొంత కాలం తరువాత అసలు విషయం బయటకు రావడంతో ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2020 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ రజనీ 2021 సెప్టెంబర్‌లో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అమరావతి బెంచ్ సభ్యురాలిగా నియమితులై ప్రస్తుతం ఆ పోస్టులో కొనసాగుతున్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలోనే ఆమెకు ఎన్‌సీఎల్‌టీ పోస్టు ఖరారైంది.

మార్గదర్శి, రామోజీకి నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు దాఖలు చేశారు. దీన్ని కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు (31.12.2018)న అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ (ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ సభ్యురాలు, అమరావతి బెంచ్) తీర్పునిచ్చారు. మార్గదర్శి అక్రమాలను వెలుగులోకి తెచ్చిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఈ తీర్పును సవాలు చేస్తూ 2018లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. 2020లో ఇదే వ్యవహారంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలన్నింటిపై తాజాగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

ఆ వ్యాజ్యాన్ని కూడా కలిపి విచారించండి...

ఉండవల్లి తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, న్యాయవాది రమేష్ అల్లంకి వాదనలు వినిపిస్తూ, మార్గదర్శి రికార్డులు తనిఖీ చేయడానికి 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రెండు జీవోలు విడుదల చేసి విచారణ అధికారిని నియమించిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించిందని, స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో ఆ సంస్థ సుప్రీంకోర్టుకు వచ్చిందని తెలిపారు. ఆ కేసు అప్పటి నుంచి పెండింగ్‌లో ఉందని, దానిని కూడా ఈ వ్యాజ్యాలకు జతచేసి తమ వాదనలను వినాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ ఈ అంశాన్ని తదుపరి విచారణ సమయంలో పరిశీలిస్తామని స్పష్టం చేసింది.

తనిఖీలకు ఏమాత్రం సహకరించలేదు..

మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ డిపాజిట్‌దారులందరికీ సొమ్ములను తిరిగి ఇచ్చేసిందా? అని ఏపీ ప్రభుత్వాన్ని విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ స్పందిస్తూ ఖాతాలను తనిఖీ చేయడానికి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వలేదని నివేదించారు. తనిఖీలకు ఏమాత్రం సహకరించలేదన్నారు. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) పేరిట అందరి నుంచి డిపాజిట్లు తీసుకోవడం ఆర్బీఐ చట్ట ప్రకారం నేరమని, దీనిపైనే ప్రధానంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని ధర్మాసనానికి విన్నవించారు. డిపాజిట్‌దారులందరికీ సొమ్ములు తిరిగి వచ్చాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించిన తరువాత చెబుతామని వికాస్ సింగ్ తెలిపారు. ఆ వివరాలు సేకరించి తమ ముందుంచాలని వికాస్ సింగ్‌కు ధర్మాసనం స్పష్టం చేసింది. మార్గదర్శి దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని విచారించిన ధర్మాసనం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున ఎవరైనా హాజరయ్యారా? అని ధర్మాసనం ప్రశ్నించగా ఎవరూ రాలేదని మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా బదులిచ్చారు.

అనుకూల తీర్పు పొంది కూడా రామోజీ కోర్టుకు ఎందుకొచ్చారో..!

హైకోర్టులో కేసు గెలిచినప్పటికీ రామోజీరావు సుప్రీంకోర్టుకు ఎందుకొచ్చారో అర్థం కావడంలేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. క్రిమినల్ ఫిర్యాదును కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆయనకు సంతృప్తినివ్వలేదేమో అని వ్యాఖ్యానించారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. రామోజీరావుపై తనకేమీ కక్ష లేదని, జైల్లో పెట్టించాలని తనకేమీ లేదని ఉండవల్లి చెప్పారు. చట్టానికి రామోజీరావును అతీతుడిని చేయకూడదని, సమాజానికి, ధర్మానికి హాని జరగకూడదన్నదే తన ఉద్దేశమన్నారు. హెచ్‌యూఎఫ్ ద్వారా డిపాజిట్లు సేకరించవచ్చంటే రామోజీ మాత్రమే కాకుండా అందరూ సేకరించవచ్చునన్నారు. డిపాజిట్లు ఇస్తే ఇస్తారు.. లేకపోతే లేదనేది తర్వాత అంశమన్నారు. మార్గదర్శి డిపాజిట్ల వ్యవహారంలో ఇకపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషిస్తుందని ఉండవల్లి అభిప్రాయపడ్డారు. మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ ప్రభుత్వానికి కూడా సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది కాబట్టి ఇకపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా కౌంటర్ వేయక తప్పదన్నారు. మార్గదర్శి వ్యవహారాన్ని ఇటీవలే తెలంగాణ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకురాగా అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చామని చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తున్న క్రమంలో కేసు ఓ తార్కిక ముగింపునకు వచ్చే అవకాశముందన్నారు. ఈ అంశంపై కేవలం హెచ్‌యూఎఫ్ వరకే తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. డిపాజిట్‌దార్లకు సొమ్ములు అందాయా లేదా? అని తనిఖీ చేసేందుకు గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారిని నియమించగా కొందరు డిపాజిట్‌దారులు అసోసియేషన్‌గా ఏర్పడి కోర్టుకు వెళ్లారన్నారు. తమ పేర్లు బయటపడితే రామోజీ దగ్గర సొమ్ములు దాచుకున్నామని వైఎస్సార్ కక్ష సాధిస్తారని భయంగా ఉందంటూ కోర్టు నుంచి స్టే తెచ్చారని ఉండవల్లి చెప్పారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని వివరాలు సేకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన క్రమంలో అన్ని అంశాలు బయటకు వస్తాయన్నారు.

చంద్రబాబు వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు

- ఇప్పటికైనా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షను గుర్తించండి
- వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి
- విశాఖను పరిపాలన రాజధాని చేయాలి
- ఉత్తరాంధ్ర మేధావుల జాయింట్ యాక్షన్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ్‌కుమార్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చంద్రబాబే కారణమని ఉత్తరాంధ్ర మేధావుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్ చెప్పారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా.. అమరావతినే ఏకైక రాజధానిగా చేయాలన్న చంద్రబాబు వాదనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సోమవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి నుంచి అరసవల్లి వరకు చేపట్టిన యాత్ర ఎవరి కోసమని ప్రశ్నించారు. మీ ప్రాంతమే అభివృద్ధి చెందాలా? ఉత్తరాంధ్ర ప్రజలు ఇంకా వెనుకబడిపోవాలా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని సూచించారు. ప్రాజెక్టులు, నిధులు, జాతీయ విద్యాలయాల కేటాయింపు ఇలా.. ప్రతి విషయంలోనూ చంద్రబాబు పక్షపాత ధోరణితో వ్యవహరించడం వల్లే ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందన్నారు. శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణ కమిటీ, బోస్టన్ గ్రూప్ వంటి నిపుణుల కమిటీలిచ్చిన నివేదికలను అనుసరించకుండా.. ఏకపక్షంగా అమరావతిని రాజధానిగా ప్రకటించారని మండిపడ్డారు. విశాఖను కాకుండా అమరావతిని ఎంచుకోవడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు యావత్ రాష్ట్రమంతా నష్టపోయిందన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రొఫెసర్లు చంద్రమౌళి, భాస్కరరెడ్డి, సయ్యద్ హబీబ్ అలీషా, ఎంవీ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- 2014–19 మధ్య రూ.32,940 కోట్ల బకాయిలు
- రూ.25 వేల కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది
- ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: డిస్కంలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శక్తికి మించి కృషి చేస్తోందని ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని అధికారులతో విశాఖలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండటం లేదన్నారు. ఎప్పటికప్పుడు బకాయిలను క్లియర్ చేసేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. 2014 నుంచి 2019 వరకు రూ.32,940 కోట్లు బకాయిలుండగా.. ఈ మూడేళ్లలో ప్రభుత్వం సుమారు రూ.25 వేల కోట్లను డిస్కంలకు చెల్లించిందని తెలిపారు. అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ రాయితీలు, ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించిన సొమ్మును వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన ఎరియర్స్ రూ.8,800 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు సిద్ధమయ్యాయని చెప్పారు. కృష్ణపట్నం, విజయవాడ ప్రాంతాల్లో రెండు కొత్త యూనిట్లు అందుబాటులోకొచ్చాయని.. త్వరలోనే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. గతేడాది రోజుకు 180 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా.. ప్రస్తుతం 220 మిలియన్ యూనిట్లకు చేరిందని చెప్పారు. అదనపు కెపాసిటీ కోసం పంప్డ్ స్టోరేజీ హౌస్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. పీక్ అవర్స్‌లో డిమాండ్‌ను చేరుకునేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఈఆర్సీ డైరెక్టర్లు ఠాకూర్‌రామసింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పాల్గొన్నారు.

58 ఏళ్ల తర్వాత కన్నవారింటికి..

- ప్రేమ వివాహం చేసుకుని తమిళనాడు వెళ్లిన గౌరీపార్వతి
- వృద్ధాప్యంలో తల్లి కోరికను నెరవేర్చిన తనయుడు


గౌరీపార్వతితో కలిసి ఆనందాన్ని పంచుకుంటున్న కుటుంబ సభ్యులు


గౌరీపార్వతి

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): పెద్దలను ఎదిరించి ఆంధ్రా అమ్మాయి, తమిళనాడు అబ్బాయి 58 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఆమెకు పుట్టింటి వారితో సంబంధాలు లేవు. ఇప్పుడు ఆమె వయసు 72 ఏళ్లు. చివరి దశలో అయినా పుట్టింటికి వెళ్లాలని, తోడబుట్టినవారిని చూడాలని ఆమె తపించారు. ఆమె కోరికను కుమారుడు నెరవేర్చాడు. 58 ఏళ్ల తర్వాత రెండు కుటుంబాలు ఏకమయ్యేలా చేశాడు. తమిళనాడు రాష్ట్రం ఎట్టాయపురం గ్రామానికి చెందిన నమ్మాళ్వార్ 1960లో నర్సీపట్నం ప్రాంతంలో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులకు వచ్చాడు. ఆ సమయంలో నర్సీపట్నానికి చెందిన మజ్జి గౌరీపార్వతికి, నమ్మాళ్వార్‌కు మధ్య ప్రేమ చిగురించింది. వారి పెళ్లికి పార్వతి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో నమ్మాళ్వార్‌తో కలిసి గౌరీపార్వతి తమిళనాడు వెళ్లిపోయారు. ఇద్దరూ వివాహం చేసుకుని తమిళనాడులోని తూతుకుడి జిల్లా, మేలక్కరంధై గ్రామంలో స్థిరపడ్డారు. నాటి నుంచి గౌరీపార్వతి కన్నవారు, పుట్టిన ఊరు వైపు కన్నెత్తి చూడలేదు. పుట్టింటి వారు కూడా ఆమె గురించి పట్టించుకోలేదు. నమ్మాళ్వార్, గౌరీపార్వతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జన్మించారు. వయసు పెరగడంతో గౌరీపార్వతికి పుట్టింటిని, బంధువులను చూడాలనే కోరిక పుట్టింది. తాను చనిపోయేలోపు ఒక్కసారైనా తన వాళ్లను చూడాలని ఉందని భర్త, బిడ్డలకు చెబుతుండేవారు. తల్లి కోరికను తీర్చాలని ఆమె కుమారుడు షణ్ముగరాజ్ భావించాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల తల్లిని నర్సీపట్నంలోని బంధువుల ఇంటికి తీసుకువచ్చాడు. గౌరీపార్వతి తమ్ముళ్లు, చెల్లెళ్లు వారి పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు మొత్తం వందమంది కుటుంబ సభ్యుల కలయికతో పార్వతిలో ఆనందం వెల్లివిరిసింది. పార్వతి ఇంటికి రావడంపై ఆమె అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ములు వెంకయ్య, వడ్డాది మంగ, మజ్జి సోములు, దాసు, రాంబాబు, వీరబాబు, అప్పారావు ఎంతో సంతోషాన్ని వ్యక్తంచేశారు. ప్రస్తుతం పార్వతి నర్సీపట్నంలోనే తన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.